# భారతంలో ఒక అమ్మాయి



వలివేటి నాగచంద్రావతి

Cl

# భారతంలో ఒక అమ్మాయి

ర చ న

వలివేటి నాగ చంద్రావతి

నాగేశ్వరి పబ్లికేషన్స్
సూర్యారావు పేట, విజయవాడ-520002

ప్రథమ ముద్రణ
ఫిబ్రవరి : 1985

ముఖచిత్రం :
చలం

వెల రు. 13-00

ముద్రణ :
సౌజన్య ఆర్ట్సు ప్రింటర్స్,
విజయవాడ - 3.

# అంకితం

నాలోని రచనా శక్తిని గుర్తించి ప్రోత్సహించి ఒక
రూపు దిద్దిన మా నాన్న గారు శ్రీ॥ శ్రీ॥
కొనకళ్ల వెంకటరత్నం గారికి

- నాగచంద్రావతి

# వలివేటి నాగచంద్రావతి రచనలు

భారతంలో ఒక అమ్మాయి

కాలంకరిచాక

(ఆంధ్రపత్రిక వీక్లీ సీరియల్)

# భారతంలో ఒక అమ్మాయి

అడ్వకేటు జగన్నాథం గారి మనుమరాలు వాసంతికి సంగీతపాఠం ముగించి ఇవతలి కొచ్చేసరికే ఎనిమిదిన్నర గంట అయిపోయింది. చీకటి ముసుగులో పరిసరాలు బితుకు బితుగ్గా అనిపిస్తున్నాయి.

గేటు దగ్గర తటపటాయిస్తూ నిలబడింది కరుణ.

"మెయిన్ రోడ్డమ్మటే వెడితే భయముండదు. నిజమే కానీ తమ ఇంటికది చుట్టుత్రోవ. ఆ జన సమ్మర్దంలో తోసుకు పోవటం, కావాలని రాసుకు పోయే వాళ్ళను తప్పించుకుంటూ నడవటం తనకి కష్టమే కాక అయిష్టం కూడా."

ఒక్క క్షణం వస్తాయించి, పక్కసందమ్మటే చకచక అడుగులు వేసింది కరుణ.

డిసెంబరు నెల సగపడి పడిందేమో చలిగాలి ఒంటిని వణుకెత్తిస్తోంది.

పమిటి కొంగు చెవుల మీదుగా తీసి భుజాల నిండుగా కప్పుకున్నది కరుణ.

మునిసిపాలిటీ వారి దయాధర్మ బిక్షం మీద వెలుగు తున్న వీధిలైట్లు సవతి తల్లి ప్రేమలా గుడ్డి వెలుతురు ప్రసాదిస్తున్నాయి.

శీత గాలికి భయపడి వీధితలుపులూ, కిటికీ తలుపులూ కూడా బిడాయించుకుంటున్నారు అన్ని ఇళ్ళవాళ్ళూను.

కరుణ వేగంగా నడుస్తూ "అమ్మ నాకోసం ఎదురు చూస్తూ వుంటుంది." అనుకున్నది.

నడుస్తూనే పర్సు తెరిచి చూసింది. రెండు సరికొత్త పది రూపాయల నోట్లు మడత పడిన మొగలిరేకుల్లా, అవసరానికి ఆదుకునే ఆప్త బంధువుల్లా ఆమెకు ఆత్మ విశ్వాసాన్ని నూరి పోస్తూ కనిపించాయి.

సంతృప్తిగా జీప్ వేస్తూ, "ఫర్వాలేదు. అమ్మకి టానిక్ కొనగా ఒకటీ అరా మిగలొచ్చు. డాక్టరు చెప్పినట్టు కొన్నాళ్ళ పాటు పాలూ పళ్ళూ కూడా ఇప్పించాలి అమ్మకోలుకుంటే" హటాత్తుగా కరుణ ఆలోచనలకు ఆనకట్ట పడింది.

కోరగా చూస్తూ ఎదురుగా వస్తున్నాడు గిరీశం.

"ఓహో...నువ్వేనా కరుణా! ఇంత పొద్దుపోయి వచ్చేటప్పుడు మెయిన్ రోడ్డమ్మట రాక సందుగొందుల్లో వస్తున్నావేం?" దగ్గరగా వచ్చి మొహంలో మొహం పెట్టి అడిగాడు గిరీశం.

మొహం పక్కకుతిప్పుకుని, ఒక్కడుగు పక్కకు వేసి నడకలో చురుకు పెంచింది కరుణ.

వెనక్కి తిరిగి ఆమెతోపాటు తనూ గబగబ అడుగులు వేశాడు గిరీశం.

"ఈయన ఇప్పుడు ఇక్కడ అందులో కాలి నడకన ఎందుకు వస్తున్నట్టు? తనకోసమే కాపువేయలేదుకదా" కరుణ మనసులో భయమూ బెరుకూ తలెత్తాయి. అసహనంగా నుదురు చిట్లించి, కళ్ళు కుచించి తన అయిష్టాన్ని వ్యక్తం చేసింది.

వీధిలైట్ల క్రీనీడలో అది గమనించినా పట్టించుకోలేదు గిరీశం. తనని కాన్సట్లే ఆమె ననుసరించాడు.

ఇద్దరూ మౌనంగా ఆ వీధి దాటి మరోగల్లీలోకి మళ్ళారు.

ఈ సందు మరీ అధ్వాన్నం అన్నీ పెరటి గుమ్మాలే. జనసంచారం బొత్తిగా లేదు.

కరుణ గుండె హై లెవెల్లో కొట్టుకుంటోంది. మనస్సు

అలజడికి లోనవుతోంది. ఏవో ప్రమాదాలని ఊహిస్తూ పరిపరి విధాల పరుగులు తీస్తోంది.

గిరిశం నడుస్తూనే సిగరెట్ ముట్టించి అగ్గిపుల్ల విసిరేశాడు. ఆ సందులో వున్న ఒకే ఒక వీధి దీపాన్ని దాటాక తాపీగా పొగవదలి, ప్రారంభించాడు.

"కరుణా నేవడిగిన దానికి ఆరోజు సరయిన సమాధానం చెప్పేవేకాదు" అన్నాడు. మొహం ఎంత దీనంగా పెట్టినా ఆ మసక చీకట్లో కరుణకి కనబడే ఆస్కారం లేదని కంఠం లోనే ప్రాధేయత గుమ్మరించాడతను.

నిష్ప్రయోజనమని తెలిసీ చురచురా చూసింది కరుణ.

"నేను మీ కావేళే చెప్పాను నా జవాబు. బుద్ధున్న వారయితే మళ్ళీ నా జోలికి రాకండి" అన్నది విసురుగా.

వెలుతురుంటే ఆ క్షణంలో గిరిశం కళ్ళలో పాకిన ఎరుపుజీరల్ని చూసి కరుణ బెదిరిపొయ్యేదే.

"వంటపుట్టి వంశంలో పుట్టిన దానివి- అందలమెక్కిస్తానంటే నిక్కుపోతావేం కరుణా! ఏం చూసుకుని చెప్పు-నీకీ మిడిసిపాటూ విరగబాటూనూ.

నేనేమన్నా నిన్ను బేరానికి రమ్మన్నానా? పరువుగా పెళ్ళి చేసుకుందామన్నాను గానీ" అతి ప్రయత్నం మీద

తన ఆగ్రహాన్ని అణిచేసుకున్నా మితిమీరిన అహంకారాన్ని అదుపులో పెట్టలేక వ్యగ్యంగా అన్నాడు గిరీశం.

ఈ సందు దాటితే రెండంగల్లో తమ ఇల్లు వచ్చేస్తుంది. ఇక ఎక్కళ్లేని సాహసమూ తెగింపూ వచ్చేయి కరుణకి.

"ఏ వంశమయితేనేం! నీతిగా నిజాయితీగా న్యాయమైన సంపాదనతో మర్యాదగా బ్రతుకు తున్న దాన్ని నేను. ఇక నువ్వా-నువ్వెంత ధూర్తుడివో నాకు బాగా తెలుసునని నీకూ తెలుసు. నిన్ను పెళ్ళాడేకంటే ఉరెట్టుకు చావడం మెరుగు. నన్నింక కవ్వించకు" ఒక్క విదిలింపుతో అతన్ని దాటుకుని ఏక పరుగున సందు మలుపు తిరిగి కనుమరుగయి పోయింది కరుణ.

అమావాస నిశికన్న నల్లగా మాడిపోయింది గిరీశం మొహం. పళ్ళు పటపట కొరికాడు. సిగరెట్ పీక నేలకేసి కొట్టి దాన్ని కాలితో మట్టగిస్తూ "కరుణా...నిన్ను...నిన్ను ఇలా...ఇలా నేలరాయికపోతే చూడు" అంటూ కసిగా గొణిగాడు.

*　　　*　　　*

ఈ ఉపోద్ఘాతానికి ముందు ఎంతో కథనడిచింది వారిద్దరి మధ్యన.

కరుణ తల్లి శకుంతల. శకుంతల తల్లితండ్రు లిద్దరూ వంటలు చేసుకు బ్రతికిన మాట వాస్తవమే.

కానీ శకుంతల అపూరూప లావణ్యం కిన్నెర కంఠ స్వరం ఆమెనా గాడినించి పక్కకు లాగాయి.

కూతుర్ని గొప్ప విద్వాంసురాల్ని చేద్దామనే తలకు మించిన ఆశా కోరికా లేకపోయినా ఇరుగు పొరుగుల వత్తిడితో "పోనీలే-ఖర్చులేని పనేగదా?" అని సంగీత కళాశాలలో చేరిపించారామెను తల్లీ తండ్రీ.

అక్కడే శ్యామ సుందరం ఆమెకు పరిచయమయ్యాడు. అతనక్కడికి సితార్ నేర్చుకోటానికి వస్తుండేవాడు.

శ్యామసుందరం కలిమి కలవారి పిల్లడు. కానీ ఆ ఐశ్వర్యం తెచ్చే అహంభావ మతనిలో మచ్చుకు కనబడేది కాదు.

స్వభావాగా కళారాధకుడతను. సంగీత సాహిత్యాలంటే చెవి కోసుకునేవాడు.

శకుంతల గొంతువిప్పి గానం చేస్తే నాగస్వరం విన్న నాగులా వరవశించి పోయేవాడతను.

ప్రత్యేకించి ఆమె గాత్రం వినటం కోసమే తన క్లాసు అయిపోయినా ఆమె క్లాసుకి అటెండవుతూ వుండేవాడు.

ఆ ఇష్టంతోనే ఆమెను పరిచయం చేసుకున్నాడు. స్నేహం పెంచుకున్నాడు.

సాధారణంగా తరుణంలో వున్న యువతీ యువకుల నడుమనవుండే స్నేహం స్నేహంగానే మిగిలిపోవటం అసాధరణమే కదా!

వారిలో వలపు మోసు లెత్తింది. అనలూ పనలూ సాగింది.

ఏ జంట కథ అయినా ప్రేమ వరకూ పెద్దల ప్రమేయం అక్కర్లేదు కాబట్టి నిరాటంకంగా సాగిపోతుంది. పెళ్ళి, పెద్దల ఆమోదం దగ్గరకొచ్చేసరికి కుంటు పడుతుంటుంది.

వీరికి ఆ అవరోధమే ఎదురయింది.

శ్యామసుందరావికి తల్లి లేదు. తండ్రి కోట్లకి పడగలెత్తే ప్రయత్నంలో వున్న పారిశ్రామిక వేత్త.

ఈ లోతక్కువ సంబంధానికాయన ససేమీ ఒప్పుకోనన్నాడు.

పెద్దకొడుకు లిద్దరూ ఆయనకు వ్యాపారంలో కుడి భుజాలుగా పైసాని రూపాయగా మార్చుతున్న ప్రయోజకులే.

ఆఖరివాడు కూడా బిజినెస్ ఎడ్మినిస్ట్రేషన్ చదువుతూ త్వరలో తండ్రికి సైదోడవ్వటానికి సిద్ధమవుతున్న వాడు.

ఎటుగూడి ఈ శ్యామసుందరమే ఎందుకూ కొరగా కుండా పోయాడు ఆయన దృష్టిలో.

ఎంతసేపూ ఏవో వాయిద్యాలు కొని ఇల్లునింపటం; ఓ సమయం సందర్భం లేకుండా వాట్ని టింగ్ టింగ్ మనిపిస్తూ కాలం వృధా చెయ్యటం; లేకపోతే ఇన్ని పనికి మాలిన పుస్తకాలు ముందేసుకుని వాటి పఠనంలో బాహ్యాలోకస్మృతిని వదలి పెట్టేయటం—ఈ వైఖరి సుతరామూ నచ్చేది కాదయనకి.

ఈ పైత్యమే ఎలా ఒదిలించుకోవటమా అని తల కొట్టుకుంటుంటే ఉట్టుపుడియంగా "ఫలానా వారి పిల్లని చేసుకుంటాను." అని చెప్పి ఇంక మతులు పోగొట్టేశాడు.

వాళ్ళసాంప్రదాయమేమిటి. మనసాంప్రదాయమేమిటి! వాళ్ళు అంతస్తెక్కడ-మన అంతస్తెక్కడ?

"లయన్ భుజంగరావ్ కోడలు ఆప్టారిల్ ఒక వంటలక్క కూతురా? ఇంత కన్న ఘోర అవమానం ఇంకేమి టుంటుంది? కుతకుత లాడిపోయాడతను.

నయానా భయానా చెప్పి చూశాడు. మిత్రులతో చెప్పించీ చూశాడు.

ఉహూం

అన్నీ ఆలోచించుకుని గానీ ఒక నిర్ణయానికి రాక పోవడం, ఒక అభిప్రాయానికి వచ్చాక దాన్నించి వెనక్కి మరలకుండా నిలవటం శ్యామసుందరం తత్వం.

"శకుంతల నొదులు కోవటమంటే నా జీవితానందాన్ని ఒదులుకోవటమే. అంత త్యాగం నేచెయ్యలేను." అని స్పష్టంగా నిబ్బరంగా చెప్పేశాడు.

పసువు తీసే పని చేస్తూ కూడా తన ఎదట అదరకు డా, అన్నమాటమీదే నిలబడ్డ కొడుకుని చూస్తే చిర్రెత్తు కొచ్చింది తండ్రికి.

"నా మాట వినని వాడికి నా ఇంట్లో స్థానం లేదు. తక్షణం బయటికి నడువు" మన్నాడు చివరికి బెదిరింపుగా.

మౌనంగా అంతపనీ చేశాడు కొడుకు.

"ఇక్కడ నా సొమ్ముతో వెర్రివేషాలు వెయ్యటం కాదురా బయట గంజినీళ్ళు పుట్టించుకో...అదెంత కష్టమో తెలిసొస్తే అప్పుడు నువ్వే పరిగెత్తుకొస్తావులే. వెళ్ళరా వెళ్ళు" అని తలుపులు మూసుకున్నాడు తండ్రి.

సరే_ఆయనయితే ఉన్నమాటంటే బాట్టి బెట్టుచూపించాడు. కాదన్నందుకు బాధాలే విడగొట్టుకున్నాడు_ఇక శకుంతల తల్లీ తండ్రీ లేనివాళ్ళు కాబట్టి వారినించి ఏ ఆటంకమూ వుండదనీ, అంత గొప్పింటి కుర్రాడు తమ కుమార్తెను చేసుకుంటాననటమే మహాభాగ్యంగా తలూపేస్తారనీ అనుకుంటే అది పొరపాటే.

వారికుండే భయాలూ సందేహాలూ వారికీ ఉన్నాయి.

ఏదో "గంతకు తగ్గబొంత చూసుకుందాం" అనుకున్న వాళ్ళే తప్ప అందని ఎత్తులకి ఎగురుదా మనుకున్న వాళ్ళు కాదు.

భుజంగరావంతటి ఐశ్వర్య వంతుడి- ముద్దుబిడ్డ, "మీ పట్టిని నే చేపట్టుతానంటూ" రావటం వారికి విస్మయాన్నే కాక ఆందోళన కూడా కలిగించింది.

"లోకం ఏమంటుందో-కూతురు అతన్ని వలలో వేసుకుందను కుంటుందేమో- కొడుకుని విడగొట్టేమనే అపోహలో ఆ తండ్రేమి చర్య తీసుకుంటాడో ఇంతకీ ధనవంతుల బిడ్డడు- ఉడుకు రక్తం పొంగుతున్న వయసు-ఇతని బుద్ధి నిలకడగా వుంటుందా? చివరి వరకూ తమ బిడ్డను సవ్యంగా ఏలుకుంటాడా-?" ఈ అనుమానాలతో వాళ్లూ ఓ పట్టాన ఊ కొట్టలేక పోయారు.

కానీ-"ఎన్ని ఒడుదుడుకులు రానీ, నీ జంట బాయను" అన్న శ్యామసుందరం బాసలు శకుంతల ఏనాడో నమ్మింది.

నమ్మి అతని వెంట వెళ్ళింది.

ఆలయంలో వేణుగోపాలునిసాక్షిగా దంపతులయ్యారు వారిద్దరూ.

కాలం గడుస్తోంది.

నిష్టూర పడినా, నిందవేసినా మెత్తపడక తప్పలేదు శకుంతల తల్లిదండ్రులకి.

శ్యామసుందరం తండ్రి మాత్రం దిగి రాలేదు. మిగతా కొడుకులాయన్ని దిగనివ్వలేదు. ఆయన మనసు ఏ కాస్త కదలబారి కాఠిన్యం సడలించబోయినా ఏవో కొండాలు చెప్పి మళ్ళీ ఆయన కోపాన్ని గట్టిపరుస్తూండే వాళ్ళు.

అవును మరి. తండ్రి ఆస్తిలో ఒక వాటాదారు తగ్గినా తగ్గినట్లే కద!

అక్కడితో ఆగలేదు వారి స్వార్థం.

శ్యామసుందరానికా వూళ్లో ఉప్పు పుట్టనివ్వలేదు. ఓ పక్క పూర్తికాని చదువే ఉద్యోగావకాశాన్ని తగ్గించేస్తుంటే, భుక్తి కోసం అతనే చిన్న ఉద్యోగానికి ప్రయత్నించినా అది అతనికి అందకుండా అడ్డుపడడమే కాకుండా "ఇక్కడుండి మా పరువుకూడా తీస్తున్నావు." అంటూ వాళ్ళు ఆ వూరొదలి పెట్టి పోయేదాకా పూదరకొట్టేశారు.

* * *

కొత్తపూరిలో కొత్త జీవితాన్నారంభించారు శ్యామసుందరం దంపతులు. ఒకనాడు సరదాగా అభ్యసించిన సంగీత విద్య ఈనాడు అక్కరకొచ్చింది. వారికి బ్రతుకు తెరువు చూపించింది.

శ్యామసుందరం కళను ఆరాధించాడు, దాని ఆస్వాదనలో ఆనందాన్ననుభవించాడు, అంతే కానీ వ్యాపార వస్తువుగా ఎప్పుడూ భావించలేదు. తన నైపుణ్యంతో పలువురి ప్రశంసలనందుకోవాలనే తీవ్రమైన ఆ కాంక్ష వుండేదతనికి. ఇప్పుడది పొట్టతిప్పలకోసం వినియోగించాల్సి రావటం బాధాకరమే. కానీ పరిస్థితులలా వచ్చాయి. తప్పలేదు.

అతని దగ్గర సితార్ నేర్చుకునేందుకు వచ్చే కుర్రాళ్ళకంటే శకుంతల దగ్గర గాత్రం నేర్చుకునే ఆడపిల్లలే ఎక్కువ.

అయితే శ్యామసుందరం స్టూడెంట్లందరూ అతనిలాగే సిరిగల పిల్లలు. అందుమూలాన భార్యాభర్తలిద్దరి సంపాదనా సమంగానే వుండేది.

దానాదీన నిత్యావసరాలకి తడుముకోవాల్సిన అవసరం వుండేది కాదు.

దరిమిలా చిన్న ఉద్యోగం కూడా దొరికించుకున్నాడు. కానీ తన సంగీత విద్యార్థులని ఒదులుకోలేదు శ్యామసుందరం. సంసారంలో ఝుం ఝుూటం పడి వచ్చిన విద్య మరువకుండా అదే సాధనగా ఉన్నదతనికి.

తగుమాత్రం సంపాదనికి దారి దొరికింది. సంసారం సాఫీగా ఒడిదుడుకుల్లేకుండా సాగిపోతోంది.

ఒక్కసారిగా భోగభాగ్యాల నడుమనించి ఒతి సామా

న్యంలోకి జారినందుగ్గానీ, "దివ్వెటీలా వెలిగిపోలేను" అని ఆశించిన భవిష్యత్ ఇలా కొవ్వొత్తి వెలుగులా వెలాతెలా పోతున్నందుగ్గానీ శ్యామసుందరమెప్పుడూ విచారించలేదు. తనది తొందరపాటేమోనని పశ్చాత్తాప పడలేదు.

తాను ఎన్నుకున్న త్రోవలో కొన్ని ఆటంకాలుంటే వుండవచ్చు. వాటిని మెలుకువగా తప్పించుకుని ముందుకు సాగితే పువ్వవంటి బ్రతుకునీ, మకరందం వంటి మాధుర్యాన్ని అందుకోగలననే గాఢమయిన నమ్మకమతనికి వుండేది.

శకుంతల సాహచర్యం అతనికా ధీమానీ బలాన్నీ పెంపొందించింది.

కరుణ పుట్టుక అతనిలో సరికొత్త కోరికల్ని రేపింది. తాను ఆర్జించలేకపోయిన కీర్తి ప్రతిష్టలు కూతురుతో భర్తీ చేయించాలనే ఆశకలిగింది శ్యామసుందరానికి.

తల్లి అందచందాలూ, శ్రావ్యమయిన కోకిల కంఠ స్వరమూ పుణికి పుచ్చుకున్నది కరుణ. చిన్నవయసులోనే తల్లితండ్రిని మించిన ప్రతిభ కనబరిచి తండ్రి కంటూన్న కలలకు రూపులు దిద్దింది.

లాంఛనంగా ఒక సుముహూర్తాన పురప్రముఖులు నలుగుర్నీ ఆహ్వానించి టౌన్‌హాల్లో తొలిసారిగా కరుణ చేత కచేరి చేయించారు శ్యామసుందరం.

ఆనాడు శ్యామసుందరానికి ఓ పండుగ. కూతురుగాన మాధుర్యానికి తన్మయిమొందిన శ్రోతల్ని చూస్తూ తన జన్మ ధన్యమయిందని మురిసిపోయాడు శ్యామసుందరం.

ఆ మధురానుభూతి ఎన్నాళ్ళో అతనికి దక్కనేలేదు. వచ్చిన పని అయిపోయినట్టుగా నాలుగురోజుల విషజ్వరంతో ఈ లోకం నుంచి శెలవు తీసుకున్నాడు అతను.

దిక్కులేని పక్షులయిపోయారు తల్లీకూతుళ్ళు. జీవచ్ఛవంలా మారిపోయింది శకుంతల. శ్యామసుందరమామెకు భర్తే కాదు, ప్రేమికుడు, స్నేహితుడు, గురువు ఆమె సర్వస్వమే అతను. అతని వియోగం ఆమెను చెప్పలేనంతగా కృంగదీసింది. బ్రతుకుపైన ఇష్టతే నశించింది.

కానీ తమ ప్రేమఫలం కరుణ వున్నది. బ్రతకక తప్పలేదు.

"ఎప్పుడు ఈ బొందినించి విముక్తి లభిస్తుందా" అని నిరీక్షిస్తుంటే ఆమెకు సహజంగానే శరీరమంటే నిర్లక్ష్యమేర్పడిపోయింది. ఫలితంగా ఎప్పుడూ ఏదో సుస్తీ ఆమెను అంటిపెట్టుకునే వుండేది.

వ్యధభరిత హృదయంలో కోరికలుద్భవించక పోవచ్చు. విరక్తి చెందిన మనస్సు ఇహ లోకబంధనల పట్ల ఐక్యత కనబ

రచవచ్చు. కానీ ఊపిరి ఆడుతున్నంతవరకూ క్షుద్బాధ అణుచుకోవటం మాత్రం మానవులకి అసాధ్యం.

శ్యామసుందరం మరణానంతరం వారి జీవన భృతి ఇరుకున పడింది.

పూర్వంలా గొంతెత్తి పాడి పిల్లలకు నేర్పే ఓపిక, శ్రద్ధా ఉత్సాహం భర్తతోపాటే పోయేయి శకుంతలమ్మకి. ఆమెకి తల్లిదండ్రులిచ్చిన మెరక భూమి కొంత వుంది. దానిమీద ఆయివేజు అతిస్వల్పం. వారికది ఏ విధానా చాలటం లేదు.

అందుమూలాన తండ్రి వారసత్వం తను స్వీకరించక తప్పలేదు కరుణకి.

శ్యామసుందరం బ్రతికి వుండగా కూతుర్ని దగ్గర కూర్చోపెట్టుకుని తన మనసులో మెదుల్తున్న బంగారు టూహల్ని పోగు చేసి వర్ణించి చెప్పేవాడు.

"అమ్మలూ నువ్వు నా ఆశల దీపానివి. నిన్ను నా సర్వశక్తులూ ధారపోసి వెలిగిస్తానమ్మా. నీ కాంతి ఈ దేశపు పొలిమేరలు దాటేంతగా ప్రజ్వరిల్లిపోవాలి. ప్రసిద్ధ గాయకుల కోవలోకి నిన్నూ చేర్చి నలుగురూ "ఓహో" అన్ననాడు ఆ అదృష్టం నీది కాదు తల్లీ నాది" అనేవాడు.

శిష్యురాళ్ళకు సరిగమలు నేర్పుతూ తండ్రి తనమీద పేర్చుకున్న స్వర్ణస్వప్న సౌధాల తలపుకు వచ్చి కళ్ళు చెమ్మగిల్లేవి కరుణకి.

"మీరు కలపోసినంత భాగ్యశాలిని కాదు నాన్నా. నా కంతటి అదృష్టమే వుంటే మీరు నాకు కరువయ్యేవారే కాదు." అనుకుని నిట్టూర్పుస్తుండేది.

వచ్చే బాబడి తగ్గింది. కూర్చుని కుదించుకోవట మెట్లాగో తెలీడం లేదు.

రోజూ పంచభక్ష్యాలు తింటం లేదు. పట్టుపీతాంబరాలు కట్టలేదు. విలాసాలు ఆడంబరాలు మొదలే లేదు.

రెండు పూటలా గుప్పెడు పచ్చడి మెతుకులూ, వంటి మీదో బట్టా బండ మీదో బట్ట. ఇందులో ఏది అనవసరమని తగ్గించేట్టు?

శకుంతలమ్మ అనారోగ్యమొకటి. "నాగురించి పట్టించుకోకు" అంటుంది గానీ తనకు "నా" అంటూ మిగిలిన జీవి ఆవిడొక్కటి. ఆవిణ్ణి కూడా నిర్లక్ష్యం చేసి ఎలా దూరం చేసుకుంటుంది?

తల్లిని దక్కించుకోవటం కోసమన్నా తను ఇంకొంచం సంపాదించే మార్గం చూసుకోవాలి.

కాని తనకింకేం వచ్చని - ఈ సరిగమలు తప్ప!

కరుణ ఇంకొన్ని ట్యూషన్లు ఒప్పుకున్నది. అప్పటిదాకా ఇంటి దగ్గర చెపుతుండేది. ఇప్పుడు కుదుర్చుకున్న వాళ్ళకి ఇళ్ళకి వచ్చి చెప్పాలి. ఇబ్బందే. శ్రమే. "వయసులో

వున్న ఆడపిల్లవి. పదిమంది ఇళ్ళకి తిరుగుతావా? వద్దు." అని తల్లి కూడా మందలించింది. కానీ వాళ్ళిచ్చే ఫీజు ఎక్కువ. అంచేత ఒడబడింది.

* * *

ఆరోజు వాణి పుట్టినరోజు. వాణి మేజిస్ట్రేట్ గారి అమ్మాయి. కొత్తగా కుదుర్చుకున్న ట్యూషన్లలో ఆ అమ్మాయిదొకటి.

"ఈ రోజు నా బర్త్ డే టీచర్. సాయంత్రం చిన్న పార్టీ వుంది. మీరు తప్పకుండా రావాలి" అని ఆప్యాయంగా చెప్పింది కరుణతో. ట్యూషన్ అయిపోయాక వచ్చేస్తుంటే ఆ అమ్మాయి తల్లికూడా "మరిచిపోకుండా రండి" అని ఆహ్వానించింది.

ఇలాంటి పార్టీలు, నలుగురి మధ్యకి వెళ్ళటాలు కరుణకి అలవాటులేని పని. గొప్పవారింటి ఫంక్షన్లో తనలాంటి బీదవాలి స్థానమేపాటిదో కరుణకి తెలింది కాదు.

కానీ ఆ అమ్మాయంటే కరుణకి అభిమానం కొంత స్వయం ప్రతిభ, నేర్చుకోవాలనే తహతహా ఉన్న విద్యార్థులంటే ఉపాధ్యాయులకి సహజంగానే అభిమానమేర్పడుతుంది.

ఆ అభిమానం కొద్దీ "అలాగే" అన్నది కరుణ.

కానీ కరుణ అనుమానం నిజం కాలేదు.

వాణి తల్లిదండ్రులు మంచి సంస్కారవంతులు. ఆమెను ఎంతగానో ఆదరించారు. "అపరగాన సరస్వతే వీరు. మా అమ్మాయికి టీచర్‌గా దొరకటం మా అదృష్టం" అంటూ అందరికీ పరిచయం చేశారు. పార్టీ చివరన మీ పాట వినిపిస్తే గానీ వీల్లేదని బలవంత పెట్టేరు.

ముందు కృష్ణశాస్త్రి గేయమొకటి పాడి ఆపుచేద్దామనుకున్నది. ఉహు. వచ్చిన వాళ్ళెవరూ ఊరుకోలేదు. రెండు ఎంకి పాటలూ, మర్రెండు బంగారిమామ పాటలూ పాడితేగానీ ఆపనివ్వలేదు.

పాట ఆగింది. పెద్దపెట్టున హర్షధ్వానాలు చెలరేగాయి

ఒకాయనయితే ముందుకు వచ్చి కరుణ చేయి పట్టుకు ఊపేశాడు.

"ఒహోహో...అద్భుతం..." అత్యద్భుతం...కిన్నెర కంఠం, గంధర్వ గానం అంటే ఎలా వుంటుందో రుచి చూపించేరు" అంటూ గొప్పగా ప్రశంసించేడు.

అతనే గిరీశం.

గిరీశమనబడే ఈ దుష్టగ్రహ వీక్షణం ఆ దుర్ముహూర్తంలో తనమీద ప్రసరించబడిందనీ, ఆ క్షణాన్నించే తన జీవి

తంలో చెడ్డదినాలు మొదలయాయని తెలుసుకోలేని ఆ అమాయకురాలు. "వీరు గిరీశంగారు పురప్రముఖుల్లో ప్రముఖులు." అని మేజస్ట్రేట్‌గారామెకు పరిచయం చేస్తూంటే "ఇవాళెంత మంచిరోజు! ఇంత గొప్పవార్ని కంటికి ఆనానంటే నాదెంత అదృష్టం!" అని గండ పెండేరం తొడిగి, గజారోహణం చేయించినట్టే పొంగిపోయింది కరుణ.

గిరీశం భార్య వర్ధని మటుకు అంత సరసమూ సుహృద్భావమూ వున్న మనిషిలా కనిపించలేదు. అది ముభావంగా అభినందిస్తూనే కరుణని క్రిందినించి పైదాకా నిలువునా ఓసారి పరిశీలించి చూసింది.

"ఏ సుబ్బలక్ష్మి స్థాయికో చేరాల్సిన విద్వత్తుగలదానివి నువ్వు. ఘనీపాటి తద్దినం మంత్రాలు వల్లించాల్సి వచ్చినట్టు ఇలా రాగజ్ఞానమే లేని పసివాళ్ళకి సరిగమలు నేర్పవలసి రావటమేమిటి-దురదృష్టం కాకపోతే..." అని గిరీశం సానుభూతి ప్రదర్శించటమూ, ఎడ్రస్ అడిగి రాసుకోవటమూ, ఏ అవసరమున్నా నన్ను కలుసుకోవటానికి సందేహించొద్దు" అని మరీ మరీ చెప్పటమూ ఆవిడకంతగా నచ్చినట్టు లేదు.

కరుణతో ఆయన సంభాషిస్తున్నంతసేపూ ఆవిడ అసహనంగా కదలటమూ, "ఆలస్యమయింది ఇక వెడదామా?" అని ఊ...తొందరించటమూ, అయిష్టానికి సూచనగా నుదురు కొద్దిగా చిట్లించుకోటమూ కరుణ దృష్టిని దాటిపోలేదు.

కన్న తండ్రిని గుర్తుకు తెస్తున్న గిరీశం ఆదరానికి ఓ పక్క కనులు చెమరిస్తున్నా ఆమె ప్రవర్తన ముల్లు గుచ్చిన ట్టుగా బాధ కలిగించింది కరుణకి.

అంచేతే గిరీశం "అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తూం డండి." అని ఆహ్వానించినప్పుడు నవ్వేసి వూరుకుంది.

"ఊహూ-ఏదో ఫార్మాలిటీ కోసం చెప్పట్లేదు నేను. తప్పకుండా రావాలి. ఏదీ వస్తానని ప్రామిస్ చేయండి." అని బలవంత పెట్టేడు గిరీశం.

"సారీ—ఈ విషయంలో మీరు క్షమించాలి నన్ను. నా వృత్తేమిటో తెలుసు కదా మీకు. క్షణం తీరుబాటు వుండదు." మర్యాదగా తిరస్కరించింది కరుణ.

ఫంక్షన్ ముగిసింది. ఒక్కరొక్కరుగా వెళ్ళిపోతున్నారు.

కరుణకూడా మేజిస్ట్రేటు దంపతుల దగ్గర శెలవు తీసు కుని బయటకు వచ్చింది.

కారు డోర్ తెరుస్తున్నాడు గిరీశం.

"రండి. ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను." అన్నాడు కరుణని చూసి.

ఊరుపు బిగబట్టి చూస్తోంది వర్ధని ఏమంటుందా అని.

కరుణ తల అడ్డంగా తిప్పింది.

"అవసరం లేదండి. పక్కసందులో ట్యూషనుంది. అది చూసుకుని వెడతాను."

బరువేదో దించుకున్నట్టు తేలికగా ఊపిరి వదిలింది వర్ధని.

నవ్వుతూ చేతులు జోడించింది కరుణ.

కారు కదిలిపోయాక నడకసాగించింది. పక్కవీధి ట్యూషన్ మాట అబద్ధమే. కారు ఎక్కడం ఇష్టంలేక అలా చెప్పిందంతే. వర్ధని బిగదీసుకున్న మొహం చూశాక వారితో కలిసి వెళ్ళటానికి మనస్కరించలేదామెకు.

"ఏమి ఆడవాళ్ళో-! ంత పేరూ ప్రతిష్టా గల పెద్ద మనిషికి ఏ నిక్కూ లేదు. సౌమ్యంగా సాయిలా పాయిలా గానే వున్నాడు కందకులేని దురద కత్తి పీటకని— ఆయన భార్య అవటం మినహా ఏ ప్రత్యేకత వుందని ఆవిడకా టెక్కు.

భర్తతో మాట్లాడే ఆడాళ్ళందరూ అతన్ని ఎగరేసుకు పోతారనే అనుమానమా-? లేకపోతే తమ హోదాకు తగు వారము కామనే తృణీకారమా-?

ఏమిటావిడ వైఖరి కర్థం.

దారి పొడుగునా ఆలోచనల్లో వర్ధని ప్రవర్తనని నిరసిస్తూ విమర్శిస్తూనే వున్నది కరుణ.

*　*

మర్నాటి నుంచీ మళ్ళీ రొటీనే.

క్రితం రోజు జరిగింది మనసు పొరల్లో నిక్షిప్తమయిన ఒకానొక జ్ఞాపకం మాత్రమే.

హఠాత్తుగా టాక్సులు పెరిగాయంటూ ఇంటి అద్దె రెట్టింపుగా పెంచాడు ఇంటి యజమాని.

తండ్రి పోయాక ఇప్పుడిస్తున్న అద్దె భరించటమే కష్టంగా వుంది. ఈ అదనపు బరువు తను మోయలేనిదే.

ఇంకో ఇంటి వేటలో పడింది కరుణ.

ఆ రోజు పక్కవాళ్ళ పనిమనిషి తనున్న పేటలో అద్దెకో ఇల్లుందని చెబితే వెళ్ళి మాసొస్తున్నారు తల్లీకూతుళ్ళు.

ఆ ఇల్లు వాళ్ళకంత వచ్చలేదు.

ఇంటికి కరెంట్ లేదు. నీళ్ళ సౌకర్యం లేదు. చుట్టు పక్కల వాతావరణం కూడా అంత నచ్చలేదు శకుంతలమ్మకి. కరుణ ప్రైవేటు ఇళ్ళకు కూడా చాలా దూరమవుతుంది. అంత చేస్తే తమకి కలిసి వచ్చేదికూడా అతి స్వల్పం.

ఈ ఇబ్బందులన్నీ చెబుతూ "ఈ మాత్రానికి మారటం అనవసరం కదా! ఎల్లాగో అక్కడే సర్దుబాటు చేసుకుంటే సరి పోతుంది" అంటుంది శకుంతలమ్మ.

ఊకొట్టూ వింటోంది కరుణ.

దారి ప్రక్కంటే నడుచుకొస్తున్న వారిని రాసుకుంటు న్నట్టుగా ముందుకు వెళ్ళి సడన్‌గా ఆగింది కారు.

భయంలో తల్లిచెయ్యి పట్టుకుని పక్కకు లాగి తానూ రెండడుగులు పక్కకి వేసి కారుకేసి చురుగ్గా చూసింది కరుణ.

"హలో" అన్నాడు కారు వెనక సీట్లో నించి గిరీశం.

కోపం మూలాన నుదుట ముడిపడిన రేఖలు విడివడు తోండగా ఆయన పలకరింపుకు బదులుగా "నమస్కారం" అన బోతూ అప్రయత్నంగా ఆయన పక్కకు చూసింది.

వర్ధని లేదు. రిలీఫ్‌గా అనిపించింది.

"ఎక్కణ్నించి వస్తున్నారు?" అడిగాడు గిరీశం.

చెప్పింది.

"అరె-మీకు ఇల్లు కావాలా? చెప్పారు కాదేం...?"

కరుణ మొహమాట పడుతూ ఇబ్బందిగా చూసింది.

"తను రెండు గదులున్న పోర్షన్ వదిలేసి ఒక్క గది, గది పెట్టు నివేశనం కొరకు వెతుక్కుంటున్న ఘనకార్యాన్ని ఆయనదాకా తీసుకుపోవాలా తను...భలేవాడే.

"సరె-తర్వాత మాట్లాడుకుందాం. ముందు కారె క్కండి." అంటూ డోరు తెరిచి కారు దిగాడు.

"రండమ్మా ఎక్కి కూర్చోండి. కొంచెం ముందుకి వంగి అతి గౌరవంగా శకుంతలమ్మని సంబోధిస్తూ అన్నాడు.

ఒక్క క్షణం సంకోచించింది కరుణ. కానీ అంతలోనే ఒక నిర్ణయానికి వచ్చేసింది. తానయితే ఎంత దూరమయినా నడవగలదు. అలవాటు పడిపోయింది. కాని తల్లిది బలహీన శరీరం. వెళ్ళేప్పుడు కూడా రూపాయి ఖర్చెందుకనీ నడిచే వచ్చారు. చెమటలు కక్కుతూ అడుగులు వేస్తున్న తల్లిని చూస్తూంటే ప్రాణం గిలగిల్లాడుతోన్నా ఆర్థిక సూత్రాన్ని త్రోసిపుచ్చే సాహసం లేక ఇప్పుడు కూడా రిక్షా మాట్లాడుకుందామనకుండా వూరుకున్నది.

అనుకోకుండా ఆవిడ శ్రమతప్పించే అవకాశం వచ్చిందిప్పుడు. వెనకాడ్డం సరి అయిన పని అనిపించిలేదు.

పైగా వర్ధని పక్కన లేదు. కరుణ తల్లితో సహా కారెక్కి కూర్చుంది.

కారు బయలుదేరాక గిరీశం తానెవరో శకుంతలమ్మకి వినయంగా తెలుపుకున్నాడు. కరుణతో పరిచయాన్ని గొప్ప అదృష్టంగా వర్ణించాడు. ఆమె ప్రతిభను ఆకాశానికెత్తాడు. ఆమెను కన్న ఈమె జన్మధన్యమన్నాడు.

కరుణ నవ్వి, స గీతంలో తన తల్లిదండ్రులెంత నిధులో చెప్పింది.

"ఈ స్థిరాస్థి నాకు వారినుంచి సంక్రమించిందేనండీ." అన్నది.

గిరీశం కళ్ళు పెద్దవి చేశాడు.

"చెప్పారేం వంశానికే వీణాపాణి ముద్ర వున్నదన్న మాట." అన్నాడు విస్మయాన్ని ధ్వనిస్తూ.

ఆ తర్వాత వాళ్ళు ఇల్లు మారాలిసిన అగత్యమేమిటో అడిగాడు గిరీశం.

బీదరికమన్నది సిగ్గుపడాల్సింది, అసహ్యించుకోవాల్సింది కాదని కరుణకీ తెలుసు. కానీ బీదార్పులు అరుస్తూ దాన్ని చాటుకోవటం గిట్టదు. ఎదుటివారు తమ స్థితికి సానుభూతి చూపించినా, జాలి కనబరిచినా చిరాగ్గా వుంటుంది. అభిమానంగా వుంటుంది.

కూతురు మాట మార్చాలని ఎందుకు చూస్తుందో తెలీ లేదు శకుంతలమ్మకి. ఈ మాత్రంగానన్నా అడిగేవాళ్ళు మనకెవరున్నారు. అనుకుంటూ, "ఒక్కమాటుగా పాతిక రూపాయలు అద్దె పెంచేశారు బాబూ. తూగలేక ఇంకో ఇల్లు చూసుకుంటున్నాం." అని వున్నవిషయం చెప్పేసింది.

"మంచి సమయానికే కలిశానన్నమాట మిమ్మల్ని." అన్నాడు గిరీశం అది విన్నాక.

అర్థం కానట్టు చూసింది శకుంతలమ్మ. బయటకు చూస్తున్న కరుణ కూడా తలతిప్పి చూసిందతని వైపు.

"మా ఔట్ హౌస్ ఖాళీగా పడివుంది తాళం వేసి. మీ కభ్యంతరం లేకపోతే దాన్లో చేరిపోండి." అన్నాడు. ఆయన న్నదేమిటో అర్థం కావటానికి ఓ నిముషం పట్టింది ఇద్దరికి.

"మా ఇల్లు అన్నిటికీ సెంటర్లో వుంది. మీరు ట్యూషన్లకి వెళ్ళేందుకు చాలా వీలు. మీరు ఇప్పుడుంటున్న ఇంటికి కూడా దగ్గరే కాబట్టి ఇంటికి వచ్చే పిల్లలకు కూడా అనుకూలమే." చెబుతున్నాడు గిరీశం.

"తాము తలబద్దలు కొట్టుకుంటున్న సమస్య ఇంత సులువుగా పరిష్కారమయిపోతోందా?" నమ్మశక్యం కావట్లేదు శకుంతలమ్మకి. "ఇంత ఆత్మీయతతో ఆదుకునే మనిషున్నాడని ఒక్కనాడూ చెప్పింది కాదేం కరుణ."

కానీ శకుంతలమ్మ వదనంలో కనబడిన అంగీకారం కరుణలో కనబడలేదు గిరీశానికి.

"ఏమిటి సంశయిస్తున్నారు? మీ అంటి వారికి సన్నిహితంగా వుండే భాగ్యమన్నా మాకు కలగనీ కూడదా!"

కరుణ తొట్రుపాటు పడింది. "అబ్బే...అదేం కాదు మీకు ఇబ్బంది అవుతుందేమోనని..." అని నసిగింది.

అసలామె సందేహ కారణం వర్ధని.

"ఇబ్బందా? నయం. ఇబ్బందేముంది! ఇంట్లో ఒక్క దాన్నీ వుండలేక పోతున్నానని వర్ధని ఒకటే గొడవ పెడు తూంటుంది. మీరొస్తున్నారంటే చాలా సంతోషిస్తుంది కూడాను. మరి ఆ విషయంలో సంశయం పెట్టుకోకండి.

కానీ కరుణ ఇంక ఏదో సందేహావేశం ఒదలని దాని లానే వుండిపోయింది.

"మీరు చెప్పండమ్మా! ఏమిటి అభ్యంతరం?" గిరీశం శకుంతలమ్మ నుద్దేశించి అడిగాడు.

కూతురు మౌనం ఎందుకో తెలియలేదు శకుంతలమ్మ కిను. అడిగే సావకాశం లేదు. ఆవిడ మనసుకి మాత్రం ఇలా తాత్సారంచేసి, వచ్చిన అవకాశాన్ని జారవిడవటం తెలివి తక్కువేమో అనిపించింది.

"మీరు అంతగా చెబుతుంటే కాదని ఎలా అనగలం బాబూ అలాగే వచ్చేస్తాములెండి." అన్నది.

"సంతోషమమ్మా." నిజంగానే విజయం సాధించిన ఆనందం కనిపించిందతనిలో. "రేపు మంచి రోజే అనుకుం టాను. మా డ్రైవరు బండ్లు మాట్లాడుకుని వస్తాడు. సామాన్లు వేసుకొని వచ్చేయ్యండి." ధోరవగా అని. కరుణ వంక చూసి "అమ్మగారు ఒప్పుకున్నారు. మీరిక అడ్డు చెప్పొద్దు"అన్నాడు నవ్వుతూ.

"అది సరే. మీరు అద్దె తీసుకోవంటే మాత్రం రాలేము ఖచ్చితంగా అన్నది కరుణ. ఏదో దయాధర్మలక్షణంగా సహాయంచేద్దామనుకుంటున్నాడేమోనన్న అనుమానం ఇంకా ఒదలలేదు ఆమెని.

"నాకు అద్దె ఇస్తారా...అహహ..." నవ్వబోయిన వాడల్లా బిగదీసుకుంటూన్న కరుణ మొహం చూసి ఆగాడు గిరీశం. "సరే_ మీకా విషయంలో పట్టుదల అయితే నేను కాదనను. అక్కడ ఇస్తున్నంతే ఇవ్వండి అది కాకుండా అదనపు చార్జీ ఏమిటంటే అడపా దడపా మీ మధుర గానంతో మాకు విందులు చేస్తుండాలి. అద్దె బకాయికన్న వూరుకుంటానుగానీ దీనికిమాత్రం బకాయి వుండకూడదు. ఆ...అంతే" నవ్వుతూ అన్నాడు గిరీశం.

కారు కరుణ ఇంటి మలుపు దగ్గర ఆగింది.

* * *

చుట్టూ ఎత్తయిన ప్రహరీ. ఎకరం ఖాళీ స్థలంలో హుందాగా నిలబడ్డ ఆ భవనం కేసి అబ్బురంగా కొంచెం బెదురుగా చూస్తూ నిలబడిపోయింది కరుణ.

గిరీశం ధనవంతుడని తెలుసు కానీ ఎంత ధనవంతుడ

నేది మాత్రం తెలియదు ఆమెకు. తెలుసుకోవాలసిన అవుస రమూ కలుగలేదు.

గిరీశం తాత తండ్రులిద్దరూ తరతరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తిపాస్తులు గడించి ఇతని పరం చేసిపోయేరు.

గిరీశం తాత బ్రహ్మయ్య అయిదారొందల ఎకరాల భూస్వామి. పండినా ఎండినా, కరువయినా కాటకమయినా దయాదాక్షిణ్యాలు తలపక కనికరమనేది లేకుండా కౌలుదార్ల రక్తం పిండి తనకు రావాల్సిన ముక్కా దమ్మిడీ పారుపోకుండా వసూలు చేసేవాడట ఆ రోజుల్లో ఆయన పరమకర్కోటకుడని ప్రతీతి.

బ్రహ్మయ్యగారి కొడుకు శివయ్య, తండ్రికి మించిన కొడుకని పేరు పడ్డాడు. కౌలుదారు చట్టం రూపురేఖలు గవర్నమెంటు వూహాపోహల్లో వున్నదన్న వార్త వింటూనే పొలాలన్నీ అమ్మేసి శ్రీ మహాలక్ష్మిని ఇనప్పెట్టెలో బంధిం చేశాడు.

ఆపైన ఇల్లు కదలకుండా వడ్డీ వ్యాపారం చేసి లక్షలు గడించాడు అతని చక్రవడ్డీలతో కూలిన కుటుంబాలనేకం.

పాపపుణ్యాలెంచక, కొండంత ఆస్తుల్ని గుట్టు చప్పుడు కాకుండా గుటుక్కుమనిపించి, రుణస్తుల్ని బికారుల్ని చేసి వదిలిన ఘట్టాలని కథలుగా చెప్పుకునేవారప్పట్లో.

గిరీశం హాయాం వచ్చింది. ఇతను సౌమ్యుడు. ధనసంపాదన ఒక్కటే ప్రధాన లక్ష్యం కాకూడదని తెలుసుకున్నాడు. తాతతండ్రుల అపకీర్తిని చాలావరకూ మాపుచేయ ప్రయత్నించాడు.

వారి పేరున సత్రాలు కట్టించాడు. అనాధశరణాలనీ, బీద విద్యార్థుల వేతనాలకీ విరివిగా విరాళాలిచ్చాడు. ఎవరే సత్కార్యం తలపెట్టి చేయిజాచి అడిగినా, ముందూ వెనకా చూడకుండా పెద్దమొత్తాల్లో చందాలు ఇచ్చేవాడు.

తద్వారా తాతతండ్రుల చెడ్డపేరుతొలగిందో మానిందో గానీ గిరీశం పేరు మాత్రం ధర్మదాతల లిస్టులో మొదటి దయింది. అతని దయాగుణాన్ని అందరూ ప్రశంశించటం మొదలుపెట్టారు.

అంతకు ముందు అతని ఐశ్వర్యాన్ని తాత తండ్రీ వదిలిపోయిన ముదనష్టంగా చిత్రించిన వారే ఇప్పుడు పువ్వుకు తావి అబ్బినట్టున్నదని వర్ణిస్తున్నారు. అతనే పని చేసినా "ఓహో" అంటున్నారు. ఏది ప్రారంభం చేసినా "మీ ఆశీర్వాదం వుండాలి" అంటున్నారు. లోకనైజమే అది.

ఇక గిరీశం ఆర్జన విషయం తీసుకుంటే—— కొన్నాళ్ళు ఏవేవో వ్యాపారాలు చేశాడు. అవి అంతగా లాభించినట్టు తోచేది కాదు చూపులకు. కానీ అతని ఆదాయం పెరగటమే కానీ తరగ్గలేదు ఎందుకనో,

కొన్నాళ్ళు ఈ వ్యాపారాలన్నీ కట్టిపెట్టి, మునిసిపాలిటీ ఎన్నికల్లో నిలబడి నెగ్గాడు. చైర్మన్‌గా అయిదేళ్ళు వెలిగిపోయాడు. ఆ తరువాత నించీ తను నిలబడకపోయినా ఎన్నికయిన ప్రతి చెయిర్మనుకీ ప్రధాన మద్దతుదారుగా వుంటూ వస్తున్నాడు.

ప్రస్తుతం అతను చేస్తున్నానంటున్నది ఎక్స్‌పోర్టు, ఇంపోర్టు వ్యాపారం.

ఆ పేరున నెలకు పదిహేను ఇరవయి రోజులు ఇంటిపట్టునుండడు. వూళ్ళు పట్టుకు తిరుగుతుంటాడు.

ఇక దివాణమంత ఇంటికి బిక్కుబిక్కు మంటూ వర్ధని ఒక్కతే.

కరుణ రాకని వర్ధని ఆమోదించినట్టుగానీ వ్యతిరేకించినట్టుగాని అగుపించలేదు. నిర్లిప్తంగా ఆహ్వానించిందంతే.

కానీ ఆ నిర్లిప్తం వెనక ఏదో వున్నదనిపిస్తోంది.

వ్యక్తం కాని ఆ భావమేమిటో?

ఏమయితేనేం! ఆవిడ గురించి అట్టే ఆలోచించదలచలేదు కరుణ.

"అసలావిడతో అంటీ అంటనట్టుగా వ్యవహరిస్తే సరిపోతుంది. దేవుడు మేల్జేసి వారి ఇంటికి, ఔట్‌హౌస్ సంబంధం లేకుండా సెపరేట్‌గా వుంది. ఇంటి వారితో ఎటువంటి

ఎటాచ్‌మెంటూ లేకుండానే తమ పని తాము చేసుకో వచ్చును.

అంతగా కాని పరిస్థితి వస్తే అప్పుడే చూసుకోవచ్చును అద్దె కొంప శాశ్వతమా! ఈ ఇల్లు కాకపోతే మరో ఇల్లు.

రోజులు మామూలుగా నడుస్తున్నాయి.

ఆరోజు బయట చెప్పే ట్యూషన్లు ముగించుకు వచ్చింది కరుణ. చిరాగ్గా వుండే తలారా స్నానం చేసి కిటికీ దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చుంది.

"ఇంకో గంట తరవాతగ్గానీ ఇంటి దగ్గర పాఠం నేర్చుకునే పిల్లలు రారు. అంతవరకూ ఖాళీనే."

కరుణ పడక కుర్చీలో వెనక్కి వరిగింది విశ్రాంతిగా.

కిటికీ వూసల మధ్యనించీ గిరీశంగారి భవనం మౌన వ్రతంలో వున్న మునీశ్వరుడిలా నిశ్శబ్దతో మునిగి కనబడుతోంది.

మనసుది కోతిబుద్ధి. ఒద్దన్న వైపుకే పరుగులు పెడుతుంది.

"ఆవిడ సంగతి మనకేల!" అనుకుంటూనే కరుణ వూహాల్లో వర్ధని జొరబడింది.

అంత ఇంట్లో ఒక్కతీ ఏం చేస్తుందో-ఇరుగుపొరుగుతో నన్నా మాట్లాడినట్లు కనిపి చదేం? బయటి కన్న అట్టే రాదు.

బందీలా ఆ నాలుగ్గోడల మధ్యనే వుంటే ఏం తోస్తుందో! పాపం! ఏదేదో అపోహ పడిందిగానీ తననుకున్నంత అతిశయం వున్న మనిషిలా లేదు మరి. ఆ ముభావం ఆవిడ స్వభావ మేమో.

ఎప్పుడయినా యాదాలాపంగా ఎదురయితే పలకరించదు గానీ నవ్వే ప్రయత్నం చేస్తుంది. నేనయితే తనకా నవ్వులో ఏదో వెలితీ, ఆ కళ్ళలో ఏదో దిగులూ కనబడతాయేం." ఓ పిల్లజమిందారంతడి వాడి భార్య. ఆవిడికేం తక్కువనీ? పిల్లలు లేరనేమో? ఏమో మరి.

ఈవిడకి శుద్ధవ్యతిరేకం ఆయన. వూళ్లో వున్న నాలుగు రోజులూ ఇల్లు గలగలలాడి పోతుంటుంది. వచ్చే పోయే వాళ్ళతో ఆవరణంతా ఎంతో సందడి.

అంత హడావిడిలోనూ తనని పలకరించటం ఏమారడు; "మీ పాటల బాకీ జ్ఞాపకమున్నదండోయ్." అని ఛలోక్తులాడుతాడు.

వర్ధని కాస్త లోకం మొహం చూసేది కూడా ఆనాలుగ్గు రోజుల్లోనే సినిమాకనో, పార్టీలనో తిప్పుతాడు ఆయనే.

తననీ రమ్మంటూరు అప్పుడప్పుడూ.

గిరీశం గారయితే బలవంతమే చేస్తారు.

ఊహూ తను వెళ్ళదు. ఏం బాగుంటుంది అలా వాళ్ళతో వెళ్ళటం. హద్దు మీరే చనువు తనకు ఇష్టం వుండదు.

భర్తతో బయటకు వెళ్లేప్పుడన్నా సంతోషంగా వుండదేం వర్ధని? ఏదో మొక్కుబడి అన్నట్టు తప్ప దేనికీ ఆసక్తి, ఉత్సాహం చూపదేం? ఎందుకింత నైరాశ్యం?

"అయినా నాకెందుకావిడ గొడవ? ఈ బుద్ధికి మరీ బుద్ధి లేకుండా పోతోంది." కరుణ తనమీద తానే విసుక్కుంది

లేచి తల్లి దగ్గరికి వెళ్ళింది.

భర్తపోయాక శకుంతలమ్మ తత్వం మారిపోయింది. వారంలో నాలుగు రోజులు ఆరోగ్యం బాగుండక ముసుగు తన్ని పడుకుంటుంది. ఒంట్లో బాగున్ననాడు నాలుగ్గింజలు వుడకేసి ఆ పైన ఓ పుస్తకం పట్టుకుని దేవుడి ముందర కూర్చుంటుంది వుదాసీనంగా. అంతే తప్ప కూతురుతోనైనా మంచీ సెబ్బరా ఎక్కువగా మాట్లాడదు. ఇంటిసంగతి పట్టించుకోవటం కూడా తగ్గిపోయింది బైటప్రపంచం చూద్దామని మొదలే లేదు.

దేవుడి గూడు ఎదరగా ముడుచుకు పడుకున్న తల్లిని చూసి నిట్టూరుస్తూ తిరిగి ఇవతలకి వచ్చింది కరుణ.

పిల్లలు ఒక్కరొక్కరూ వస్తున్నారు.

* * *

ట్యూషన్ అయిపోయింది. అందరూ వెళ్ళిపోయారు. తంబురా వెంటనే పెట్టెలో పెట్టెయ్యబుద్ధికాలేదు కరుణకి.

శృతి సరి చేసి మెల్లని స్వరాన "నాదసుధారస పానము చేసే" త్యాగరాజస్వామి కీర్తన ఎత్తుకున్నది.

ఈ కీర్తన అంటే తండ్రికి వల్లమాలిన ఇష్టం. తాను పాడుతుంటే అనిర్వచనమైన ఆనందంతో కళ్ళు అరమూసి వినేవాడు.

కళ్ళకు నీటి తెర కమ్మింది.

మృదులమైన మధురరవం మలయమారుతాలు వీచినట్టు కలకూజితలు వినిపించినట్టు సాగిపోతోంది.

మధురమైన రాగం అలలు అలలుగా తీగలు సాగుతూ దివ్యసీమల దారులు తెరుస్తోంది.

పాట పూర్తయింది. తంబురా క్రింద పెడుతూ ఆర్ద్రమయి మసకేసిన కళ్ళు తుడుచుకుంది కరుణ.

ఎదురుగా వర్ధని. తదేక దీక్షగా తన వంకే చూస్తూ మైమరచి వింటూంది.

"అరె-మీరా? ఎప్పుడు వచ్చారు?" సంభ్రమాశ్చర్యాలు ముంచెత్తగా అడిగింది.

"ఎంత హాయిగా పాడేవు కరుణా! ఇహలోక విచారాలకీ బాధలకిదూరంగా ఏదో ఆనందలోకాలకు తీసుకుపోయేవు.

నాద రసాస్వాదనలో నిజంగానే రంజిల్లిందామె మనస్సు.

"ఆగర్భ శ్రీమంతులు - మీకు బాధలూ విచారాలూనా?" వింతగా చూస్తూ అప్రయత్నంగా అన్నది కరుణ.

"ఎంత పిచ్చిదానివి కరుణా! వాటికే వలపతుం లేదని కూడా తెలీనంత అమాయకురాలివి నువ్వు." వర్ధని వెలితిగా నవ్వింది.

"ఎవరి సంగతో ఎందుకు?మీ వరకూ. మీరు ఏచింతలూ లేని అదృష్టవంతులే కదా!" మరోసారి కంగించింది కరుణ.

"అదృష్టం హు!" నిట్టూర్చి అన్నది వర్ధని. "సరేలే. వాదనలెందుకు- ఆ విషయం ఒదిలెయ్. ఇంకో పాట వినిపించు కరుణా"

చటుక్కున తన తప్పిదం తెలిసొచ్చింది కరుణకి.

"అంతలోతుకు వెళ్ళి గుచ్చి అడిగే అధికారమేమిటి తనకి.

క్షమాపణగా వర్ధనికేసి చూసింది.

వర్ధని ఇదేమీ పట్టించుకున్నట్టు లేదు. మరోసారి గానల హరిలో మునక వేయటానికి సిద్ధంగా ఉత్సుకతతో చూస్తోంది.

బెట్టుపోవటం, బతిమాలించుకోవటం, సభాపిరికితనం కరుణకి లేవు.

"కరుణా జలధే దాసరథే..." తిరిగి నాదసభ వర్ణించ సాగింది.

ఈసంఘటన తర్వాత వారుకాస్త సన్నిహితులయ్యారు

వర్దని తరచూ కరుణా ఖాళీగా వున్నావా ?" అంటూ వచ్చి కూర్చుంటోంది.

"ఫలానా పాట వినిపించవా" అని అడిగి పాడించు కొంటోంది.

"అండీలు కొండీలు మానెయ్ కరుణ. తోబుట్టువులు లేని అభాగ్యురాల్ని. అక్క అని పిలు నన్ను." అని చనువు చూపెడుతోంది.

లీలామాత్రంగా ఆమె పట్ల మిగులున్న అయిష్టమూ అనుమానమూ ఇప్పుడు పూర్తిగా తొలగిపోయాయి కరుణకి.

* *

త్యాగరాజ ఆరాధనోత్సవాల సందర్భంలో కళాక్షేత్రంలో బాలమురళీ కృష్ణ కచేరి వుందని తెలిసింది.

తొందరగా ట్యూషన్లు తెముల్చుకుని వెళ్ళటానికి సిద్ధమయింది కరుణ. గుమ్మంలో ఎదురయింది వర్ధని.

"ట్యూషన్లకి వెళ్ళి వచ్చేశావుగా కరుణా-మళ్ళీ ఎకడికి?"

"ట్యూషన్‌కి కాదక్కా కళాక్షేత్రంలో బాలమురళీ గారి గాత్ర కచేరి వుందిట. వారి గాత్రమంటే సంగీతాభిమానులు కారుమొయిళ్ళను చూసిన నెమళ్ళ చందాన పరవశించి పోతారు. ఫ్రీ పాసు మాజిస్ట్రేటుగారు ఇచ్చారు. వారిపుణ్యమా అని వినివద్దామని."

"బావుంది. నేను నీ పాట విందామని వస్తూంటే నువ్వు ఇంకోరి గానం వింటానికి వెడుతున్నావన్న మాట." నవ్వింది వర్దని.

ఆ మాత్రం చిరునవ్వు కూడా వర్దని మొహాన అరుదే.

అపురూపంగా అప్యాయంగా చూసింది కరుణ.

నా పాట దేముంది సామాన్యం. ఆయన గానం అపూర్వం. నువ్వూ రా అక్కా విందువుగాని."

"నేనా?" అన్నది వర్దని ఉలిక్కిపడ్డట్టయి, అసంభవాన్ని వింటూన్నట్టు.

"అవును-ఏం? గిరీశంగారెటూ వూళ్ళో లేరు కదా! ఒక్కదానివే ఇంట్లో ఏం చేస్తావు? వెళ్ళొద్దాం పద" అన్నది కరుణ.

"కరుణకి తోడుగా కూడా వుంటావు వెళ్ళి రామ్మా" అన్నది శకుంతలమ్మ కూడా.

"ఆహా-ఒద్దులే కరుణా నాకు రావాలని లేదు" అయిష్టంగా తప్పుకో చూసింది వర్దని.

"అలా కాదక్కా వచ్చి చూడు. వచ్చినందుకు విచారించవని హామీ ఇస్తాను." అన్నది కరుణ ఒప్పింపజూస్తూ.

"అవునమ్మా సంగీతమంటే చెవి కోసుకుంటావు. ఆయన కచేరీ విని తీరాలి." శకుంతలమ్మ బలపరిచింది.

పట్టుబలవంతాన ఒప్పుకున్నది వర్దని. కరుణ అయితే నడిచే వెడదామనుకున్నది కానీ ఇప్పుడు ఆటో మాట్లాడుకున్నారు.

త్రోవ పొడుగునా కరుణ బాలమురళీగారి సంగీతజ్ఞానాన్ని పొగుడుతూనే వుంది "అహా" "ఓహో"లు తప్ప ఒక్క మాట విదవలేదు వర్దని.

అసలు బయలుదేరట మయితే బయలుదేరింది కానీ ఇష్టం మీద రావటం లేదని ఆమె మొహం చూస్తేనే తెలిసిపోతోంది.

అతి నిరాసక్తంగా నిరుత్సాహంగా ఊకొడుతున్న వర్దనిని చూసి అనవసరంగా ఈవిడ్ని బలవంతాన ఈడ్చుకుపోతున్నానేమోనని చింతించసాగింది కరుణ.

"ఎందుకని ఈవిడ రావటానికి ఇంత భయపడుతోంది?" అదసలు భయమా లేక అయిష్టమా?

నేను పాడుతోంటే మంత్రించిన పాములా కదలిక లేకుండా వింటుందే...చక్కటి సంగీతం వింటానికి వెళ్ళటం అయిష్టమెందుకవుతుంది? మరయితే భయపడుతోందా?

ఎవరికి? దేనికి?

భర్త కోపగిస్తాడని వెరుస్తోందా?

భార్యని నాలుగ్గోడల మధ్యన బంధించి వుంచాలనే మూర్ఖుడు కాదే ఆయన?

మరెందుకీవిడ ఇంతగా జడుస్తోంది?

వ్రి మనిషి పక్కనే వున్నా మనం చదవటం అసంభవమే కదా!

"నిన్ను ఇబ్బంది పెట్టానా అక్కా?" పశ్చాత్తాపం ధ్వనిస్తూండగా అన్నది కరుణ.

పేలవంగా నవ్వింది వర్ధని.

"నన్ను సంతోష పెట్టాలనే నీ ఆవేశం నాకు తెలియనిదా కరుణా. కానీ నీ అభిమానాన్నందుకునే అర్హత గానీ నిష్కల్మంగా ఏ ఆనందాన్నయినా అనుభవించే యోగ్యత కానీ నాకు లేదమ్మా."

"ఎందుకక్కా నిన్ను నువ్వు కించపరుచుకుంటావు" బాధగా అన్నది కరుణ.

"నిజం కరుణా. అందుకే నా చుట్టూ ఓ గిరి గీసుకుని అందులోనే మగ్గుతున్నాను నేను. నీ మధురగళం నన్నా పరిధినించి ఇవతలకు లాగింది. నీ స్నేహామృతం రగులుతున్న నా గుండెకు తాత్కాలికంగానే అనుకో...ఉపశాంతి కలిగిస్తోంది. పూర్వానుబంధమేదో మనకుందనిపిస్తోంది కరుణా. నిన్ను చేజార్చుకోకూడదనీ కంటికి రెప్పలా కాపాడుకోవాలనీ అనిపిస్తోంది." ఏదో స్వప్నంలో వుండి పలవరిస్తున్న దానిలా అంటున్న వర్ధని మాటల్లోని గూడార్థమేమిటో తరిచే సమయం లేదప్పుడు.

ఆటో ఆగింది.

"సరి. ఏదో అంటే మరెందులోకో దిగిపోయావు నువ్వు. దిగుదిగు." అన్నది కరుణ నవ్వేస్తూ.

కచేరీ అయిపోయేదాకా మరి మాటలు లేవు. ఏ గంధర్వలోకంలోనో విహరించి వచ్చినట్టనుభూతి పొందుతూ బయటకు వచ్చేరిద్దరూ.

"నిజమే కరుణా నువ్వన్నట్టు నేను రాకపోయినట్టయితే ఒకానొక అనిర్వచనీయమైన అనుభూతిని మిస్సయివుండేదాన్ని అన్నది వర్ధని మనస్ఫూర్తిగా.

కళలకు వుండే ప్రభావమేమిటో వెతలు తీరినట్టు తేట పడిన ఆమె మొహం చెప్పక చెబుతోంది.

మందహాసం చేసింది కరుణ.

సావకాశంగా విన్నప్పటి నిదానం ఏమయిందో శ్రోతలు ఎటువారటు హడావిడిగా తోసుకుంటూ వెళ్ళిపోతున్నారు.

కార్లూ స్కూటర్లూ జనాన్ని మోసుకుని దూసుకుపోతున్నాయ్.

ట్రాఫిక్ తప్పించుకుంటూ రోడ్డు వారగా నిలబడ్డారు ఇద్దరూ.

చూస్తూండగానే జనం పలచబడ్డారు. వాళ్ళతోపాటు ఆటోలు, రిక్షాలు కూడా మాయమయిపోయాయి. ఉన్న ఒకటి రెండూ బేరం కుదరనివ్వలేదు.

"పదక్కా ఈ రోడ్డు చివర మలుపులో చాలావుంటాయి అక్కడ ఎక్కుదాం." అని దారితీసింది కరుణ.

ఆ మాటా ఈ మాటా చెప్పుకుంటూ ముందుకు నడిచారు.

ట్యూబ్‌లైట్లు రోడ్డుని పట్టపగలు చేస్తున్నాయి. షాపులు ఇప్పుడిప్పుడే ఒకటీ అరా మూతపడుతున్నాయి. జనాల రాకపోకల రద్దీ పూర్తిగా కాదు గానీ చాలా వరకూ తగ్గింది.

రోడ్డు చివరమలుపులో రిక్షాస్టాండు వున్నమాట నిజమే కానీ సినిమాలు ఒదిలే టైము అవటం మూలాన కాబోలును అట్టే రిక్షాలు అక్కడ లేవు. నాలుగైదు మాత్రం వున్నాయి ఆటోలు అసలే లేవు.

"ఏదో ఒకటిలే ఎక్కేద్దాం" అనుకున్నారు.

కరుణ అలవాటుగా బేరమాడ్డం మొదలుపెట్టింది. వర్ధనికి కంగారు పుట్టింది. వీళ్ళని కూడా కుదరనివ్వకుండా ఇంకా ముందుంటయ్ పద అంటుందేమోనని. అలా అంటూ అంటూనే మెల్లమెల్లగా ఇంటివరకూ ఇలాగే లాక్కుపోతుందే మోనని.

ధైర్యం చేసి మెల్లగా కరుణ చెయ్యి లాగి "ఎంతో కొంతలే కరుణా ఇప్పటికే చాలా ఆలస్యమయింది ఎక్కేద్దాం." అన్నది.

రెండు ఫర్లాంగుల దూరం నడిచి వచ్చినా అదే రేటు చెబుతున్నందుకు వాళ్ళమీద మహా గుర్రుగా వుంది కరుణకి. కానీ వర్ధని మొహం చూసి సరేననక తప్పలేదు.

"హూ ఈసారికి వదిలేస్తున్నాను" అన్నట్టు రిక్షావాడి వంక బెట్టుగా చూసి "సరే పద..." అంటూ ఎక్కి కూర్చు న్నది కరుణ.

వర్ధని కూడా ఎక్కబోతున్నది.

అంతలో—

భుజం పట్టి గుంజినట్టయి అదిరి పడుతూ వెనక్కి తిరిగి చూసింది వర్ధని.

కెవ్వున అరిచింది.

గుండెలు గుబుక్కుమనగా తొంగి చూసింది కరుణ. వెన్నున చలి జరజర పాకింది.

చింపిరి జుట్టు, లోతుకుపోయిన కళ్ళు, ఎండిపోయిన పెదవులు. బెరడులా పగుళ్ళిచ్చిన ఒంటిని శిధిలావస్థలో వున్న చీరొకటి చుట్టబెట్టిన వికృతమయిన ఆకారమొకటి వర్ధనిరెక్క పట్టి లాగుతోంది. కళ్ళు ఉరుముతూ కర్కశంగా ఏమో అంటూంది.

నోట మాట రావటం లేదు వర్ధనికి. గజగజ వణికి పోతోంది.

తల విదిలించి "అయ్యయ్యో" అంటూ ఒక్క ఉరుకు ఉరికింది. కరుణ రిక్షాలోంచి.

అపాటికి రిక్షా అతను హాండిల్ బారొదిలి వచ్చేశాడు.

ఆ మనిషిని ఇవతలకు లాగుతూ "ఒదులే–ఆరిన ఒదులే" అంటున్నాడు.

ఉహు. ఉడుం పట్టు పట్టి వదలటం లేదు. ఓ పక్క

అతన్ని విదిలించేస్తూ మరో వక్క పిచ్చి బలంతో వర్ధనిని కుదిపేస్తూంది. "నా బిడ్డ...నా బిడ్డనేం చేశావ్...ఎక్కడ దాచావో చెప్పు" అంటోంది.

"ఒలే ఎంకటా ఏమయిందే ఇయ్యాల నీకూ. ఆరికేమి తెలుసే నీ కూతురి సంగతి. ఇనవే. ఇడిసిపెట్టే." అంటున్నాడు ఆదుర్దాగా ఆశ్చర్యంగా.

ఆ మనిషి వినిపించుకోటం లేదు. "నా కూతురు...నా కూతురు...నీకు తెలుసు చెప్పు. చెప్పు" అంటూ దీనంగా అరుస్తోంది. గింజుకుంటోంది.

రిక్షా అతనూ కరుణా కలిసినా విడదీయలేకపోతున్నారు.

వర్ధని పరిస్థితి చూస్తే ఇప్పుడో ఇంకాస్సేపటిలోనో స్పృహ కోల్పోయేలా వుంది.

రిక్షావాడి మాటలతో ఏ దొంగ మనిషో హటాత్తుగా దాడిచేసిందేమో అన్న దుడుకు తగ్గింది కానీ— "మరేమిటా మనిషి అఘాయిత్యం? పిచ్చిది కాదు కదా? అక్కని ఏం చేస్తుందో? సజావుగా ఈ వేళ ఇల్లు చేరగలమా?" కరుణ బేజారయి పోతోంది.

దారినపోయే నలుగురూ పోగయ్యారు. ఎలాగయితేనేం విడిపించారు.

అక్కడే కూలబడిపోయి హృదయవిదారకంగా చేతుల్తో కడుపుమీద మోదుకుంటూ రోదిస్తోందా మనిషి. "నాలచ్చిమా ఏడకి పోయావే..." అంటూ.

"పిచ్చిదేమోనండీ." అంటున్నారెవరో.

"అయినా మతి చెడిన వాళ్ళనిలా రోడ్లమీద ఒదిలెయ్యటమేమిటండీ-చూడండిప్పుడు—చెయ్యి గాబట్టి సరిపోయింది గానీ ఆ బిగింపుకి ఏ మెడో అయితే ఎంత డేంజరది..."

ఒళ్ళు జలదరించి మరి వినలేకపోయింది కరుణ. తక్షణం ఆ ఘట్టాన్నించి ఆ స్థలంనించి అదృశ్యమయి పోవాలనిపించింది.

వర్ధని అయితే ప్రాణంలేనట్టు తోటకూర కాడలా చేతుల్లో వేలాడిపోతోంది.

అక్కడ మూగిన వాళ్ళు ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క సందేహం వెలిబుచ్చుతోంటే "లేదు బాబయ్యా" అంటూ ఏదో వివరణలు ఇవ్వబోతున్న రిక్షావాణ్ని కేకేసింది కరుణ.

"మమ్మల్ని ముందు ఇంటికి చేర్చు బాబూ. ఈవిడ పరిస్థితి బాగోలేదు." అని తొందర చేసింది.

"అవునవును పాపం. ముందర వాళ్ళని దిగబెట్టు." అన్నారు వాళ్ళుకూడా సానుభూతి కనబర్చి.

అక్కడే వున్న మరో రిక్షా అతనితో "వెంకటాన్ని

మన గుడిసెలకాడ అప్పగించేయండిరా." అని పడుస్తున్న ఆ మనిషిని అప్పగింతలు పెట్టేసి తన రిక్షా దగ్గరికి వచ్చేడు.

వర్ధనిని జాగ్రత్తగా రిక్షా ఎక్కించి పట్టుకు కూర్చుంది కరుణ.

కరుణ భుజంమీద తల ఆన్చి కళ్ళు మూసుకున్నది వర్ధని.

కరుణ మనసేదోలాగ అయిపోయింది.

హాయిగా ఇంటి పట్టున వున్న ఆ మనిషిని సంగీతం సాహిత్యం అంటూ లాగనంటున్నా తీసుకొచ్చి ఇట్లా అవస్థలపాలు చేశానేమిటి?

నేనమ్మిన ఏ దేవుడో అడ్డుపడబట్టి గానీ—వాళ్ళెవరో అన్నట్టు ఆ పట్టుకోడం చెయ్యి కాక కంఠమయుంటే ఎంత ప్రమాదం జరిగుండేది.

గిరీశంగారికి ఏమని జవాబు చెప్పుకు నేదాన్ని.

ఇప్పుడు మాత్రం...ఏవమ్మా మహారాణిలా కారు మీద షికారు చేసే మా ఆవిణ్ణి తీసుకెళ్ళి ఎంత హైరాన పెట్టేవమ్మా అంటే మొహమెత్తుకోగలదా?

నిట్టూర్చింది కరుణ.

ఎండ కన్నెరగని దానిలా నవనవలాడుతూ వుంటే

వర్దని సొమ్మసిల్లినట్లు ఇట్లా వాలిపోయి వుంటే ఆయనదాకా ఎందుకు తనకే గుండె నీరయిపోతోంది.

ప్చ్. ఆ పిచ్చిది పట్టుకునేది నన్నయినా పట్టుకున్నది కాదు. అది...దాని కూతురు సంగతి అక్కనడుగుతుందే మిటి...? మాయ చేశావంటుందేమిటి...?

ఆ పిచ్చివాళ్ళ మాటలకి అర్థాలేమిటి నా పిచ్చిగానీ_

పాపం—అక్క అనుకోకుండా మధురగానం విని ధన్య మయినాను. మంచి రోజిది అనే అనుకున్నది గానీ ఇంత భయంకర సంఘటన ఎదుర్కొనే దుర్దినంగా మారుతోందని కలలో అయినా అనుకొని వుండదు.

"ప్చ...ఎంత గండం గడిచిందీవేళ!" అప్రయత్నంగా గుండెమీద చెయ్యేసుకుని పైకే అనుకున్నది కరుణ.

ఆ మాటకి రిక్షా అతను వెనక్కి తిరిగిచూశాడు.

ఏమనుకున్నాడో ఏమో చిన్నకిళ్ళీషాపు దగ్గర బండాపి ఐన్‌సోడా పట్టుకొచ్చి కరుణచేతి కందించాడు.

"ఆ అమ్మ మొహం తుడవండమ్మా."

కరుణ సోడా నీళ్ళతో తన కర్చీఫ్ తడిపి వర్దని మొహం తుడిచింది.

వర్దని కొద్దిగా తెప్పరిల్లి సరిగా కూర్చుని సీసా అందు
కుని మిగతా సోడా తాగింది.

కరుణకి "అమ్మయ్య" అనిపించింది.

రిక్షా అతను సీసా ఇచ్చేసి తిరిగొచ్చాడు.

"గాలి తగుల్తుందమ్మా టాప్ వెనక్కేసైనా?" అని
కరుణ నడిగాడు.

తల వూపింది.

అతను టాప్ తీసేసి రిక్షా బయలుదేర తీశాడు.

మనిషి స్తిమిత పడినా మనసు స్తిమిత పడనట్టు వర్దని
చూపులు శూన్యాన్నవలోకిస్తున్నాయి.

జనులు ఎక్కడి వాళ్ళక్కడ సద్దుమణుగుతున్న వేళ.
అనుకోకుండా ఎదురై హడలగొట్టిన సన్నివేశంతో మనసు
దుర్బలమైన సమయం. కరుణకా నిశ్శబ్దం సహించరానిద
యింది.

ఏదో మాట్లాడాలి ఆ నిశ్శబ్దాన్ని ఛేదించాలి.

కానీ ఆ క్షణంలో ఏమీ జరగనట్టు ఇంకో విషయం
గురించి మాట్లాడ్డం కూడా అసహజంగా వుంటుందేమో?

వర్దని చేయి తన చేతిలోకి తీసుకుంటూ "ప్రొద్దున్నే
ఎవరి మొహం చూసి లేచేవో అక్కా ఆ పాపిష్టిదానిపాల
బడ్డావు." అన్నది కరుణ.

వర్ధని నుంచి రెస్పాన్స్ లేదుగానీ "అట్లా అనొద్దమ్మా" నొచ్చుకున్నట్టుగా అన్నాడు రిజా అతను. "అది పిచ్చిదే గానండమ్మా ఎప్పుడూ ఒకరి జోలికీ సొంటికీ పోయిన రకం కాదమ్మా."

అతను కలగజేసుకోడం, అదీ తమని శత్రువులా బిహేవ్ చేసిన మనిషిని వెనకేసుకొస్తూ మాట్టాడ్డం కరుణకేమంత నచ్చ లేదు.

"భలేవాడివయ్యా ఆ తీరున కలబడి రెక్క వూడి పొయ్యేలా పీకడం నీ కళ్ళతో నువ్వూ చూసేవు కదా బుద్ధి మంతురాలని చెప్పబోతావేమిటి" అన్నది నిరసనగానే.

"అదేనమ్మా నాకూ ఇచ్చిత్రంగా ఉంది. ఓరన్నాదయ దల్చి ఇన్ని గంజినీళ్ళోస్తే తాగుతుందిగానీ నోరు తెర్చి ఆకలన్నా అనదు. ఇందాక తమరు చూచారె వోరని మొత్తు కోవడం ఆమెయిన నా కూతురో అని ఏడవడం లేకపోతే ఎవురి అరుగువారనో ముడుసుకు తొంగోవటం -అంతే కొంటె పిల్ల కాయలు అల్లరికి మీద రాళ్ళుసిరిన చూసి ఇరక్తిగా నవ్వటమే గానీ భయానికి గుడ్లెర్రన్నా చెయ్యంగా ఎవురమూ చూళ్లేదు."

"మరి చలచిత్తమేమిటో?"

కరుణ కంఠంలో తొంగిచూసిన వెటకారాన్ని తెలుసు

కోలేదు వాడు. "అదేనమ్మా నాకూ అరదం కాటంలేదు." అని కాస్సేపాగి "మీరు నమ్మరేమో గానండమ్మా అదసలు పిచ్చిదే గాదండమ్మా" అన్నాడు.

"మరి?" "ఇది మరీ బాగుంది. ఇంకాస్సేపుంటే పిచ్చి దానికి గాదు మీకే అనేటట్టన్నాడువీడు" అనుకున్నది కరుణ.

ఎదురుగా వస్తున్న వారికి దారిఇస్తూ కొద్దిగా పక్కకు తీసి పోనిస్తూ అతను చెప్పుకుపోతున్నాడు.

ఒక ముష్టిదాని కథ వినాలని ఎవరికుంటుందని వాడను కోలేదు.

ఆసక్తి లేకపోయినా నిశ్శబ్దం కంటే ఎవరివో మాటలు వినటమే నయమనిపించి వింటోంది కరుణ.

ఇక వర్ధని ఆమనసులో ఏముందో పసిగట్టడం ఆ పరమా త్ముడి కన్నా చేతయ్యేలా లేదు.

"దానికో కూతురుండేదమ్మా లచ్చిమనీ-అచ్చం లచ్చిం దేవే అనుకోండి. సినేమా టారులాగుండేది. ఎంత చురుకో.

ఈ సక్కదనాల బిడ్డ కోసరం చేసుకున్నాడు వదిలెళ్ళి పోయినా మారుమనువుకి పోకుండా బిడ్డే లోకమనుకుంది.

అది పడని పాటులేదు, తాపీపని కూలికెళ్ళింది రాళ్ళు మోసింది. అంత శ్రమ పడ్డందుకు పలితం దక్కిందిలెండి. లచ్చి చక్కందే కాకుండా బుద్ధిమంతురాలు. వెంకటానికి ఛయవచ్చి మూలబడితే "నాకు చేతకాదు నేనేమి చేతునో"

అనకుండా ఉన్నమారాజు ఇంటో పనికి కుదురుకుంది తల్లిని బిడ్డలా సాక్కుంది. బతికిచ్చుకుంది.

"ఎంకటా నువ్వు అదుష్టవంతురాలివే" అనే వాళ్ళం మేం.

అప్పుడే జరిగిపోయిందమ్మా చోధ్యం.

ఓ దినం మామూలుగానే పనిలోకి ఎల్లింది లచ్చిమి, తిరిగి గుడిసికి రాలేదు. అది పనిచేస్తున్న కాడ అడిగితేనాలుగు రోజులయి పన్లోకి రాడంలేదు. ఏడకుపోయిందో అన్నారంట

అంతే లచ్చిగుంట మరి ఎవ్వరి కళ్ళ పడలేదు. ఇది పిచ్చి దాని మోస్తరయిపోయింది. కుంగి కుసించిపోతున్నది.

ఇదిగిదమ్మా జరిగిన సంగతి... రితువాడు మాటలు ముంగించ బోతున్నాడు.

వర్ధనిలో మార్పువచ్చింది. దుఃఖాన్ని నిగ్రహించు కుంటూ మునిపళ్ళతో అదిమిపట్టిన పెదవి వణుకు తెలుస్తోనే వుంది. ముక్కుపుటాలు అదురుతున్నాయి.

కరుణ కలవరపడి "ఏమిటక్కా...?" అన్నది.

మరి ఆపలేనట్టుగా చేతుల్లో మొహాం దాచుకుని బిగ్గరగ రోదించసాగింది వర్ధని.

ఈ హటాత్ పరిణామానికి బిత్తరపోయింది కరుణ.

ఎంత ఊరడించినా వూరుకోదే. రిక్షావాడుకూడా వెనక్కి తిరిగి తిరిగి చూస్తున్నాడు అయోమయంగా.

ఇంటికి చేరేదాక అలా కన్నీరు అవిరళంగా కారుస్తూనే వుంది వర్ధని.

రిక్షా ఆగడమేమిటి ఉరికి నట్టేదిగి పరుగుపెడుతున్నట్టే ఇంట్లోకి వెళ్ళిపోయింది.

విశ్రాంతి నించి తేరుకుని రిక్షావాడికి డబ్బు లిద్దామని చూస్తే వాడు గుడ్లెళ్ళ బెట్టి చూస్తున్నాడు ఇంటికేసి.

కరుణ ఇస్తున్న డబ్బులు అందుకుంటూ, "అమ్మా ఈ ఇల్లు ఆ అమ్మదా?" అన్నాడు నింపాదిగా.

"ఏం?" కరుణ ప్రశ్నార్ధకంగా చూసింది.

"ఇదే లచ్చిమి పనిచేసిన ఇల్లు."

తెల్లబోయింది కరుణ.

* * *

గిరీశం ఊరినించి వచ్చాడు. ఒకసారి వచ్చి పొమ్మని కబురుపెడితే ఏమి కంప్లయింటో అని సంశయిస్తూనే వెళ్ళింది కరుణ.

గిరీశం అప్పుడే భోంచేసి నట్టుంది. చేతిలో వక్కపొడి వేసుకుంటున్నాడు.

కరుణని చూసి"రారా విన్న గాభరా పెట్టేసిందటగా మా వర్ధని.అన్నాడు చిరునవ్వుతో.

తన మీద నిష్ఠూరం వెయ్యనందుకు తేలిగ్గా వూపిరి వదిలింది కరుణ.

"నా గాభరా మాట ఏముతేండి. అక్కబాగా అప్ సెట్ అయింది."అన్నది బాధగా.

రాత్రి వర్ధనితో మాట్లాడాలని ఎంత ప్రయత్నించినా తలుపులు బిగించి మరి తియ్యలేదు వర్ధని.

రాత్రంతా వెయ్యిఅనుమానాలు లక్ష సందేహాలు: దీనికి సమాధానాలురావు.

హాల్లోకి వర్ధని వచ్చింది. అప్పటికీ ఆమె కోలుకున్నట్టు లేదు. చుక్క రక్తం లేనట్టు పాలిపోయి వుందిమొహం.

"మా ఆవిడ మరీ సెన్సిటివ్ ఫెలో కరుణా!దేనికి తట్టుకోలేదు. ఏమయిందని చెప్పు ఇంత డీలాపడిపోవానికి.అన్నాడు గిరీశం లంఖణాలు పడ్డట్టున్న భార్యని జాలిగా చూస్తూ.

"అలా అనకండి," అడ్డుపడింది కరుణ."ఎంత ధైర్యం కలవారికైనా గుండె జారే సంఘటన అది."

"పోనసుకో___"ఇంతకీ ఆ పిచ్చిది ఎవరోకాదు. మా ఇంట్లో రెండేళ్ళక్రితం లచ్చి అని ఓ కుర్రది పనిచేసింది. దాని తల్లి.

"నిజమేనం? ఈ ఇల్లు గుర్తు పట్టి రిథువాడు అమాటంటే చీకట్లో పొరపాటుపడ్డాడను కున్నాను." అన్నది కరుణ కళ్ళు వెడల్పు చేస్తూ.

"కాదు నిజమే." కాస్తాగి." అలచ్చి వుంది చూశావూ వుత్త చూపుల గుర్రం. రూపు రేఖల మాటెలా వున్నా దాని షోకూ హొయలూ అబ్బో పట్టశక్యం గాకుండా వుండేది. అది పనిచేసే రెండు గంటల్లోనూ నలుగురు బాయ్‌ఫ్రెండ్స్ దాన్ని మీటయ్యేవారు. తివ్వుకోవటమే సరిపోతుంది. ఈ వయ్యారి నీకు పనేం జేస్తుందంటే మా వర్ధని వినేదికాదు." అవునా—అన్నట్టు భార్య వైపు మందహాసంతో చూసేడు గిరీశం. వర్ధని తల దించుకున్నది ఎత్తనే లేదు.

"ఏమయింది మదిరి...?" కరుణ ఆసక్తిగా ప్రశ్నించింది.

"ఏమవుతుందీ. ఆ బాయ్‌ఫ్రెండ్స్‌లో ఎవర్నో తీసుకు చెక్కేసుంటుంది. నేను నేను ముందునించీ అను కుంటూనే వున్నాను. ఇది ఒళ్ళొంచే రకం కాదు. ఎప్పుడో ఇల్లాంటి పనేదో చేస్తుందని అనుకున్నంతా చేసింది. పోతూ అలమర్లో నాలుగొందల రూపాయలు ఏదో అజాగ్రత్తలో ఒదిలైే అవీ, వర్ధనివి ఓరెండు చీరలూ పట్టుకుపోయింది. ఇల్లంతా అప్పగించి బయటకు వెళ్లే వాళ్ళం—తేలికలో ఒదిలి పోయింది. అదృష్ట మనుకున్నాం."

"సయమే."

"అయిందా" దాని తల్లి ఇంతలో నలుగుర్ని వెంటేసు కొచ్చి మేమే దాన్ని ఏదో చేశామని రభస. రచ్చ.

మాదగ్గర్నించి ఏదన్నా లాగొచ్చునని వాళ్ళ ఎత్తు. అది నాకు తెలియందా! మాఇంట్లో అదిఎత్తుకు పోయినవన్నీ చెప్పి ఇంకా గొడవ చేస్తే పోలీసు రిపోర్టుస్తానని బెదిరిస్తే అప్పుడు వెనక్కి పోయారు.

ఆ అల్లరికి ఈవిడ జడిసిపోవట ఫెయింటవటం అప్పుడూ ఇదే కథ.

తన సందేహాలకు సమాధానాలు దొరికినై.

కరుణ "బావుంది." అంటూ వర్ధని వంక జాలిగా చూసింది "కానీ దాని తల్లి పరిస్థితిదయనీయంగా వుందంటే. ప్రాణమున్న అస్థి పంజరంలావుంది పాపం."

"ప్చ్. పాపం. కానీ మనమేం చెయ్యగలం? కన్నతల్లి అని కూతురికే లేకపోయాక

"బహుశా వాళ్ళాటలు సాగనివ్వలేదని కోపం కొద్దీ వాళ్ళ వాళ్ళు దాని అదృశ్యానికి కారణం మీరని బాగానూరి పోసి వుండాలి-ఎంత కఠుగా కసిగా అక్కమీదికి దూకిందనీ-ఆ ఉగ్రరూపంచూసి మొదట పెట్టిన కేకతప్ప మరి రెండో కేక కూడా వెయ్యలేనంతగా భీతిల్లిపోయిందక్క."

"అవును. ఈవిడెంత సుకుమారో. అంత సున్నితం అని

తెలుసు కనకనే నేను లేనిదే ఈవిడ్ని ఎక్కడికీ కదలనివ్వను. నీడలా కాచుకుంటాను. అస్తారుబదంగా చూసుకుంటాను.

గిరీశం మాటలకి తుళ్ళిపడింది కరుణ.

తను స్వతంత్రించి తీసుకు వెళ్ళినందుకు మందలింపా? తను కనురెప్పలా కాపాడు కుంటున్న భార్యని కష్టానికి గురి చేసినందుకు నిందా? పరీక్షగా గిరీశాన్ని చూసింది.

అతని మొహం మామూలు గానే వుంది. వర్ధని కళ్ళలో మాత్రం నీళ్ళునిండి నట్టు అస్పష్టంగా తెలుస్తోంది. కాస్సేపు కూర్చుని తిరిగి వచ్చేసింది కరుణ.

తరువాత కొన్నాళ్ళపాటు వర్ధని స్తబ్దంగా మరీ ముభావంగా అయిపోయింది. ఏదో తప్పుచేసినట్టు కరుణని తప్పుకు తిరిగింది.

చెయ్యని నేరాన్ని నెత్తినేసుకుని కుచించుకు పోయె ఆ అమాయకత్వాన్ని చూస్తూంటే ఏదో తెలీని మమకారం అభిమానం కలుగుతున్నాయి కరుణకి.

ఆమె తొలగిపోతున్నా తానే చేరువయి ఆమెను సమాస్వాస పరిచింది.

"అంత బేల మనసు పనికి రాదక్కా కాస్త గట్టిదనం అలవరుచుకో జీవితంలో అలాటివి ఎన్నో ఎదురవుతుంటాయి.

సాహసంగా ఎదుర్కోకపోతే, ఎదుటివారు మన్ని ముంచేసే ప్రమాదమున్నది సుమా!"

వర్ధని ఏదో చెప్పాలని ప్రయత్నించింది కానీ దుఃఖంతో ఆమె కంఠం పూడుకుపోయి మాటవిడిరానేలేదు.

"నీ మనసు నాకు తెలుసు. నువ్వేం చెప్పొద్దులే అక్క పద. అమ్మ గోపాల దేవుడికి పాలు ఆరగింపుచేస్తోంది చూద్దాం అంటూ కరుణ ఆధ్యాసనించి ఆమెదృష్టి మరల్చి భజనలతోనూ పాటలతోనూ మరపించి మురిపించింది.

వర్ధనితో స్నేహం పెంపొందే కొద్దీ ఆమెలో ఏదో గూడుకట్టుకున్న అశాంతీ అస్తిమితమూ ఉన్నట్టు పసికట్టింది కరుణ.

ఉండుండీ మనసు దుర్బలంగా వున్న క్షణాల్లో తనలో దాగొని వున్నచింతాచికకూ బయట పెట్టపోయి హటాత్తుగా మెలకువ తెచ్చుకున్నట్టు ఆగిపోతుంటుంది వర్ధని.

తల మునిగే ఐశ్వర్యం వుంది కోరింది కొండమీదినించ యిన దింపగల భర్తవున్నాడు. ఒకరి పొరూపొరుపూ లేదు. మరి వర్ధని విచరానికి కారణ మేమిటో బోధపడేది కాదు. కరుణకి

అయిన గట్టిగా నొక్కి అడగలేకపోయేది. "ఎవరికుండే కష్టనిష్టూరాలు వాళ్లకుంటాయి. మనకెందుకు ఆరాటం." అను కుందామనుకునేది గానీ మనసు వుండబట్టితేగా.

బహుశ పిల్లలు కలగలేదన్న విచారం కావచ్చునని ఊహించి "అయిన ఏమంత వయసు మీరందనీ-అప్పుడే పుట్ట రన్న నిర్ధారణ కొచ్చేశావు చూస్తూండు వచ్చే యేటికి ఒళ్ళో పాపాయుంటుంది." అని సముదాయించాలని చూసింది పెద్ద రికం మీదవేసుకుని.

వర్దని పేలవంగా నవ్వివూరుకుంది.

ఏడాది గడిచింది.

వర్దనిలో కొత్త నిగారింపు కనబడుతోంది, బియ్యంలో మట్టి బెడ్డలు కింద పారెయ్యడంలేదు. నోట్లోకెడుతున్నా యవి. ఇష్టంగా తాగేదల్లా కాఫీవాసన అంటేనే పట్టంలేదు. ఆమడ దూరాన్నించే పసిగట్టి వాంతి చేసుకుంటోంది.

తన చేతిలో మామిడి పిందెలు ఆత్రంగా తీసుకునికొరు కుతుంటే ఫక్కున నవ్వింది కరుణ.

"నే చెప్పానా ఈ మాత్రం ఓపిక పట్టలేక పోయావ్ దిగులు పెట్టేసుకుని నిరాశ పేర్చేసుకున్నావ్. ఇక చూడు, ఈ ఏడు, నెంబర్ వన్, వచ్చేయేడు నెంబర్ టూ, ఆపైఏడు త్రీ, అప్పుడు ఇంతమందా అని మళ్ళీ బెంగపెట్టేసుకుందువు గాని." అన్నది హాస్యంగా.

రాగరంజిత మవుతుందనుకున్న వర్దని మోము మ్లాన మయింది. చేతిలో మామిడిపిందె అట్టె జారిపోయింది.

కరుణ గాభరాపడి "అదేమిటక్కా అలా అయిపో యావ్" అన్నది.

"నాకిది తొలిసారి అనుకుంటున్నావా కరుణా...కాదు పాత ముచ్చటే ఇది నాకు ..." గాద్గదికత కారణంగా వర్దని గొంతువణికింది.

మరి వాళ్ళు... "సందేహంతో కరుణ వాక్యం పూర్తి చెయ్యలేకపోయింది.

"వాళ్ళా వాళ్ళకి పురిటి ముచ్చటన్న తీరలేదు."అంతే, మరి చెప్పలేకపోయింది వర్ధని, ఎప్పటి లాగే సంకోచంతో మాటలు మింగేవి ఆవేదనలో మునిగిపోయింది.

"బహుశా ఆపాపలు అర్థాయుష్కులై వుంటారు.పురిటి లోనే సంధికొట్టిపోయివుంటారు. అనుకున్నది కరుణ అంతటి కడుపుకోతని భరాయిస్తున్న ఆ నిర్భాగ్యురాలిని చూస్తేజాలని పించింది.

"పోయినవాళ్ళ నీ సొత్తుకారనుకో అక్కా వాళ్లనిక తలవకు. ఈసారి ముందునించీ జాగ్రత్త పడు. అటువంటి ప్రమాదాలు జరగవు. మంచి డాక్టరుని కన్సల్ట్ చేసి మందులు వాడితే ఆరోగ్యంగా వున్న పాప పుడుతుంది." అనుభవంలేక పోయినా ఆరిందలా పెద్దరికం తెచ్చుకుని ధైర్యం చెబుతూ ఊరడించింది.

వర్ధనికి దుఃఖం ఆగలేదు. కట్ట తెగిన ప్రవాహమల్లే కన్నీళ్ళు దొర్లాయి. తల అడ్డంగా వూపి. "ఉహూ...నీకు తెలియదు కరుణా! నాకా అదృష్టంలేదు" నీకు తెలిసేలా ఎలా చెప్పను ...?" ఏదో చెప్పాలని తపన గుండెల్లో బరువు తన్నభిమానించే వారితో చెప్పుకుని కరువుతీరా కన్నీళ్ళు రాల్చి తేలికవ్వాలనే ఆరాటం వర్ధనినితొందరచేశాయి.

కానీ కడుపుచించుకుంటే కాళ్ళమీద పడుతుంది.మరొ కరిముందు బయట పెట్టుకునే మనస్తాపమా తనది? మనసు నోరు నొక్కి కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ వుండిపో యింది.

కరుణ కామె ఘోష అంతుచిక్కలేదు. కానీ ఇంత వరకూ ఆమెకు తగిలిన దెబ్బలే ఆమెకా అవిశ్వాసాన్ని కలగ జేస్తున్నాయనుకున్నదే తప్ప మరోవిధంగా భావించలేకపో యింది.

* *

నెల తప్పాక వర్ధని ప్రవర్తన మరీ వింతగా తయార యింది.

కరుణ ఎంత ప్రతిమాలాడినా,బలవంత పెట్టినాడాక్టరుకి చూపించుకోవటానికి ఒప్పుకోలేదు. పోనీ తనకు తెలిసిన లేడీ డాక్టరుని ఇంటికి తీసుకు వస్తానన్నా ఒప్పుకోలేదు.

"ఎంచేత? ఎందుకు నీకింత పట్టుదల?" అంటే.

"నీకు తెలీదు...నాతలరాత" అంటుందంతే.

మరీ దబాయిస్తే కంట తడి పెట్టుకుంటుంది.

ఇక ఆమెని ఒదిలేసి గిరీశాన్ని కదలేసి చూసింది.

మొదట, "అబ్బెబ్బే డాక్టరెందుకూ? అన్నాడు నాలుక చప్పరించేస్తూ.

"మా అమ్మమ్మ పద్నాలుగు మందిని కన్నదటమంత్రసాని సాయమన్నా లేకుండా." అన్నాడు కళ్ళు పెద్దవిచేసి.

"మనకూ ఆ పుట్టే వాళ్ళకూ రుణానుబంధమంటూ వుండాలిగానీ ఈ డాక్టర్లేం దేవుళ్ళ, ప్రాణం పొయ్యటానికి-" అన్నాడాకర్ని అనవసరమని తేల్చేస్తూ.

ఇలాంటి కల్లబొల్లి కారణాలు చాలా చెప్పాడుగిరీశం. కరుణ ఎంత ప్రయత్నించినా భార్యని డాక్టరుకి చూపించడానికి విముఖతే చూపించాడతను.

హతాశురాలయింది కరుణ. గిరీశం చెప్పినవేవీ సకారణాలుగా అనిపించలేదామెకి.

నోరు విప్పితే ఆదర్శాలూ, సంస్కారాలూ గట్రా అంటూ అధునాతన భావాలు వెళ్ళబోసే పెద్దమనిషి ఉన్నట్టుండి విచక్షణా జ్ఞానంలేని సనాతనపు బామ్మగారిలా చాదస్తాలువల్లి వేస్తే ఏమనుకోవాలో?

మొత్తానికి భార్యాభర్తలిద్దరికీ గూడా డాక్టరు సలహా పొందడం ఎందువల్లో ఇష్టంలేదని తెలిసిపోతోంది.

వర్ధని మనశ్శోభ ఎంతజాలికరంగా వున్నాదాన్ని వారణకు వారి సహకారమే లేకపోతేఎవరేమి చేయగలరు...సానుభూతి చూపించటం మినహా...అనుకున్నది కరుణ.

మరీ లోతుకు వెళ్ళి వాళ్ళు తప్పించుకుంటున్న రహస్యమేదో వెలికి లాగాలనుకోవడం కాదని మరిక వారిని రాపాడించే ప్రయత్నం మానుకుని ఉపేక్షవహించింది.

నెలలు నిండుతున్న కొద్దీ మృత్యువుకు దగ్గరంగా ఈడ్చబడుతున్నదానిలా బెంబేలెత్తి పోతోంది వర్ధని.

విరాగిలా వుండే శకుంతలమ్మకూడా ప్రేతకళ పడుతున్న ఆమెను చూసి చలించిపోయింది.

"సంతోషంగా ఉండలసిన సమయంలో ఇలా వెనికిటివి తలుచుకుని వ్యాకుల పడ్డంమంచిది కాదమ్మా. ధైర్యం తెచ్చుకో. భగవంతుడు చల్లగా చూస్తే అన్నీ సవ్యంగా జరుగుతాయి. తోడు మేమున్నాము కదా! అన్నది వాత్సల్యంగా వెన్ను నిమురుతూ.

కరుణ కూడా తనకు చేతనయినంతగా వర్ధని భయం అర్థం లేనిదని నచ్చచెప్పేది. ఆమె ఆలోచనలనించి మళ్ళించేందుకు తోటపని చేద్దామనో, పాటలు వినమనో ఆమెనివంటరిగా ఉండనీయకుండా అంటుకు తిరిగేది.

తొమ్మిది నెలలు నిండాయి వర్ధనికి. పురిటి సమయంలో ఆదుకునేందుకు ఆమె తరపు బంధువులు గానీ, గిరీశంవైపు వాళ్ళుగానీ ఎవరూ రాలేదు.

"డాక్టరు సాయం అవసరం కావట్లే బంధువుల సాయం కూడా అనవసరమనుకున్నారేమో? ఓవక్క కానుపు కష్టమనీ బిడ్డలు దక్కరనీ బాధపడుతూనే వీరికీ అలక్ష్యమేమిటో?" విస్తుపోయారు కరుణా,శకుంతలమ్మాను.

వర్ధనికి నెప్పులొచ్చే సమయానికి గిరీశం వూళ్లోనేవుండటం ఒకవిశేషం.

కనీసం అప్పుడయినా భార్యని ఏ నర్సింగ్ హోమ్‌లోనో చేరుస్తాడనీ లేకపోతే డాక్టర్నే ఇంటికిరప్పిస్తాడనీఅనుకున్నారు తల్లీకూతుళ్ళు.

కానీ గిరీశం నాటు మంత్రసానిని తీసుకువచ్చాడు.

"చేతినిండా సొమ్మూ, దానకర్ణుడన్న బిరుదూ వున్నది ఈ మనిషికేన అనిపిస్తోంది. ఈకాపీనం చూస్తోంటే." అన్నది కరుణ తల్లితో.

తనెంత మొత్తుకున్నా డాక్టరుకి చూపించక పోవటం, కనీసం చెయ్యిసాయానికో చుట్టాన్నయినా పిలిపించకపోవటం వీటికి కారణం గిరీశం ఖర్చుకు వెనకాడటమే అయుంటుందన్ననిర్ధారణ కొచ్చేసింది కరుణ.

అటు భర్త పిసినారి తనాన్ని వెల్లడి చెయ్యలేక, ఇటు కడుపుకోత భరించలేక వర్దని అట్లా నలిగిపోయుంటుందని నిశ్చయించుకున్నది కరుణ.

"పేరుకోసం దానాలు చేసే ఔదార్యుడన్నమాట గిరీశంగారు." గిరీశాన్ని తలుచుకున్నది వెగటుగా.

ఆవేళిటికి ట్యూషన్లు మానుకొమ్మని, కరుణకి ఇంట్లో పని ఒప్పగించి వర్దని ప్రసవించేదాక దగ్గరుండే ఉద్దేశ్యంతో ఆదరా బాదరా గిరీశం ఇంటికి వెళ్ళింది శకుంతలమ్మ.

ఆవిణ్ణి సావిట్లోనే అడ్డుకున్నాడు గిరీశం. అసలావిణ్ణి చూస్తూనే తత్తరలాడిపోయాడెందుకో. "అబ్బే ఎందుకండి మీకి శ్రమ...అటూ నొచ్చుకుని," అన్ని మంత్రసాని రంగమ్మే చూసుకుంటుంది. పాపం...పని ఆపుచేసుకు వచ్చినట్టున్నారు. అవసరమయితే నేను కబురుచేస్తాలెండి" అన్నాడు. పొమ్మనలేక పొగపెట్టినట్టు "రావద్దు" అని మొహం మీద చెప్పలేక.

ఆసమయంలో తనరాక అతనికి ఏమాత్రం ఇష్టంలేదని గ్రహించింది శకుంతలమ్మ. ఆవిడ మనస్సు చివుక్కుమన్నది. కానీ కష్టపడుతున్న వర్దని మీద అభిమానంచేత వెంటనే వెనక్కి తిరగలేక పోయింది

"శ్రమకేమున్నదితేనాయనా ...కష్టసుఖాల్లో ఒకరికొ

కరు ఆదుకోకపోతే ఎలాగ." అంటూ ముందుకే అడుగేయ బోయింది.

అంతలో అటుగా వచ్చింది మంత్రసాని రంగమ్మ. ఆవిడకూడా గిరీశం మాటల్నే బలపరిచింది.

"ఆ వర్ధనమ్మ అసలే సుకుమారి. చిన్న చిన్న నెప్పులకే పెద్ద పెట్టున రద్ది చేస్తుంది. ఇహానువ్వు దగ్గరుండి మా తల్లి మాయమ్మ అంజెప్పి గారం చేస్తివా ఇల్లే అదరగొడుతుంది. అంతగా అవసరమయితే నేను కేక పెడతలే అమ్మా...పోయి నీ పని చేసుకో. అయిన ఈ ఇంట పురుళ్ళు నాకేం కొత్తా— ప్రతి మాటూ నా ఒక్కచేతిమీద కాదూ పోస్తూండ!" అంటూ గడసరి తనంగా చెయ్యితిప్పుతూ గిరీశం చెప్పలేక పస్తాయిం చిన దాన్ని తను తెగేసి చెప్పి పూర్తిచేసింది.

చిన్న బుచ్చుకున్నది శకుంతలమ్మ లోపలి గదిలో నించీ వర్ధని మూలుగు తనని రమ్మని పిలుస్తున్నట్టే అనిపి స్తున్నా మనస్సుగ్గబట్టుకుని గిరుక్కున వెనక్కి తిరిగింది.

ప్రసవకాలం స్త్రీకి జీవన్మరణాల మధ్యజరిగేపోరాటం నవమాసాలుగా గర్భంలో రూపు దిద్దుకుంటున్న జీవి సంపూ ర్ణుడయి బయట వెలుగు చూడాలనే తహతహలో తనకు ఉనికి నిచ్చిన ప్రాణాన్నే హింసపెట్టే తరుణమది.

ఆ సమయంలో స్త్రీకి ఆ బాధతట్టుకోగలిగే జవసత్వాలు కావాలి. అంతేకాదు చావు బ్రతుకుల నడుమ కొట్టుమిట్టా

డుతూ ఆయాతనలోనే తనజీవితం పరిసమాప్తి అవుతుందేమో నన్న శంక కలుగుతోన్న ఆ స్థితిలో ఆమెకు మానసికంగా కూడా బలం కావాలి. ఆ మనోదార్ఢ్యం కోసరమే కాన్పుసమయంలో ఆప్తులో, హితులో తన చేరువగా వుండాలని కోరుకుంటుంది.

వారు ఆత్మీయితతో ఆప్యాయంగా ఉపశమన వాక్యాలతో స్వాంతనకలిగిస్తుంటే నావారున్నారనే ధీమాతో ధైర్యం తెచ్చుకుంటుంది.

ఈ కష్టం తాత్కాలికమనీ, కొలది క్షణాల ఈ శ్రమ అనంతరం వెల్లివిరిసే పసిపాప చిరునవ్వులే శాశ్వితమనీ చల్లని మాటలతో నమ్మకం కలిగిస్తోంటే, రాబోయే ఆ శుభఘడియల కోసరం యావచ్ఛక్తినీ కూడదీసుకుని మృత్యువుతో పోరాడుతుంది.

"ప్రసవబాధ పడుతోన్న ఆ అమాయకురాలికి నడుం రాసేటందుకూ, బిడ్డ భూమ్మీద పడ్డాక బొడ్డుకోయడానికీ ఆ మంత్రసాని రంగమ్మే చాలు. నిజమే-కానీ భయంతోనూ, అధైర్యంతోనూ తల్లడిల్లిపోతున్న వర్ధనిని ఆదరంతో అనునయించే హస్తమేది? బైటనిలబడి దిక్కులు చూస్తోన్న భర్త... అప్పుడే ఇల్లు అదరగొడుతోందని చెప్పుతోన్న మంత్రసాని?

వికలమయిన మనసు పరిపరివిధాల పోతుండగా తిరిగి వచ్చేసింది శకుంతలమ్మ.

వెళ్ళిన పది నిమిషాల్లోనే తిరిగి వచ్చిన తల్లిని "అదేమి టమ్మా అప్పుడేవచ్చేశావ్? అక్కకి ఎలా వుంది" అదుర్దాగా ప్రశ్నించింది కరుణ.

ఉస్సురంటూ నిట్టూర్చింది శకుంతలమ్మ. "కళ్ళతో నన్నా చూడనివ్వలేదమ్మా మీ అక్కని" అంటూ గిరీశం, రంగమ్మా కలిసి తన్నెట్లా మాటలతోనే వెళ్ళగొట్టేశారోచెప్పింది నాకంతా ఏమిటో ఆందోళనగా అయోమయంగా ఉన్నదమ్మా యీ దేవుడు దగ్గర దీపం వెలిగించుకుంటేనేగానీ శాంతిచిక్కేలా లేదు అంటూ స్నానానికి వెళ్ళిపోయింది.

సతమతం చేస్తున్న ఆలోచనలతో అలాగే కూర్చుండి పోయింది కరుణ.

ఔట్ హౌస్ కి పట్టుమని పదడుగులు కూడా వుండదు గిరీశం ఇల్లు. ఇక్కణ్ణించి వర్ధని అరిచే అరుపులు మరీ అంత స్పష్టంగా కాకపోయినా బాధాపూరితంగా, హృదయ విదారకంగా వినిపిస్తూ కరుణ గుండెల్ని పిండుతున్నాయి.

నామకహా పట్టుకు కూర్చున్న పుస్తకంలోని అక్షరాలు అలుక్కుపోయి కనిపిస్తున్నాయి. అంతకంతకూ ఉదృత మవుతున్న వర్ధని కేకలు కరుణని నిలువనివ్వటం లేదు.

ఉన్నట్టుండి వర్ధని వెర్రికేక పెట్టింది.

చేతిలో పుస్తకం దానంతట అదే జారిపోగా ఒక్క ఉదుటున లేచింది కరుణ.

అప్పుడే పూజ ముగించుకొచ్చిన శకుంతలమ్మ "నువ్వెందుకే అక్కడకూ" అని వారిస్తూనే వున్నది.

విననేలేదు కరుణ. ధనస్సు విడిచిన శరంలా రివ్వున వర్దని ఇంటికేసి దూసుకు పోయింది.

కరుణ గిరీశం ఇంట్లో అడుగు పెట్టిన క్షణంలోనే అప్పుడే పుట్టిన పసిగుడ్డు ఏడుపు బొంగురుగా తెరలు తెరలుగా వినిపించింది.

ఆ ఏడుపే కరుణ చెవులకు వీణా నాదమయింది. ఎంతో భారం ఒదిలి పోయినట్టు "అమ్మయ్య. అక్కయ్య గండం గడిచి గట్టెక్కింది." అని తేలిగ్గా వూపిరి పీల్చి వదిలింది.

మొహం మీద ఆనందపు రేఖలు విరిశాయి. పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి.

చావిట్లో ఎవరూ లేరు. ఇల్లంతా ఎరుగున్నది అవటాన వర్దని పురిటి గది దగ్గరకు నేరుగా వెళ్ళింది కరుణ ఉత్సాహంగా.

ఓరగా వున్న తలుపు మెల్లగా తోసి లోపలికి అడుగు వేయబోయిన కరుణ లోపల గిరీశం వుండటం చూసి సంకోచిస్తూ ఆగి బిడియంగా పక్కకి ఒదిగింది నిశ్శబ్దంగా. అమెరాక నేవరూ గమనించినట్టులేదు.

గిరీశం రంగమ్మ చేతిలోని శిశువుని ఒంగి చూస్తున్నాడు.

"మాలిన్యమైనా కడిగినట్టులేదే...పిల్లణి చూసేందుకు అంత ఆత్రమేం ఈయనకు..."గుంభనగా నవ్వుకున్నదికరుణ.

ఇంతలో వర్దని వెక్కివెక్కిపడుస్తున్న ధ్వని."అంట్లాంటి బిడ్డనేం చేసుకుంటావ్...మామూలేగా... గుండెశాయిచేసుకో గొణుగుతున్నట్టుంటున్నరంగమ్మగొంతూ"ఒదులుమంటూంటె అంటో విసుగ్గా గిరీశం కంఠస్వరమూ వినిపించినయ్.

"ఏమిటి ఏం జరుగుతోంది లోపల?"కరుణ కలవరంగా తొంగిచూసింది.

ఆశ్చర్యకరమైన దృశ్యం కనిపించిదక్కడ.

భర్త దగ్గర్నించి పిల్లవాణ్ణి లాక్కుంటూ పెనుగులాడు తోంది వర్దని. భుజాలు పట్టి వెనక్కి గుంజుతున్నది రంగమ్మ.

ఈసారి పిల్లవాడి మొహం స్పష్టంగా కనబడిందికరుణకి.

"ఓహ్...ఏం ఆకారమది? దెయ్యపు తలలా పెద్దతల కాయ కళ్ళు వుండాలిసిన స్థానంలో మాంసపుకండలు ముక్కు నోరు ఏకమై సొరంగంలా పెద్దతొర్రి; అసహ్య గొలుపుతున్న శరీరం...అబ్బ...భయంకరం.అత్యంత జుగుప్సాకరంగావున్న ఆ పిల్లవాణ్ని చూస్తూనే ఒళ్ళుజలదరించింది కరుణకు.

కరుణ అలా వెర్రెత్తినట్టు చూస్తూనే వుంది. మరో క్షణంలో అక్కడ ఇంకా ఘోరమైన కార్యం జరగబోతోందని ఆమె వూహాకి తట్టనే లేదు.

"మీకు దణ్ణం పెడతాను వాడికింకా వూపిరాడుతూనే వుంది." వర్ధని ప్రాధేయపడుతోంది.

"ఇన్ని అవకరాలున్న వాడికి ఊపిరున్నా ఒకటే లేక పోయినా ఒకటే..." గిరీశం వర్ధని చేతుల్లోంచి బిడ్డను లాగేసుకున్నాడు పెద్దగుడ్డలో పూర్తిగా చుట్టబెట్టేశాడు,

"ఏం చేస్తారాపిల్లణ్ని: బ్రతికి వుండగానే...

కాళ్ళకింద భూమి కదుల్తోంది కరుణకి.

"ఏలా వుంటేనేమండీ నా రక్తంలో రక్తమండీవాడు నామాట వినండీ... వర్ధనిమాతృహృదయం విలవిల్లాడుతోంది కళ్ళనీళ్ళతో బ్రతిమలాడుతోంది.

"విడు మెత్తగా చెప్తేవినవేం...హు...ఊపిరాడుతోంద నేగా నీ వెధవేడుపూ చూడు...అదెంత గట్టి వూపిరో..." గిరీశం వర్ధని ఒదలలేక ఒళ్ళోకి లాక్కుంటున్న ఆ పిల్లవాడి కంఠాన్ని రెండుచేతుల్తోనూ పట్టుకుని అదోలాంటి ఆవేశం పూనినట్టు గట్టిగా అలా అలా నొక్కేస్తున్నాడు.

కరుణకి లోకం గిర్రున తిరుగు తున్నట్టనిపించింది.నురు క్షణంస్పృహతప్పింది.

వెనక్కి విరుచుకు పడిపోతున్న కరుణనిగిరీశంచూశాడు. రంగమ్మ చూసింది. వర్ధనీ చూసింది దుస్వప్నం చూస్తున్నట్టు చెమటలు పట్టాయి గిరీశానికి.

*   *   *

శరీరానికి చల్లటి గాలీ ముఖానికి చల్లటి నీళ్ళూ తగిలి తెలివి వచ్చింది కరుణకి.

ఎదుట రంగమ్మ విసిన కర్రతో విసురుతూ చన్నీళ్ళ మొహాన్ని చిలకరిస్తూ కనిపించింది.

కళ్ళు విప్పిన క్షణంలో "ఏమయింది నాకు?" అని తిక మకగా అనిపించినా మరుక్షణంలోనే కొద్దిసేపటి క్రితం తన కళ్లెదుటే జరిగిపోయిన దారుణం కళ్ళకు కట్టినట్టు గుర్తు కొచ్చి చివ్వున లేచి కూర్చుంది కరుణ.

పురిటి గదిలో వర్ధని వలలో చిక్కుకుపోయిన పక్షిలా నీరసంగా, నిస్త్రాణగా పడుకొని వుంది. గిరీశం జాడగానీ పని వాడి పొలకువగానీ లేదు.

గిరీశం తలపుకు రాగానే గుండెల్లో వణుకు ప్రారంభ మైంది కరుణకి. "తనిప్పుడున్నది ఓ నరరూప రాక్షసుడి గుహలో. "నరవాసన నరవాసన" అనుకుంటూ ఏ క్షణాన్న యినా తనకోసము రాక్షసుడు రాగలడు అనిపించింది.

ఈ పిచ్చి వూహ గంగ వెర్రులెత్తించింది కరుణని.

గభాలున లేచిపోబోతున్న కరుణని భుజంపట్టి ఆపింది రంగమ్మ. బితుకు బితుకుగా చూసింది కరుణ.

"చూడు బుల్లెమ్మా! అసలే గిరీశమయ్య కానోడు సుమా! ఇక్కడ చూసిన సంగతి ఇక్కడే మర్చిపో. అదే నీకూ మాకూ భద్రం" అన్నది పట్టు వదుల్తూ.

అది ఒట్టి హెచ్చరిక మాత్రమేకాదు; పరోక్షంగా బెదిరింపు కూడా. పొరపాటునైనా నాటక జారిన మరుక్షణంలో ఆ పసివాడికి పట్టినగతే నీకూ పడుతుందన్న సూచన.

గజగజ లాడింది కరుణ. నేరక పోయి సాలెగూట్లో చిక్కుపడింది. పంకంలో వున్న కమలంపై కరుణ చూపించబోయి పూబిలో దిగబడి పోయింది.

"ఎలా తప్పించుకోవాలి? ఎటు పారిపోవాలి?

బెదిరిన లేడిలా ఎవరో తరుముకు వస్తున్నట్లు ఇంటికి పరిగెత్తింది కరుణ.

భీతహరిణిలా చెమటలు కక్కుకుంటూ ఇంటికి చేరిన కూతుర్ని విస్మయంగా చూసింది శకుంతలమ్మ.

ఆమె అడిగినదానికి జవాబుగా, "పిల్లవాడు పుట్టి పోయాడు." అని పొడిగా సమాధానం చెప్పి పూరుకున్నదే తప్ప మరో అక్షరమన్న పెదవిదాటనివ్వ సాహసించ లేదు కరుణ.

"అనుకుంటూనే వున్నాను." నిట్టూర్చింది శకుంతలమ్మ.

వర్ధనిని ఓదార్చను వెళ్ళాలని మనసు వెంపర్లాడుతోన్న కొన్ని గంటలక్రితమే తన ఎడల నచేశం ప్రవర్తించిన

విధం ఇంకా పచ్చిగానే వుండి బాధిస్తున్నందువల్ల ఆమె కాలు ముందుకు పడలేదు.

మూణ్ణాళ్ళు దాటినా మతి స్తిమిత పడలేదు కరుణకి. ఆపత్తేదో విరుచుకు పడుతున్నట్టూ, ఉప్పెన తనమీదికే ముంచెత్తుకు రాబోతున్నట్టూ భ్రమ, ప్రమాదమేదో తన వెన్నంటే తిరుగుతున్నట్లు భ్రాంతి, మృత్యుచ్ఛాయలో నివశిస్తున్న అనుభూతి, ఆమెను అనుక్షణం బెదర గొట్టేయి.

చిన్న చిన్న చప్పిళ్ళకే ఉలిక్కిపడటం, వడగాలికి తట్టుకోలేక రెపరెపలాడుతున్న చిగురుటాకులా కంపించటం, నిద్దట్లో పెద్దగా కలవరించటం చూసి కూతురు తొలిసారిగా ప్రసవవేదనా, పసిబిడ్డ మరణం చూడ్డమూ మనస్సు వికలం కావటమూ అందుకు కారణ మనుకుని విభూతి పెట్టి వీపు తట్టేది శకుంతలమ్మ.

కానీ అభీతితనం తనకుతాను మనస్థయిర్యం తెచ్చుకుంటే తప్ప విభూతులతో అణిగేదా?

చెదరిన గుండెలు కుదుటపడనేలేదు. పుండుమీదదెబ్బలా మరో దుర్వార్త, పాలుపోసే గొల్లవాడు అందించేడు ఆరోజు. తెల్లవారు జామున వాతం కమ్మి వర్ధని కన్నుమూసిందట!

స్థాణువై పోయింది శకుంతలమ్మ.

చైతన్యమే కోల్పోయి కొయ్యబొమ్మలా నిలబడిపోయింది కరుణ.

చెయి జారిన గిన్నెలోనించి చిక్కటిపాలు ధారగట్టి పారుతూ మెల్లగా మట్టిలో ఇంకిపోయాయి.

మానవ మనుగడకు ప్రధానమైన జీవాలు పిట్టకు తెలవకుండా గప్ చిప్‌గా గాలిలో కలిసిపోతే, ఎందుకూ పనికిరాని కట్టె అత్యంత వైభవంగా పదుగురి ఎదటా మేళతాలతో మట్టిలో కలుస్తుంది.

వర్ధని పాడె పసుపు కుంకుమలతో లేచాక సజలనేత్రాలతో వ్యధిత హృదయాలతో ఇంటికి వచ్చి స్నానం చేశారు. శకుంతలమ్మా కరుణాను.

తల్లి దేవతార్చనలో మునిగింది.ఆవిడకన్నిచికాకులనించీ దూరంగావుంచి ప్రశాంతతనిచ్చేది ఆ దేవదేవుని సన్నిధానమే.

ఏ ఆలంబన లేని కరుణ నిస్త్రాణగా మంచంమీద వాలిపోతూ అంతకు క్రితమే పోస్టుమాన్ గిరవాటేసినకవరు అన్యమనస్కంగా చింపి లోపల కాగితం ఇవతలకు లాగింది.

క్షణంలో ఆమె పరధ్యానం ఒదిలిపోయింది.

ఆ వుత్తరం రాసింది వర్ధని. క్రితంరోజు అంటే ఆమెజీవితం చరమగీతానాన్నాలాపిస్తూండగా రాసిని లేఖ అది.
అత్రుతగా చదువుకున్నది కరుణ.

ప్రియ కరుణా.

ఆశ్చర్యపోతున్నావా! ఈలోకానికి దూరం కాబోయే

ముందు ఏ ఒక్కరికైనా ఇన్నాళ్ళు నేననుభవించిన జీవశోక మనసు విప్పి చెప్పుకోవాలనిపించింది. భగవంతుడిచ్చిన సహోదరివి. నాకు అత్యంత సన్నిహితురాలివి. నీముందు తొలిసారిగా చివరిసారిగా కూడా నాగళం విప్పుతున్నాను. కడుపులో దాచుకుంటావు కదూ!

ఇంతకాలం హైందవ పతివ్రతా ధర్మాన్ని స్మృస్త్రో-నోటికి గడియలు బిగించుకున్నాను నేను. కానీ కాకతాళీయంగా నేను దాస్తున్న రహస్యాన్ని భగవంతుడేనీకు బహిర్గతం కావించాడు. దాన్ని బట్టి నాదెంత దౌర్భాగ్యపు బ్రతుకో నీకు కొద్దిగా అర్ధమయ్యేవుంటుంది.

నీకు తెలియదు కరుణా! మా కొచ్చే రాబడి ఎటువంటి నీచమైన దార్ల గుండా వస్తోందో మేమెటువంటి పడుపుకూడు తింటున్నామో గుర్తు కొచ్చినప్పుడల్లా నా మనస్సు సిగ్గుతో కుచించుకుపోతుంది. కొంచెమేగానీ గొప్పగానే కానీ రెక్కల కష్టంమీద న్యాయంగా జీవిస్తున్న మా చుట్టు పక్కల కుటుంబాల్ని చూస్తున్నప్పుడు వారెంతో పవిత్రులు- నాజన్మెంతో వికృష్టమైనదిగా తోస్తుంది. ఆ కాంప్లెక్సుతోనే అందరికి ఎడంగా మసిలేదాన్ని. ఈ ఏకాకి తనం నన్ను మరీ భయపెట్టేది ఎవరికి చేరువవుదామన్నా వారు నాలోతుల్ని కొలుస్తారేమోనని, మాలోపలి చీకటి కోణాన్ని తడుము తారేమో-నని అనుమానం భయం.

నువ్వొక్క దానివి అమాయకంగా పొరపాటున మా కపట జీవితం తెలిసినా క్షమించగల విశాల హృదయు రాలివిగా అగు పించావు. అంచేతే నీకు చేరువుగా లాగలిగేను.

పైకి సువాసనలు గుబాళిస్తున్న మా బ్రతుకు వెనకాల అంతా మకిలే. ఆమకిలి లోని అతి స్వల్ప భాగాన్ని మాత్రమే నువ్వు చూడ గలిగేవు. మిగతాది చెబుతాను విను.

నెలకు పదిహేను రోజులు పై వూళ్లలో తిరుగుతూ కమీషన్ వ్యాపారం అన్న ముసుగులో ఆయన చేసే ఘన మైన వ్యాపారం...చీకటి వ్యాపారం. ఇంకావివరంగా చెప్పా లంటే ఈ చుట్టు పక్కల వున్న టౌనులో పెద్దమనుషులనబడే కొందరులాడ్జింగుల పేరన నడపబడుతోన్న బ్రోతల్ హౌసులకు వాటాదారు స్మగ్లింగు వ్యాపారంలో భాగస్వామి.

ఈ పెద్దమనుషులు రాజకీయంగా బాగా పలుకుబడి కల వాళ్ళు, వాళ్ళ అండదండలు సహాయ సహాకారాలు ఈయనకు పూర్తిగా వుంటాయి. ఏమైన బయటకు వచ్చేలా వుంటేవాళ్ళు అడ్డుకోగలరు. ఆపగలరు.

నువ్వు కలలోకూడా ఊహించని ఇంకో సత్యంచెప్పనా కరుణా!

లచ్చిపేరు జ్ఞాపక మున్నదా? మాఇంట్లో పనిచేస్తూ లేచిపోయిందని ఓ కథ చెప్పి నిన్ను నమ్మించేం.

ఆలచ్చిని ఎన్ని విధాల ఆశ పెట్టినా తన త్రోవకు రాని లచ్చిని నాకళ్ళముందే మత్తుపెట్టి ఏవూరో మోసుకు పోయా రంటే నమ్ముతావా!

ఆ ఒక్క అచ్చేకాదు. మరోకనకం ...గవురి...సరుసు వీళ్ళందరూ మాఇంటికి మొగ్గల్లా వచ్చారు. ఇప్పుడు లాడ్జింగు లకి ఈడ్చబడి రేకులు చిదిమినపువ్వులయ్యారు.

ఈ దుష్కార్యాలన్నిటినీ కళ్ళారాచూస్తున్నా వారించే శక్తి లేని మూగసాక్షిని నేను.

ఆపాపం వట్టినే పోలేదు. చూశావుగా నాకు పుట్టిన పిల్లణ్ణి. అంత కంటే శిక్షేం కావాలి ఆడదానికి.

లోకకంటక మయిన కార్యాలే వృత్తి అయ్యాయి ఆయనకి. దుష్టసాంగత్యం తోడయింది. ఇంక చెప్పేదేముంది. దుమ్ములో దొర్లాడే వారికి దుర్గంధం అంటడం విడ్డూరంకాదు. మితిమీరిన స్త్రీ లోలత్వంతో ఆయన ఒళ్ళు ఏనాడో పుచ్చి పోయింది.

ఆయన భార్యనయిన పాపానికి నేనుకూడా శిక్ష అనుభ వించక తప్పటం లేదు.చాటుగామాటుగా ఏవో నాలుగు మాత్రలు మింగటంమినహాపరువుపోతుందనే దడుపుమూలాన్న ఆవాధ్యులికి సరైన చికిత్స తను చేయించుకోరు. నాకు చేయిం చరు.

అదిగాక మళ్ళీమళ్ళీ ఆపంకిలంలోనే ఈదులాడే వారికి ప్రక్షాళన ఎలా వీలవుతుంది?

గోడ్రాలిగా అయిన వుండగలను కానీ చేస్తున్న పాపాలకి ప్రతిరూపాల్లాంటి అలాంటి పిల్లలు మనకొద్దు—అసలు పుట్టకుండానే జాగ్రత్త పడదాం. అంటాను ఆయనఒప్పుకోరు.

తను అన్యాయంగా ఆర్జిస్తున్న లక్షలకి వారసుడు కావాలాయనికి. ఆయనలో ఎన్నో దుర్మార్గలక్షణాలున్నాయి వాటితో పాటు సంఘంలోఇప్పటివరకూకూడ బెట్టుకుంటున్న పేరు ప్రతిష్టలకి వీసమెత్తు కళంకం రాకూడదన్న పట్టుదలా, తన రక్తాన్ని పంచుకు పుట్టిన బిడ్డలు కావాలనే కోరికగూండా బలంగా వున్నాయి.

తడవ తడవా శాపగ్రస్తుల్లాంటి పిల్లల్ని కనటం నాకు దుస్తరంగా వుంది కరుణా! ఆయన మాత్రం ఎప్పుడో ఏ దేవుడో కనికరించి ఆరోగ్యవంతుడైన బిడ్డనిఒసగకపోడు అనే ప్రలోభాన్ని ఒదులుకోలేక పోతున్నారు.

నన్నాయన కొట్టరు. తిట్టరు. కానీ అవసరమయితేఅంత కన్నా దుర్మార్గం చేతల్లోనే చూపించటం నువ్వుకూడా చూశావు.

నామనసును బాధించేది ఆ కర్కశత్వమొకటే కాదు కరుణా! ఆయన తిరిగే తిరుగుళ్ళు కూడా నామనసును ఛిద్ర

స్తున్నాయి. ఈ జెల్లా. ఆయన సుఖవ్యాధులన్నీ జలగలాపాకీ నా శరీరాన్ని వేధిస్తున్నాయి.

బ్రతికివుంటే మానసికంగా, శారీరకంగా నాకీ చిత్ర హింస నుంచి విముక్తి లేదు. చావు ఒకటేనన్నీ యమచెరనించి విముక్తి కలిగించేది అనే నిర్ణయానికివచ్చేశాను.

అందరికీ నామరణం అతి సహజంగా జరిగినట్టే ప్రచార మవుతుంది నాకు తెలుసు.

అలాగే కానీ మరోలా అవ్వాలని నేను కోరుకోవటం లేదు.

చివరిగా ఒక్కమాట నిన్ని యింటికి ఏఉద్దేశ్యంతో తెచ్చే రో నాకు తెలీదు. మల్లెపూవంటి నిన్ను చూస్తూనే ముళ్ళగుంట లాంటి మాకెందుకు పరిచయ మయ్యావా అని బయపడ్డాను. మాకు దూరంగా వుండి పోవాలని మనసారా కోరుకున్నాను. భగవంతుడు వేరే తలచి దగ్గరే అయ్యావు. నేను లేనిది నీ కిక్కడ రక్షణలేదు కరుణా! తక్షణం వెళ్ళిపో. ఆయన్నించి తప్పుకు మసులుకో.

ఇంకొక్కమాట: భారతీయ స్త్రీ ధర్మంగా పతిదేవుడి లొసుగులని దాచే ప్రయత్నమే అనుకో... నిన్ను అర్థిస్తున్నాను నీవు చూసింది నేను రాసిందీ అన్నీ మర్చిపో. నామాట మన్ని స్తావనే ఆశతో... నీ శ్రేయస్సుకోరే వర్దని.

చదవటం ముగించి కళ్ళుమూసుకుని వెనక్కి వాలింది కరుణ. మూసిన కను కొలుకుల నించి కన్నీరు జలజల రాలితలి

గడని తడిపాయి. వర్ధని మరణవార్త వినగానే ఏమూలో మిణుకుమన్న అనుమానం ఈజాబు ధృవపరుస్తోంది.

భర్త అనబడే పురుషుడి ద్వేషానికి, నైచ్యానికి బలయిపోయింది వర్ధని.

కళ్ళముందు "కరుణా" అంటో ఆప్యాయంగా పిలిచే వర్ధని కమనీయరూపం పొడగట్టి హృదయం సముద్రమే అయింది. కెరటాలు కెరటాలుగా కన్నీరు పొంగుకొచ్చింది.

ఆ దుఃఖపు ఉరవడి తగ్గాక యోచనలో పడింది కరుణ.

కఠినంగా అయితే నేమి మృదువుగా నయితేనేమి నేను రంగమ్మా,వర్ధనీ తనని శపించిదొక్కటే గిరీశం నిజరూపాన్ని మరచి పొమ్మని.

వెర్రివాళ్ళు కాకపోతె చెలరేగుతున్న గిరీశం వంటి గోముఖ వ్యాఘ్రాల దుర్మార్గాలనీ, వారినిజస్వరూపాలనీ బట్టబయలు చెయ్యడం అత్యంతావశ్యకమే అయినా తనబోటి అబలల కదిసాధ్యమా?

తెగించి, వూళ్లో ఘరానా మనిషిగా చెలామణీ అవుతున్న అతన్ని పట్టుకుని హంతకుడని చెప్పబోయినాతన మాట నమ్మేదెవరు? కరుణించి ఇంట్లో తావిచ్చినందుకుకృతజ్ఞతచూపిస్తోందని తననే ఎదురు దుయ్యబట్టరా?

పైగా మిన్నాగు వంగిరీశంతోటి కోరి వైర్యం తెచ్చు కోవటం అతని మనసులో తన పట్లపగ రగిలించటమేఅవుతుంది. ఎటువంటి అండదండలూ లేని కన తది ఎంతముప్పు?

అటువంటి దుష్టుల కబంధ హస్తాలకు చిక్కకుండా దూరంగా తొలగిపోవటమే తన బోటి వారికిశ్రేయస్కరం.

తెలియక విషవృక్షం నీడన చేరింది. దాని వూడలు తనని చుట్టివేయక మునుపే మెలుకువగా తప్పించుకుని మరొక పంచ చూసుకోవటమే తన ప్రస్తుత కర్తవ్యం.

* * *

కరుణ మరో యింటికోసం ప్రయత్నిస్తోందని చూచా యగా తెలియగానే గిరీశం గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి.

“పిట్ట తప్పించు కుంటోంది. త్వరపడాలి” అనుకున్నా డతను.

కరుణ సామాన్యమయిన పిట్టకాదు.అందాలరామచిలుక పిల్లకాకే అయినా తన గుట్టు మట్లు తెలుసుకున్న భడవ.పై కె గిరిపోనివ్వటం ప్రమాదం. తాయ్సారం చెయ్యకుండాపిడికిట్లో బంధించటం ఎంతయినా అవుసరం.

అదే-ఎలాగని? రంగమ్మ బోటివారినయితే డబ్బు గుప్పి ంచి లోబరుచు కోవచ్చు. కరుణలాంటి ఉడుకు రక్తంపిండాలు

పచ్చకాగితాల రెపరెపలకి కరగరు. అదీగాక పైకంతో కొను క్కున్నవోరుతాత్కాలికంగానే మూతపడుతుంది. దాన్ని అడపా తడపా అరరాగా తడపాలిసే వుంటుంది. అందుచేత కరుణని శాశ్వత బంధంలోనే బిగించాలి, అని నిశ్చయించుకున్నాడు గిరీశం.

"ఇంకో ఇల్లు చూస్తున్నావట నిజమేనకరుణా?"

మోహనరాగాన్ని సన్నగా ఆలాపించుకుంటూ, సంధ్య దీపం వెలిగించే ముందు మురళీగాన లోలుని కంఠాన్నలంక రించే నిమిత్తం మల్లెపూలు కోస్తున్న కరుణ గిరీశం రాకతో రాగం ఆపింది. అతని ప్రశ్నకు గతుక్కుమన్నది.

"ఆ...అహ... అవును." అన్నది తొట్రుపాటు పడుతూ

"ఏం? నీకిక్కడ అసౌకర్యంగా వుంటోందా? ఎందుకు వెళ్ళిపోవాలనుకుంటున్నావు?" మల్లెపందిరి పక్క నున్న తిన్నెపై స్థాయిగా చతికిల పడుతూ అడిగాడు గిరీశం.

"అబ్బే—అసౌకర్యమేమీ లేదు. అక్కయ్య పోయాక ఇంత పెద్ద కాంపౌండులో వంటరిగా వుండాలంటే భయంగా బెరుగ్గా వుంటేనూ...గట్టి కారణం ఏమి చెప్పాలో తోచక ఏదో నసిగింది కరుణ.

గిరీశం దీనంగా నిట్టూర్చాడు. "నిజమే ఈ రెండునెలల బట్టీ ఇంట్లో అడుగు పెడితే నాకు పిచ్చెత్తినట్టుగానే వుంటోంది

ఏంచెయ్యను.? ఇంటి దీపం ఆరిపోయిన దౌర్భాగ్యుణ్ణి. అన్నా డు సానుభూతికోసం ఎదురు చూస్తూ.

మల్లె పూరేకలు ఒక్కటొకటే తుంచిపోస్తూ మాట్లాడ లేదు కరుణ.

కనీసం "బాధపడకండి...ఏంచేస్తాం." అనే ఓదార్పు మాటలైన అంటుందని ఆశించిన గిరీశం నిరాశా హతుడై నాడు.

క్షణం ఆగి మరోమారు భారంగా నిట్టూర్చి మళ్ళీ తనే మొదలు పెట్టాడు.

"ఇల్లు నిండిన ఐశ్వర్యం వుంది. బీరువాలో వందలాది చీరలు మడత నలక్కుండా పడి వున్నాయి. నగలూ నాణ్యా లూ ఇనప్పెట్టెలో మూలుగుతున్నాయి. అనుభవించే యోగం దానికి లేకపోయింది. ... రెండు చేతులా సంపాయిస్తున్నా ఇంట్లో దీపం వెలిగించే దిక్కు నాకులేక పోయింది." చీరలూ నగలూ మీద వత్తి పలుకుతూ కరుణ ముఖ కవళికల్ని పరిశీలన గాచూస్తూ అన్నాడతను.

అతని వగలమారినిట్టూర్పులు చూస్తూన్న కొద్దీ అతని సింహస్వప్నంగా భావించి దడిచిన దల్లా ఆ భయం తగ్గి చిర్రె త్తుకొస్తూంది కరుణకి. నగలూ చీరెలే ఆడదాని వరమావధుల నుకుంటున్నాడు మూర్ఖుడు.అనుకున్నది జుగుప్సగా.

"మరె...మరె—అటువంటి వైభోగం అనుభవించే అదృష్టం అందరినీ వరిస్తుందా!" అన్నది వెటకారంగా.

కరుణ మాటల్లో వ్యంగ్యం గమనించి ఒకింత కళకళ పడినా పైకి గుర్తించనట్టూ నటించాడు గిరీశం.

కొన్ని క్షణాలు విచారం అభినయిస్తూ నిశ్శబ్దంగా వూరుకున్నాడు.

ఉన్నట్టుండి "నేనీ ఒంటరి తనం భరించలేకపోతున్నాను కరుణా! మళ్ళీ పెళ్ళిచేసుకుందామనుకుంటున్నాను." విధిలేక బలవంతాన ఆ నిర్ణయానికి వచ్చినట్టు మొహం పెట్టి అన్నాడు గిరీశం.

బుర్ర గిర్రున తిరిగింది కరుణకి. ఒకర్ని బూడిదచేసి నిండా రెండునెలలు తిరగలేదు. అప్పుడే మరో చేపకోసం గాలమా?

గభాలున "వద్దు వద్దు. ఆ పనిమాత్రం చెయ్యకండి" అనబోయి తమాయించుకున్నది కరుణ. తొందరపడ్డం మంచిది కాదు అనుకుంటూ.

"మంచిదే" అన్నది ఎంతో ఓర్పు తెచ్చుకుంటూ.

తేలికైన సువాసనా, స్వచ్ఛతకు మారురూపయిన తెల్లని మల్లెలంటె కరుణకి మహా ఇష్టం. పందిరికింకా విచ్చుతోన్న మొగ్గలు మిగిలే వున్నాయి.

ఐనా గిరీశం సాన్నిధ్యంలో మరికొన్ని క్షణాలే అగు గాక... అగటం, ఆగి అతని బూటకపు కన్నీళ్ళకి సానుభూతి చూపించటం కరుణకి దుర్భరంగా వున్నది. అంచేత కోసిన కాసిని పువ్వుల్తోనే సరిపెట్టి వెళ్ళటానికి ఉద్యమిస్తూ వెనుతిరిగింది.

"ఈవిషయమై మీఅమగ్మారితో సంప్రదించాలనుకుంటున్నాను. కరుణా! వెనకనించి గిరీశం అంటున్న మాటలు విని తటాలున ఆగింది.

"మాఅమ్మతోనా?ఎందుకూ?" నొసలుచిట్లించిందికరుణ.

నిదానంగా ప్రారభించాడు గిరీశం ."వర్ధనికి ప్రేమపాత్రురాలివి. నీకు ఆమె స్థానాన్నివ్వటం నాకెంతో మనశ్శాంతి కలిగిస్తుంది. ఏలోకంలో ఉన్న వర్ధని ఆత్మకి గూడా ఇది సంతోషదాయక మవుతుందని నానమ్మకం. నీ అభిప్రాయం కూడా ఇందుకు భిన్నం కాకూడదని నాఆశ. ఏమంటావ్ కరుణా?" డొంక తిరుగుడు లేకుండా సూటిగా రంగంలోకిదిగిపోయాడు గిరీశం.

తన రహస్యాన్ని వెల్లడించ వద్దని బెదిరించటమో చేస్తాడనుకున్నది.

అలాకాక ప్రమాదం ఎదురుచూడని మార్గానప్రత్యక్ష్యమవటంతో లిప్తపాటు దిమ్మెర పోయింది కరుణ.

మళ్ళీ ధైర్యం హరించిపోతోంది. పులి పంజా విప్పింది. మీదికి దూకబోతోంది అనిపిస్తోంది.

ఆ అవస్థలోనే అప్రయత్నంగా చేతులు జోడించి, "వద్దు వద్దు. నన్నొదిలి పెట్టండి" అన్నది కరుణ కలవరిస్తున్నట్టు.

గిరీశానికామె వైఖరి "నీతోటి దాంపత్యమా? వద్దువద్దు నీకూ దానికీ ఓ నమస్కారం మహానుభావా!" అని ఎద్దేవ చేస్తున్నట్టనిపించింది.

అతని మొహం ఎర్రగా జేవురించి గాంభీర్యాన్ని అలుముకుంది.

"బయటకు వెళ్ళి నన్ను రచ్చచేద్దామని చూస్తున్నావేమో కరుణా...జాగ్రత్త! నేనెలాంటి వాడినో నువ్వెరగవ్. కరుగ్గా ఉరిమాడు.

అదిరి పడ్డది కరుణ. అంతరాంతరాలలో భయం తెరలు తెరలుగా కదిలింది.

కళ్ళెత్తి అతని వంక కంగారుగాచూసింది. "ఉహూ... ఆభయం మీకు వద్దు. చచ్చిపోయిన అక్క సాక్షిగా ప్రమాణం చేస్తాను. నానోటిమీదగా మీరహస్యాలేవీ బయటకు రానివ్వను కడసారిగా అక్కనన్ను కోరిన కోరిక గూడా అదే. అక్క అంటే నాకున్న గౌరవం మీకు తెలుసు.ఎన్నడూ ఆమెమాట మీరను. నన్ను నమ్మండి." అన్నది అర్థింపుగా

ఈ మాటలు వింటూనే వెల వెలా పోయాడుగిరిశం.

"వర్దనా? ఆఖరికోరిక? ఎప్పుడు ఏమని?"అన్నాడు.

అతడు గాభరాగా క్రింద నీుదులవటం కరుణ కనిపెట్ట లేదు. ఆమె హడావిడి ఆమెదీ.

"అవును. అక్క పోతూ పోతూ నాకు ఉత్తరంరాసింది. అందులో మీరహస్యాలేవీ బయట పెట్టవద్దని పదేపదే కోరింది. అక్కనన్ను ప్రాణాధికంగా ప్రేమించింది. మీరు నన్నెంతో అభిమానించేరు. అభిమానించిన వారికి ద్రోహం తల పెట్టేంత నీచురాన్ని కాను. ఈ ఇల్లుమానినా ఈ ఇంటి గుట్టుమాత్రం నాలోనే గుప్తంగా వుంచుకుంటాను. నిజం."ప్రాధేయ పూర్వకంగా నొక్కి చెప్పింది కరుణ.

అతనికి నమ్మకం కలిగించాలనే తాపత్రయంలో తెలివి తక్కువగా వర్దని ఉత్తరం మాట బయట పెట్టేసి గిరిశానికి మరింత దొరికి పోయింది కరుణ.

కరుణకి తెలిసిందల్లా ప్రసవంనాడు చూసిన దృశ్యమొకటే అనుకుంటున్నాడితను ఇంతవరకూ.అది పొరపాటని తెలిసి పోయింది.

గిరిశం ఆవేశంలోని తీవ్రతతగ్గింది. ఆగ్రహం పూర్తిగా అణగారిపోయింది.

అప్పుడతని మనస్సులో ఉత్పన్నమయిన ప్రశ్న— వర్దని ఏమని రాసివుంటుందీ?అని.

ఏళ్ళ పర్యంతమూ ఇనపకాలి కింద అణిచి వుంచినఅల్ప జీవి తనకే దిగ్భ్రమ కలిగేలా తననుండి తప్పించుకు మాయం కాబోతూ మరొకరికి రాసిన ఉత్తరమది—

సర్వాన్నీ త్యజించి ఆత్మహత్యకు సిద్దపడి మరీ రాసిన ఆఉత్తరంలో అందుకు కారణాలు తన పంజరపు జీవితగాథా, నానిజ స్వరూపమూ పూర్తిగా వెల్లడించేసే వుంటుంది. అని అతను తేలిగ్గానే ఊహించాడు.

అన్నీ తెలిసిన కరుణను తన పరిధిలో బిగించటం మరీ ముఖ్యం.

కానీ పిచిక మీద బ్రహ్మాస్త్రంలా ఏదైనా పెద్ద తంత్రం ఏన్ని రహస్యంగా ఏ లాడ్జింగుల్లోకో ఈడ్చెయ్యాలని గానీ, చిన్నపాముని పెద్దకర్రతో కొట్టినట్టు ఆమెని ఏ దురంతం పాలో చెయ్యాలని కానీ అనిపించలేదు. గిరీశానికి అతనుకరుణ మీద మోహాపట్టమే అందుక్కారణం.

"నువ్వు చెప్పు కరుణా! అన్ని అవలక్షణాలున్న పిల్లవాడు బతికి బట్ట కట్టినా వాణ్ణి చూస్తూ ఘడియ ఘడియా మేము దిగుళ్ళ పోవటం మినహా ఆనందమేముంది? నేనంత గుండె రాయి చేసుకుని అఘాతకానికి ఒడిగట్టానో అభగవంతుడికే తెలియాలి. ముక్కూ నోరు లేనివాడు సుఖపడేనా? నలు

గురూ నవ్వుతూంటే అవమానం పాలవుతూ మేము సుఖపడేనా ఇంత ముందాలోచన చెయ్యటం నాది తప్పంటావా కరుణా!" ఈ సంజాయిషితో తన తప్పు సమర్థించుకోను ప్రయత్నిస్తూ ప్రారంభించి మరలా తన ప్రపోజల్ ఎత్తుకున్నాడు గిరీశం.

"నామాట విను కరుణా నువ్వు అపోహ పడుతున్నంత దుర్మార్గుణ్ని కాను నేను నన్ను కాదని నువ్వు బావుకునేదే మీ లేదు కూడా. బాగా ఆలోచించుకో కరుణా:వలచి వచ్చే రాకుమారుడి కోసం పగటి కలలు కనేపదరేళ్ళ బాలాకుమారివి కావు. ప్రాజ్ఞత సంపాదించిన పాతికేళ్ళ ప్రాయపు పడుచువి నువ్వు. కొద్దో గొప్పో లోకాను భవంనువ్వు గడించేవుంటావు.

అందం చందం ఎన్ని సుగుణాలు వున్నాకట్నంగిట్నం దండిగా తెచ్చే కన్నెవైపే మొగ్గుచూపించే ఈకాలం యువకులు కూటికి తికానా లేని నిన్ను కనీసం సాంప్రదాయపు విలువనా్న లేని నిన్ను ఏం చూసి చేసుకుంటారు?

అందమా? అది డబ్బుముందు ఎందుకూ కొరగానిదని ముందే చెప్పాను.

ఇక అదనపు ఆకర్షణ సంగీతం ఉన్నదంటావేమో...?నీ స పాదన మీద ఆధారపడి తినాలనుకునేవచ్చు వెధవో దాన్ని చూసి మురవాలే గానీ వంటింట్లో కూనిరాగాలు తీయటానికి తప్ప మరెందుకూ పనికిరాని ఆసంగీతానికి భ్రమసి నిన్ను కట్టుకునే తెలివి మాలిన వాడుంటాడనుకోను.

నీకింకో సమస్య కూడా వున్నది. నీతోపాటు నీతల్లి పోషణ భారం కూడా వహించే ఉదాత్తులు వుండటం చాలా అరుదు.

నన్ను చేసుకుంటావా...నీసమస్యలన్నీ పరిష్కారమవుతాయి. నిన్నూ నీతల్లినీ పువ్వుల్లో పెట్టిచూసుకుంటాను.నువ్వీ పెళ్ళికి ఒప్పుకోవాలేగానీ ఇకనుండి నీఆజ్ఞ శిరసా వహిస్తాను. ఊఅను కరుణా...సరే నను. ప్రలోభ పెడుతూ ప్రాధేయ పడ్డాడు గిరీశం.

మంచి మాటలతోనే ఆమెను వంచుకు రావాలని అతని ఉద్దేశ్యం.

కరుణ బోనులో కుందేలులా దిక్కులు చూసింది.

ఆపద్బాంధవుడిలా అప్పుడే గేటు తెరుచు కుని అటుగా వస్తున్న తోటమాలినిచూసి తేరుకున్నది

"నాకే గాదు గిరీశంగారూ! అమాయకురాలైన ఏకన్నెమెడ లోను తాళికట్టే అర్హత లేదు మీకు. తెలిసీఎవరి గొంతూ కొయ్యొద్దని మనవి."అనిఖచ్చితంగా చెప్పేయ్యాలనిపిస్తున్నా. అలాచెప్పటంకోరి తల కొరివి పెట్టుకున్నట్టవుతుందని చెప్ప దలుచు కున్న వన్నీ ఒక్క గుటక తో దిగమింగి,"క్షమించండి." అంటో తడబడే గొంతు తో అనేసి చరచర నడిచి వెళ్ళి పోయింది కరుణ.

తొందరలోనే కరుణకి మరోయిల్లు కుదిరింది. గిరీశం వూళ్ళో లేని సమయం చూసి గుట్టుగా సామానుల్ని ఆఇంటికి తర్లించేసింది.

ఇది గిరీశం ఊహించనిదేమీకాదు. ఇలా జరగ వచ్చునని అతడు ముందస్తు కానే అనుకున్నాడు.

అతనికి తెలుసు. ఇంట్లోనించి కదలగూడదని అటకాయించే హక్కు అధికారం తనకు లేవు దాష్టీకంగా అడ్డుపడి నిర్బంధించ బోవటం మూర్ఖత్వమేఅవుతుంది. అందువల్ల ప్రయోజనం లేకపోగా కరుణ మరీ నోరూ వాయీ లేనితెలివి తక్కువది కాదు గాబట్టి కొంత రగడ రేపి తీరుతుంది.దానితో ఎప్పుడో ఆమెద్వారా తనకు సంభవించుతుందని అనుమానిస్తున్న అపాయం ఇప్పుడే కలగవచ్చు. చేతులారా తనపరువు తానే గంగపాలు చేసుకున్న వాడవుతాడు. కాగ—ఆమెకు తనయుందున్న కాస్త అభిమానమో...భయమో అదికూడాసడలినయ్యాన తనయందామెకు ఇష్టం కలిగించాలనుకుంటున్న తన పథకం వమ్మవుతుంది.

దాని కంటే ఇప్పటికి ఉదారత ప్రదర్శిస్తున్నట్టు ఊరుకోవటమే ఉత్తమం ఇన్ని ఆలోచనలు పోయి గిరీశం ఆమె నివాసం మార్పిడి పట్ల ఉదాసీనత వహించాడు.

అతని తత్వాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకోని కరుణ

అంతటితో తనకతని విమోచనం కలిగినట్లే భావించింది వేటగాడి వక్రగృష్టి నించే అతగాడి వాడి అమ్ముల బారినుంచీ తప్పించుకున్న పక్షిలా, ఒడ్డున పడ్డ చేపపిల్ల, తిరిగి నీటినిచేరుకున్నట్టుగా తేలిగ్గా ఫీలయ్యింది.

కానీ గిరీశం యొక్క కుటిల నిశిత దృష్టులనించి తప్పించుకోవడం అంతసులభం కాదు. అతడు సులువుగా ఆమె ప్రస్తుత నివాసాన్ని కనుక్కోవడమే కాకుండా పూర్వపు స్నేహాన్ని పురస్కరించుకుని వచ్చి పోతున్నట్టుగా ఎప్పుడప్పుడూ శకుంతలమ్మను పలకరించి వెళుతూ రాకపోకలు సాగించేడు.

కొన్నాళ్ళిలా శ్రేయోభిలాషిగా నటించి తదాది కరుణను మెత్తబరచాలని అతని యోచన.

ఏమయినా ఆడది అబలకద! వయస్సోపక్క వసంతలాంటి యవ్వనాన్ని మింగేస్తూ ప్రౌఢత్వాన్ని నీదిమీదికి తోస్తోందయ్యె! చుట్టూరా పరుచుకున్న కంటకాల్లా రోగిష్టి మారి తల్లి, రెక్కాడితేగాని డొక్కాడని పేదతనమూ, ఎలాంటి అండదండలూలేని నిస్సహాయత్వం. ఇన్ని కాని పరిస్థితుల రాపిడితో అలిసి సొలిసి విసిగిన కరుణ ఏనాటికైనా తన అంకెకు రాకపోతుందా అని దిలాసా.

ఆ భరోసాతోనే గిరీశం ఆ రాత్రివేళ కరుణ అడ్వకేటు

గారింటినించి వస్తూ వంటరిగా చిక్కినప్పుడు తిరిగి వివాహ ప్రస్తావన తెచ్చాడు. కరుణ అతని కోర్కెను కడగంటా త్రుంచి నిరాకరించడమే కాకుండా చుడుక్కు మనే మాటలతో అతన్ని పూర్తిగా రెచ్చకొట్టి మరీ వదిలింది.

గిరీశానికీ కరుణకీ జరిగిన వాగ్యుద్ధ ప్రకరణం వెనక ఇంత ఉదంతముంది.

ఆ సంఘటనతో గిరీశం లోలోన కసి పెరిగిన రేచే అయ్యేడు. కరుణ ఇంటికి వెళ్ళడం ఆనాటినుంచి పూర్తిగా విరమించుకున్నాడు.

తెరిపిన పడిపోయాననుకున్నది కరుణ.

* * *

శకుంతలమ్మ ఆరోగ్యం చవిటిపర్రలో సాగులా వుంటోంది.

ఎరువులు వేసీ, నీళ్ళుపెట్టీ, ఒళ్ళు విరుచుకునీ, ఆవసరానికి మించిన హైరానాపడిన పూర్తి సంతృప్తి నివ్వని వంటనే రాలుస్తుందది.

టానిక్కులూ, మందులూ పళ్ళూ పాలూ అంటో ఎన్ని వాడుటూ పోషణచేస్తున్న ఆవిడ ఆరోగ్యం అంతంతమాత్రం గానే వుంటోంది.

నిజానికి ఆవిడకి అసలు సుస్తీ కంటే మానసిక రుగ్మతే అధికం.

అందరినీ ఎదిరించి తనని చేపట్టిన భర్త జీవితాంతమూ తనకు బాసటయై నిలుస్తాడనుకున్న సహచరుడు. నడిదారిలోనే వదిలేటముంచి పోవటమే ఆమెకో హృదయ ఘాతమయింది.

ఆస్మృతులు అడుగున పడినా ఆ స్థానే కొత్త దిగుళ్ళా క్రమించి అయిన గాయాన్ని మానుపట్టకుండా చేస్తున్నాయి.

తను కన్ను మూసిన మరుక్షణం కూతురు దిక్కుమాలిన దయి పోతుందన్నదే ఆవిడ ప్రస్తుత మనస్తాపం.

కట్న కానుకలతో చీర సారెలతో సాంప్రదాయక మర్యాదలతో ఒక ఇంటికి వధువుగా పంపేటంత ఆర్థికస్తోమత తమకు లేదు.

తన భర్తలా విశాల దృక్పథంతో తన కూమార్తెను చేసుకునేందుకు ఏ ఉన్నత హృదయుడో ముందుకు వచ్చినా మళ్ళీ పాతచరిత్రే పునరావృతం అవుతుంది.

శత విధాల ఆ వివాహానికి పెద్దల ఆమోదముద్ర లంభించదు. బంధుత్వాలు తెగుతాయి. ఎందరు బంధువులున్నా, ఎంత సంపదవున్నా, ఎవరూ లేని అనాధుల్లా గూడు లేని పక్షుల్లా ఎవరి సానుభూతీ, సహకారమూ లేని నిస్సహాయులవుతారు.

కానీ అంతకమించి మరోలా జరిగే ఆస్కారం కానీ

అవకాశం కానీ తమకు లేవు. ఈ విషవలయంలో తనబడ్డ జీవితమూ పరిభ్రమించవలసిందేనా అన్నదే ఆవిడ మనోవ్యధ.

కరుణ ఇలాంటివేవీ మనస్సులోకి రానివ్వదు. వర్తమానంలోవున్న సమస్యల నెలా పరిష్కరించటమా అనే ఆలోచిస్తుంది.

తల్లి తప్ప ఇతరత్రా నా అన్నవారు లేని కరుణ ఆవిడ తుమ్మినా దగ్గినా అలజడి పడిపోతుంది. మళ్ళీ కాస్త సరిగా తిరిగేదాకా ఆందోళనతో అలమటించిపోతుంది.

కరుణ సంపాదన నిలకడయింది కాదు.

ఆమె సంగీత విద్యార్థుల్లో రెండురకాల వారున్నారు. సంగీతాభిమానంతో మానకుండా అభ్యసించే వారు కొందరయితే, పెళ్ళి చూపులకోసరం నాలుగు కీర్తనలతోనో, ఆ వివాహాలంచనం పూర్తయ్యేదాకానో ఆషామాషీగా నేర్చుకుని అక్కడితో ఆపుచేసేవారు మరి కొందరు.

ఈ మొక్కుబడి వారి మూలంగా ఆమె రాబడి ఒకే తీరున నికరంగా వుండక వూగిసలాడుతుంటుంది. ఒకోనెల్లో జరుగుబాటుకే చాలాకష్టమవుతుంటుంది. దురదృష్టవశాత్తు ఆ గడ్డుదినాల్లోనే శకుంతలమ్మకి జబ్బుచేయటం సంభవిస్తే చేతిలో సొమ్మాడక తల్లికి సరియైన చికిత్స చేయించలేని తన అసమర్థతను తన్నితాను నిందించుకుంటూ గిలగిల్లాడి పోతుంది కరుణ.

మళ్ళీ రెండురోజులనుంచీ శకుంతలమ్మకి జ్వరం. ఈ నెల్లోనేఇద్దరమ్మాయిలు ట్యూషన్లుకి మంగళం పాడేయటం మూలాన డబ్బుకిచాలాకటకటగా వుంది. పూర్వపు రోజుల్లో అయితే ఇలాంటిఆపత్సమయాల్లో వర్ధని ఆదుకుంటూ వుండేది. ఇప్పుడలా ఆసరా పడే వాళ్ళెవరున్నారు.

వర్ధని తలపుతో కలతపడిన మనస్సును ఓదార్చుకుంటూ పరధ్యానంగా అప్పుడే ఇంటికి చేరింది కరుణ.

గుమ్మం మెట్లెక్కబోతూ నిశ్శబ్దంగా వుండే తమవాటాలో మాటలు వినిపించి, మళ్ళీ గిరీశం దాపురించలేదుకదా! అనుకుంటూ గడపలో అడుగుపెట్టి అక్కడే కట్టెయి పోయింది.

మగతగా పడుకున్న శకుంతలమ్మ దగ్గరగా స్టూలు మీదకూర్చుని పల్స్ చూస్తున్నాడుడాక్టరు. ఆ పక్కింటి మెట్ల గదిలో కొత్తగా అద్దెకు దిగిన సత్యమూర్తి కాఫీ చల్లార బెడుతూ నుంచని వున్నాడు. పక్కవాటాలో రమణి విసినకర్రతో మెల్లగా విసురుతోంది.

వల్లమాలిన భయంతో క్షణకాలం ఆగిన గుండె మళ్ళీ తీవ్రంగా చలించటం ఆరంభించింది కరుణకి.

గొంతు గాద్గదికమై, కళ్ళు నిండా నీరు పేరుకుంటుండగా "ఏమయింది అమ్మకి?" అంటూ రెండంగల్లో తల్లి మంచం చేరుకుంది.

వర్షించే మేఘాల్లా వున్న ఆమెకళ్ళ కేసి ఆర్ద్రంగా చూశాడు సత్యమూర్తి.

"కంగారు పడకండి జ్వరతీవ్రతకో. నీరసంమూలానో స్పృహ తప్పారంతే. ఇంతకు ముందే తెలివొచ్చింది లెండి." అన్నాడు.

కరుణ కంఠం విని కళ్ళు విప్పి చూసింది శకుంతలమ్మ బేలగా కన్నీళ్ళు పెట్టుకుంటున్న కూతురి చెయ్యి నిమురుతూ ధైర్యం చెప్పటానికి తెచ్చిపెట్టుకున్న చిరునవ్వు నవ్వింది బల హీనంగా.

ఇంజక్షన్ చేసి ప్రిస్క్రిప్షన్ రాసిచ్చాడు డాక్టరు.

తట పటాయిస్తూ లేచి నిలబడ్డడాక్టర్ని చూసి ఆయ నెందుకు ఆగాడో గ్రహించింది కరుణ. పర్సు లో వున్న డబ్బుని మనస్సులో గుణించు కుంటుండ గానే సత్యమూర్తి తన జేబు లో నించీ పది రూపాయల నోటు లు రెండు తీసి ఆయన చేతి కందించాడు.

రోగి పట్లతీసుకోవలసిన జాగ్రత్తల గురించి మరోసారి హెచ్చరించి వెళ్ళి పోయాడు డాక్టరు.

సత్యమూర్తి కూడా పోబోతూ డాక్టరు రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ జేబులో పెట్టు కున్నాడు.

"మీరు మళ్ళీ బజారు కేమెడతారు-నాకెటూ

బయటకు వెళ్ళే పని వుంది. వచ్చే టప్పుడు ఈ మందులు తీసుకు వస్తాను.'' అన్నాడు కరుణ తో.

కరుణ సంకోచిస్తోంది. ఎంత కూడినా మూడు రూపాయలకి మించి వుండదు పర్సులో ఏమని చెప్పాలతనికి?

తడబడుతో ఏదో సాకు చెప్పి వారించబోయేటంతలో వెళ్ళి పోయాడు సత్యమూర్తి. కృతజ్ఞత కురిపిస్తున్న మైథిలి చూపుల్ని కూడా అందుకోలేదతను.

చల్లార్చిన కాఫీ శకుంతలమ్మకి తాగిస్తూ చెప్పిందిరమణి.

స్టౌ అంటిస్తూ ముందుకు పడిపోయారట. వంట యింటి తలుపు తెరిచి వుండటం అదృష్టమే. అప్పుడే పెరట్లో బావి దగ్గరకి స్నానం చెయ్యటానికి వచ్చాడటసత్యమూర్తి. ఈవిడిలా ఒరిగిపోడం చూసి ఒక్క కేక పెట్టాడు. ఏమో అనినేనుపరుగెత్తు కొచ్చాను. మొహాన నీళ్ళు చల్లి ఇద్దరం సాయం పట్టి మంచం మీదికి చేర్చాం. అతను వెళ్ళి డాక్టర్నితీసుకు వచ్చాడు. ఆయన ఇంజక్షన్ చేసిన తర్వాతగానీ తెలివి రాలేదు. అందునా నాకు కాళ్ళాడ లేదనుకో. కను రెప్పలు రెపరెపలాడిస్తూ అన్నది కాఫీ గ్లాసు కిందపెట్టి.

కరుణ కళ్ళలో మళ్ళీ నీళ్ళు పేరుకున్నాయి. "స్టవ్ దగ్గర కెందుకెళ్ళావమ్మా?" తల్లి చెయ్యి ఒళ్ళోకి తీసుకుంటూ అడిగింది.

శకుంతలమ్మ కూతురిపై ప్రేమ ఒంపుతూ చూసింది. బయట నలిగి నలిగి వస్తావు. కొంచెం కాఫీ నీళ్ళయినా పడేసి వుంచుదామని...అన్నది మెల్లగా.

జ్వర తీవ్రతని సైతం లక్ష్యపెట్టని మాతృత్వపు మమత అది.

కరుణ చెంపల వెంట కన్నీరు ధారగా ప్రవించింది. ఇంతకు రెట్టింపు శ్రమయినా పడగలను. నువ్వు లేకుండా మాత్రం బ్రతకలేనమ్మా. ఇంకెప్పుడూ నాగురించి ఇంత సాహాసం చెయ్యకు.

శకుంతలమ్మ కరుణ తలని దగ్గరగా లాక్కుని ఋష్కించిన తన చెంపల కానించుకుని కళ్ళు మూసుకున్నది.

"మీ వద్దకు చేరుకోవాలని నా మనసు ఆక్రోసిస్తున్నా మీ ప్రతి రూపమే నాకు ప్రతిబంధకమై నన్ను నిలిపేస్తోంది కృడ" ఏలోకాల్లోనో తన కోసం కనిపెట్టుకు నున్నభర్తనుద్దేసించి అనుకున్నది శకుంతలమ్మ.

ప్రొద్దుగూకేవేళ మందులు తీసుకొచ్చి ఇచ్చాడు సత్యమూర్తి.

"డబ్బు..." వెనక ముందాడింది కరుణ. అదిగుర్తించి "ఫరవాలేదు. మీ దగ్గర వున్నప్పుడే ఇవ్వండి" అన్నాడు.

మౌనంగా వుండిపోయింది కరుణ సత్యమూర్తి శకుంత లమ్మనుపరామర్శించి వెళ్ళిపోయాడు.

* * *

నెల రోజులు దొర్లాయి. కూరల సంచితో మార్కెట్ నించి వస్తోన్న కరుణకి తారసిల్లాడు సత్యమూర్తి ఆమెను చూస్తూనే సైకిల్ దిగాడు. "ఇటు తెండి" అని ఆ సంచీ అడిగి పుచ్చుకుని సైకిల్ కి తగిలించుకుని వెంటనడిచాడు.

ఎందుకో అతని చొరవ ఎబ్బెట్టనిపించలేదు. పైగా రిలీఫ్ గా, హాయిగా ఫీలయింది కరుణ. అంతరాంతరాలలో ఆమె మనస్సు ఇటు వంటి చేదోడు కోసమే ఎదురు చూస్తోం దెమో,

నెమ్మదిగా అతన్ననుసరించి నడుస్తోంది. అంతలో అత నికి ఇవ్వవలిసిన సొమ్ము మాట గుర్తువచ్చింది. నెల్లాళ్ళయిపో యింది. తల్లి కోలుకుని తిరుగుతోంది. అతడు తెచ్చియిచ్చిన మందులు కూడా అయిపోయి వారం దాటుతోంది. డబ్బు చెల్లగొట్టింది మాత్రం లేదు.

"మీకు డబ్బు ఇవ్వనేలేదు." అన్నది కరుణ అభిమా నంతో నొచ్చుకుంటూ.

సైకిల్ని పేవ్ మెంటు మీది కెక్కిస్తూ, "మిమ్మల్ని

ప్పుడు డబ్బివ్వమని ఎవరు నిలేసారు." కొంపతీసి అది అడిగే టందుకే ఆగి మీ వెంటొస్తున్నానను కుంటున్నారా ఏమిటి?" కంగారు నటిస్తూ నవ్వాడు సత్యమూర్తి.

నవ్వినప్పుడు సత్యమూర్తి బావుంటాడు. ఒక పక్క బుగ్గ పొంగించి నవ్వుతాడతను. ఆ బుగ్గమీద చిన్న చొట్టపడు తుందప్పుడు. అమాయకత్వంతో కూడిన చిలిపితనం కనిపిస్తుం దందులో.

నిర్మలంగా నవ్వుతోన్న అతన్ని అప్రయత్నంగా తలెత్తి చూసి సిగ్గుపడి కళ్ళు తిప్పుకున్నది కరుణ.

"అహా... లేదు-లేదు. కానీ మీరడక్కపోయినాతీర్చా లిసిన బాధ్యత నాదేకద." అన్నది తడబడుతూ.

"ఇవ్వండి వద్దనను, అప్పుగానే ఇచ్చాను గాబట్టి తప్ప కుండా తీసుకుంటాను. కానీ నన్ను కాబులీవాడి నకలు కింద జమకట్టి ఇంట్లో ఇబ్బందులు గడవక ముందే నా రుణం తీర్చే య్యాలని మాత్రం మధన పడకండి. మీకు వెసులు బాటు వున్నప్పుడే ఇద్దురుగాని తొందరలేదు."

కరుణ కతని అభయం స్వాంతన కలిగించింది. గతుకుల బాటపై ప్రయాణిస్తున్న తనకెవరో మెత్తని పాదరక్షలు బహు కరించినట్టనిపించింది.

అది మొదలు సత్యమూర్తికి కరుణ కుటుంబంతో

పూర్వం వున్న కొద్దిపాటి పరిచయ స్థాయి పెరిగి కరుణతో స్నేహం బలపడింది.

కరుణ ట్యూషన్లనించి తిరిగొచ్చేవేళా, సత్యమూర్తి ఆఫీసునించి వచ్చేవేళా సుమారుగా ఒకటే కావటంచేత అడపా తడపా ఇద్దరూ మధ్య త్రోవలో కలుసుకుంటూండేవాళ్ళు.

అతనితో మెల్లగా ముచ్చట్లాడుకుంటూ ఇంటి వరకూ నడిచిరావటం కరుణకెంతో ప్రియంగా అనిపిస్తోంది. ఇంత వరకూ చవిచూడని ఆనందానుభూతి ఏదో పొందుతోందిఅతని సమక్షంలో.

అలాగని తేనెలొలికే నయగారపు పలుకులేవీ వినిపించే వాడు కాదు సత్యమూర్తి. కానీ అతని మాటల్లో దాపరికం, కపటం లాంటివి మచ్చుకు వుండేవి కాదు, నిజాయితీ, నిశ్చయం తొణికిస లాడేవి. కొద్దిపాటి హాస్యరసం మిళాయించి ఎవర్నీ అతిగా కించపరచని ధోరణిలో ఛలోక్తులు విసురూతూ సాగేఅతని సంభాషణ యాంత్రిక జీవనంలో విసిగివేసారిన కరుణకిశ్రమని మరిపించే పన్నీటిజల్లయి చురుకుతనాన్నీ ఉత్సాహాన్నీ కలిగించేవి.

సత్యమూర్తి వంటరి వాడు. ఒక్కగానొక్క అక్కగారు దూరంగా మరో రాష్ట్రంలో ఉద్యోగం చేసుకుంటూ కాపురం దిద్దుకుంటోంది.

చిన్నతనంలోనే తల్లితండ్రుల్ని కోల్పోయి అనాధులుగా నిలబడిన వారిద్దరినీ గంపెడు బలగంలో ఏబంధువూ కనికరించి చేరదీయలేదు. దారిన పోయే తద్దినమా మా ఇంటికి రమ్మనీ ఈ తగలాటకం మాకెందుకు అనుకుంటూ ఎవరికివారే తప్పుకున్నారు.

సత్యమూర్తి అక్క సరస్వతి. అవిడకీ చిన్నతనమే... అయినా మంచి స్థైర్యం కలది. పున్న వూళ్లో తండ్రి పరపతినీ, అప్పటి తమ నిరాధార పరిస్థితినీ ఆధారంగా తీసుకుని ఆ వూర్లో నలుగురి పెద్దల దయా సంపాదించింది. తాను కాలు నిలదొక్కుకోగలగటమే కాకుండా తమ్ముణ్ణి కూడా ఒక మనిషిగా నిలబెట్టగలిగింది. సత్యమూర్తికో ఉద్యోగం దొరకి అతనికిని తన ఆసరా అవసరం లేదన్న భరోసా ఏర్పడ్డ తరవాత, ఈ మధ్యనే ఆమె పెళ్ళిచేసుకుని స్థిరపడింది.

ఆ కారణంగా అక్కగారంటేనేకాక ఆమెలా ఆత్మవిశ్వాసంతో స్వశక్తిమీద జీవించే ఆడవాళ్లెవరైనా సరే అమితమైన గౌరవం సత్యమూర్తికి.

ఆ మన్నన భావంతోనే కరుణకి సాయపడినా రానురానూ ఆమె చెలిమి అతని హృదయంలో సున్నితమైన తంత్రులను సుతిమెత్తగా మీటింది. కొంగ్రొత్త మధురమైన స్పందనలు రేకెత్తించింది. కరుణ రూపం అతని హృదయమంతటా ఆక్రమించుకు కూచుంది.

వారిరువురూ తమ గుండెల్లో ఉబుకుతోన్న అనురాగాన్ని పెదవి విప్పి ఒకరి కొకరు ఇంకా ఎరిగించుకోలేదు- లోకులుమాత్రం వారిద్దరూ పరస్పరాకర్షణలో పడ్డ విషయం గ్రహించేశారు.

ఈ లోకులకి తమకి సంబంధించని విషయాలపట్ల ఆసక్తి జాస్తి. ఇతరుల రహస్యాలను వెలికిలాగి రచ్చకీడ్చి ఆనందించడమనేది వారికో హాబీ. నాకెందుకు లెమ్మని వూరుకోవడం బొత్తిగా చేతకానిపని. కనిపెట్టిన అంశాన్ని బట్టబయలుగానో అన్యాపదేశగానో కక్కివేయ్యటం లోకసహజం.

విడిగా అగపడిన సత్యమూర్తిని పట్టుకుని, "ఏం...మీ గర్ల్ ఫ్రెండు తోడు రాలేదా ఈ రోజు?" అంటూ వెటకారంగా వ్యంగ్యోక్తి విసిరాడొక సహోద్యోగి ఒక రోజున.

తెల్లబోయాడు సత్యమూర్తి.

ఇలాంటి అనుభవమే కరుణకు అయింది.

"మొత్తానికి ఘటికురాలివి సుమా! పైసా కట్నం ఇవ్వక్కరలేకుండా నిక్షేపంలాంటి వరుణ్ణి బుట్టలో వేసుకున్నావ్." హేళనో, హాస్యమో తెలీనీకుండా మెల మాడింది పక్క వాటా రమణి.

రెండురోజులు సత్యమూర్తి కంటికి కనిపించకుండా

తప్పించుకు తిరిగింది. ప్రత్యేకించి అతనికోసమే మెయినురోడ్డు మీదుగా ఇంటికి తిరిగి వచ్చే కరుణ కావాలని పక్కసందులు గుండా రాసాగింది.

మూడోరోజు తను సంగీతం నేర్చే అమ్మాయి ఇంటి ముందు తారట్లాడుతూ కనిపించాడు సత్యమూర్తి.

క్షణం విసుగ్గా అనిపించింది కరుణకి. కానీ ఆ చిరాకు ఎంతసేపో నిలవలేదు. తనకోసం అతను ఎంతసేపటినించీ ఇక్కడ ఎదురు తెన్నులు చూస్తున్నాడో?" అనిపించి మనసు వెన్నలా మెత్తబడింది.

తన హృదిలో తిష్టవేసిన ప్రియమైన వ్యక్తి తనకోసం పడిగాపులు పడటం ఎంత తృప్తినిస్తుంది!

చిర్లింపుతో ముకుళించుకున్న మొహం విప్పారుకోంటే తన మనోభావం అంతు పట్టనీకుండా తల తిప్పుకున్నది కరుణ.

"ఇక్కడి కెందుకు వచ్చావు?" తిరస్కారాన్ని బలవంతాన స్వరంలో చొప్పిస్తూ అన్నది.

"నీతో మాట్లాడాలి కరుణా! అలా పార్కువైపు వెడదాం పద." ఆమె సమ్మతికోసం ఆగకుండా దారితీశాడు సత్యమూర్తి.

అనుసరించటం తప్పనిసరయింది కరుణకి.

గుబురుగా పెరిగిన క్రోటన్ మొక్కలచాటున ఒత్తుగా వున్న పచ్చగడ్డిలో కూర్చున్నా రిద్దరూ.

అతడు మాట్లాడదలుచుకున్న దేమిటో సుమారుగా ఊహిస్తోంది కరుణ.

"ఎవరెలా అనుకుంటే మనకేం! మన చెలిమి యథా ప్రకారం కొనసాగిద్దాం." అంటాడా! "నిన్ను చూడందే, మాట్లాడందే నిలువలేక పోయాను." అని ప్రేమ డైలాగ్ అప్పగిస్తాడా? కొంపదీసి, ఇలాగే చాటుమాటుగా కలుసు కుంటూవుందాం. అని పిరికితనం ప్రదర్శిస్తాడా?

ఉహూ - వీటన్నిటినీ కాదంటోంది మనసు. మరేదో వున్నదంటోంది. మరిదేన్నో ఆశిలషిస్తోంది.

తలవంచుకుని గడ్డిపోచలు తుంపుతూ మౌనంగా వుండి పోయింది కరుణ.

"కరుణా, మనగురించందరూ ఏమనుకుంటున్నదీ నువ్వు విని వుంటావు. అందుకే నాకు మొహం తప్పిస్తున్నావు అవునా?" కరుణ వంక క్రీగంట చూస్తూ అడిగాడు సత్య మూర్తి.

కరుణ మౌనంగానే బుర్ర వూగించింది. "లోకులు నోళ్ళలో పడట మంత మంచిది కాదు." అతి మెల్లగాఅన్నది.

"కానీ వాళ్ళ దృష్టిలో పడనే పడ్డాం కరుణా! ఇప్పుడు

ఎడమెడంగా తిరిగినంత మాత్రాన మనని వాళ్ళు మరిచిపోరు. మనగతాన్ని గురించి దుష్ప్రచారం మానరు. మానని వాళ్ళ కోసం మనం మాత్రం ఎందుకు మాగిపోవాలి?"

చురుక్కున చూసింది కరుణ.

"అందుకని వాళ్ళ సూటీ పోటీ మాటలు వింటూ మామూలుగా మనులుదాం అంటారా? అదినావల్ల కాదు. నేను బ్రతకాల్సిందివాళ్ళ మ్యదనే.

"అహా-అదికాదు-" సత్యమూర్తి తడబడ్డాడు. నేను చెప్పేది పరిష్కారం అదికాదు అని."

"మరేమిటన్నట్లు చూసింది కరుణ.

"మనం పెళ్ళిచేసుకుందాం కరుణా వాళ్ళ నోళ్ళుమూసే సాధనం అది ఒక్కటే."

కరుణ అతన్నించి ఆశించినది ఆ ప్రతిపాదనకే. కానీ అంతగా కోరుకున్నది ఫలించిన ఆసమయంలో అనుకున్నంత సంతోషం కలగటంలేదెందుకనో, ఏదో అసంతృప్తి... వెలికి గుంజాటన.

తల వాల్చుకుని వుండిపోయిన కరుణని చూస్తూ మంద్ర స్వరంలో అన్నాడు సత్యమూర్తి.

"నిజానికి మనని గురించి వాగిన వాళ్ళందరికీ నేనుకృత

జ్ఞతలు చెప్పుకోవాలి కరుణా. ఎందుకో తెలుసా? నీకిలా నా ప్రేమను నివేదించుకోవాలనీ, నా సహచరిగా నా జీవితంలోకి ఆహ్వానించాలనీ ఎన్నాళ్ళనించో ప్రయత్నం. నా జంకు. బిడియం వదుల్చుకుని నామనసులోని మాట నీకు ధైర్యంగా వినిపించే అవకాశం కల్పించింది వాళ్ళే.

నా హృదయం నీముందు విప్పాను కరుణా. నా తలపు నీలో కూడా సున్నితమయిన తంత్రుల్ని మీటగలిగితేనే నాతోడి మనుగడ నీకు సుఖాన్నిస్తుందని నమ్మకం కలిగితేనే నేనన్న దానికి అంగీకరించు కరుణా బలవంతం లేదు.

మన్ని పరిహాసించే వాళ్ళనించి తప్పించుకోవాలంటే అనేక మార్గాలున్నాయ్. మనం పెళ్ళి చేసుకో నక్కరలేదు.

సత్యమూర్తి మాటల్లోని సిన్సియారిటీ కరుణ శంశయం తొలగిపోయింది.

"ఏమంటావ్ కరుణా?" సత్యమూర్తి అతృతకి మెత్తగా నవ్వి మా అమ్మనీ మీ అక్కగారినీ కూడా సంప్రదించండి." అన్నది లేచిపోతూ.

"ముందు నువ్విచే గ్రీన్ సిగ్నల్ అందుకోని గదా మిగతా తతంగమంతా..." చిలిపి నవ్వులు నవ్వుతూ తనూ లేచి నిలబడ్డాడు సత్యమూర్తి.

ఇన్నాళ్ళ తమ మైత్రి విడదీయరాని అనుబంధ గా

ముడిపడబోతోంది. వారి హృదయాలలో వెన్నెల వెల్లివిరి సింది. అది వారి కనులలో ప్రతిఫలించింది. అధారల పై చిరు నవ్వుల పువ్వులు పుష్పించింది.

మదిలో రేగే కోరికల గుబాళింపుకు పూచిన నైట్ క్వీన్ నేత్రవులు తోడయ్యాయి. చిరుగాలికి తలలూపుతూ మొక్కలన్నీ వారి ఆనందంలో పాలుపంచుచున్నాయి.

పార్కు అంతటా గప్పున లైట్లు వెలిగాయి. ఆ వెలుతుర్లో ఒకరి కన్నుల లో వెలిగే కాంతులు మరొకరు పోగుచేసుకుంటూ నవ్వు కున్నారు తియ్యగా.

ఏదో సాధించినట్టు గర్వంగా సత్యమూర్తి నడుస్తూంటే అప్పుడే నాగవల్లిలో ఏడడుగులు వేస్తున్నట్టు అతని సరసనే కదిలింది కరుణ.

* * *

వివాహానికిముహూర్తం నిర్ణయమైంది.

సత్యమూర్తి అక్క తమ్ముడు ఒక ఇంటి వాడవు తున్నందుకు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ ఉత్తరం రాసింది. పెళ్ళికి ఓవారం రోజులు ముందుగా వస్తానని.

ఇక శకుంతలమ్మ ను పట్టపగ్గాలు లేవు. ఆవిడ అనారో

గ్యం ఏగాలికి ఎగిరిపోయిందో తెలీదు కర్త వున్నప్పటి చురుకు తనంతో తిరుగుతోంది.

బీదింటి పెళ్ళికి ఆర్భాటమేముంటుందని హడావిడిగా చేయాలిసిన పనులేముంటాయి గనక. శుభముహూర్తం ట్టుముకి పురోహితుడు ఆమూడు ముళ్ళు వేస్తాడు. ఆలోగిట్లో వున్న నాలుగిళ్ళ వాళ్ళు అక్షింతలు వేస్తారు అంతే.

అంతే అయినా ఓఆకూ వక్కనీ-పువ్వూ పండనీ కొనక తప్పదు కదా-దానికి మాత్రం డబ్బేది? ఎవరి కాళ్ళు పట్టుకో నటమా అని శకుంతలమ్మ తల్లడిల్లిందులవుతోంది.

కరుణ లేని సమయం చూసి ఆవిడచేతిలో అయిదు వందరూపాయలుంచాడు సత్యమూర్తి "అన్యధా భావించకండి అంటూ.

అతనిఅభిమానానికి తబ్బిబ్బయింది శకుంతలమ్మ.గొంతు పూడిపోయి "బాబూ"అని మాత్రం అనగలిగింది.

చేతులు పట్టుకోబోతున్న ఆవిణ్ని వారించి "ఇకనుండి కరుణని నన్ను వేరుగా చూడకండి మీరు."అన్నాడు.

కళ్ళు చెమ్మగిల్లాయి శకుంతలమ్మకు.

"ఇంకో విషయమండీ..."ఆవిడ స్థితిచూసి మాట మార్చాడు సత్యమూర్తి.

భోజనాలెటూ పెట్టడం లేదు కనక ఆ రోజున తెలిసిన వాళ్ళందరికీ చిన్న పార్టీ ఇయ్యాలనుకుంటున్నాను.ఏమేం కావల్సి వుంటయో లిస్టు వ్రాసి ఇవ్వండి. తెస్తాను ఏం చేస్తారోఎలా చేస్తారో ఆ బాధ్యతంతా మీదే. ఏమంటారు?" అన్నాడు.

"అలాగే చేద్దం బాబూ" శకుంతలమ్మ సంతోషంగా అన్నది.

పెళ్ళికి వారం రోజుల వ్యవధి వుంది.

ఆ రోజున ఆఫీసుకు శెలవు పెట్టాడు సత్యమూర్తి బ్యాంకుకి వెళ్ళి కొంత డబ్బు డ్రాచేశాడు.

సత్యమూర్తికి కాఫీ తప్ప వేరే వ్యసనమంటూ లేదు.అవసరాలు కూడా చాలా పరిమితం. నెలకు సరిపడా హోటల్ టికెట్లు తీసుకుని, పై ఖర్చుకి వందరూపాయలు చేతిలో వుంచుకుని మిగతది బ్యాంకిలో వేస్తాడు. ఉద్యోగం వచ్చినప్పటినించీ అంతే ఇప్పుడతని ఎక్కౌంటులో చెప్పుకోదగిన మొత్తమే కూడుకుంది.

డ్రాచేసిన మొత్తం జేబులో వేసుకుని బజారుకు బయలుదేరాడు. దానితో కరుణకి చీరలూ నగలూ కొనాలని అతని సంకల్పం.

అతనికి తెలుసున్నంత వరకూ కరుణ నిరాలంకార సుందరి. మట్టిగాజులూ, వాయిల్ చీరా తప్ప మోజుపడి గిల్టు నగైనా తగిలించుకోగా చూడలేదు.

ఆమెకో పట్టుచీరా, చేతికో జత బంగారం గాజులూ మెడకు సన్నని గొలుసు కొని పెళ్ళినాడు బహూకరించాలనుకున్నాడు.

ముందు సెలక్షన్ కోసం కరుణను వెంటబెట్టుకు వెడదామనుకున్నాడు గానీ అంతలోనే మనసు మార్చుకున్నాడు అకస్మాత్తుగా అన్నీ పెళ్లినాడే చూపించి కరుణనిసంభ్రమంలో ముంచెత్తలనుకుని వంటరిగానే బయలుదేరాడు.

తీరా బట్టల షాపులో సేల్సుమన్ ఇంద్రధనస్సు ముక్కలు చేసి పోసినట్టు వన్నె వన్నెల చీర లెన్నిటినో విప్పి గుట్టలుగా ముందుంచే సరికి మతిపోయింది.

విడిగా చూస్తే దేనికదే నాణ్యతగా, అందంగా, దానికదే సాటి అన్పిస్తోంది. అదే చీర మిగత వాటితోటి పోల్చి చూస్తే వెలవెల పోతూ తీసికట్టుగా పేలవంగా కనిపిస్తోంది. ఇన్ని చీరల్లో ఒక్కటంటే ఒక్కటి ఎన్నుకోవటం అతని తరం కావటం లేదు.

అతనీ చీర కాదని ఆచీరా, ఆచీరకాదని ఈ చీర తిరగేస్తూ మరగేస్తూ తికమక పడుతోండగా, ఎవరో భుజం మీద చెయ్యివేసి మెల్లగా తడుతూ "హలో" అని పలకరించారు.

సత్యమూర్తి మొహంతిప్పి పక్కకు చూశాడు.ఎక్కడో

చూసిన మొహమే. కానీ పెద్దగా పరిచయం లేకనేమో ఎంతకీ స్ఫురణకి రావటం లేదు.

సత్యమూర్తి తన్ని పరిశీలనగా చూస్తూ "మీరు నన్నేన పిలిచారు?" అని సందేహం తీరక ప్రశ్నించాడు.

చిరునవ్వుతో అవునన్నట్టుగా తలవూపాడాయన.

"క్షమించండి మీ రెవరో..." తొట్రుపాటు పడ్డాడు సత్యమూర్తి.

"గిరీశం గార్నే ఎరగరటండె?" సత్యమూర్తి యొక్క జ్ఞాన శూన్యతకు చింతించాడు సేల్సుమన్.

గిరీశమంటే జగమెరిగిన జంగమయ్యే ఆ వూళ్లో ఆయ న్నెరగని వాళ్ళు అరుదే సేల్సుమెన్ జాలిపడ్డంలో అర్థంవుంది మరి.

అప్పటికి సత్యమూర్తికి గుర్తువచ్చింది. ఏదో మీటింగులో అధ్యక్షస్థానాన్ని అలంకరించిన గిరీశాన్ని దూరంనించి చూశా డెప్పుడో. ఆయన పేరు అడపాదడపా ఎవరెవరి నోటంటానో వింటూవుంటాడు కూడా. అంతటి పెద్దమనిషిముక్కు మొహం ఎరగని తనని పలకరించటమా? అని లోలోపల విస్మయ పడుతూ, పైకి మాత్రం అలవాటయిన ఫార్మాలిటీ పాటించి చేతులు జోడించి "మిమ్మల్ని కలుసుకోవటం నాకెంతో సం తోషం కలిగిస్తోంది" అన్నాడు వినయంగా.

గిరీశం అతని వందనాన్ని స్వీకరిస్తున్నట్టు తలవంకించి "మీకు అభ్యంతరం లేకపోతే ఇప్పుడు నాతో రాగలరా?" అని అడిగాడు.

"ఆయనకి తనతో అక్కరేమిటో?" సత్యమూర్తిలో ఆశ్చర్యంపరాకష్టనందుకుందిఎటూ ఈ చీరెలఎంపికతనచేతకాదని తేలిపోయింది.

లేచినిలబడి "పదండి" అన్నాడు సత్యమూర్తి.

షాపుముందర నిలబెట్టిన తనకారు దగ్గరకు హుందాగా నడిచాడు గిరీశం. ఫ్రంటు డోరు తెరిచి సత్యమూర్తిని ఆహ్వానిస్తున్నట్టు పక్కకి తొలిగాడు. అతనుఎక్కి కూర్చున్న తరవాత తను స్టీరింగు ముందుసీట్లో కూర్చుని కారు స్టార్టుచేశాడు.

సాధ్యమయినంత స్లోగా కారుని పోనిస్తూసంభాషణకు ప్రక్రమించాడు గిరీశం.

"మి పేరు సత్యమూర్తి కదూ?"

చిత్రం గిరీశం అంత ప్రముఖుణ్ణి తనుచూసినా పోల్చుకోలేకపోవటం ఒక విడ్డూరమయితే, తన లాంటి అనామకుణ్ణి పేరుతో సహా ఆయన గుర్తుంచుకోవటం అదోవిచిత్రం.

సత్యమూర్తి గిరీశాన్ని ఇంద్రజాలికుణ్ణి చూసినట్టు చూశాడు.

"అవునండి" అన్నాడు నమ్రతగా.

గిరీశమతని అబ్బురపాటుని కనిపెట్టినట్టు చిన్నగానవ్వి "మీరు కరుణని వివాహం చేసుకోబోతున్నట్టు విన్నానెండి." అన్నాడు.

దానితో చీకట్లో తడుముళ్ళాడే వాడికి రెడియమ్ స్విచ్ కనిపించినట్టు చిన్నలింక్ అందింది సత్యమూర్తికి. "ఓహో కరుణద్వారా తన్నెరుగునన్నమాట ఈయన పొడువు కథ విప్పినంత తెలికపడ్డాడు సత్యమూర్తి. బహుశా కరుణ తండ్రి వైపు చుట్టమో, లేక బాగా పరిచయమో వుండి వుంటుంది అని ఊహించాడు.

గతంలో తమతమ అనుభవాలని బట్టి బంధువులంటే తనకి తిరస్కారం కరుణకి అలక్ష్యమూ ఏర్పడ్డాయి. అంచేతే గిరీశం గాలి ప్రసక్తి తమ మధ్యకెప్పుడూ తీసుకుపోలేదు కాబోలు కరుణ" అనుకున్నాడు.

స్వంత కారున్నంత ఐశ్వర్యఘనతా, అయన్నెరుగని వారు లేరనిపించేటంత కీర్తి వ్యాప్యతా, తనబోటి సామాన్యుణ్ణి సయితం నిగర్వంగా పలుకరించే నిష్కాపట్యమూ గిరీశం పట్ల సత్యమూర్తికి భక్తి గౌరవం జనింప చేశాయి.

గిరీశాన్ని వివాహ ఆహ్వానితుల లిస్టులో వెనువెంటనే చేర్చేశాడు మనసులో.

"నిజమేనండీ ఈనెల పదిహేనున మేరేజి చేసుకుంటు

న్నాం. మేమిప్పుడుంటున్న ఇంటి దగ్గరే జరుగుతుంది.” బిడియంతో కూడిన చిరుదరహాసం చేశాడు సత్యమూర్తి.

వెనక్కి పరిగెత్తే షాపుల్నీ, హోటళ్ళనీ, భవనాలనీ జనాన్నీ తాపీగా పరికిస్తూ, గిరీశం మొహం బిగదీసుకోవటాన్ని గమనించలేదతను.

గిరీశం తనని ఎందుకు ఆహ్వానించాడో తెలుసుకోవాలని చాలా కుతూహలంగా వున్నదతనికి. కానీ గిరీశం మౌనం వహించాడు. తప్పనిసరిగా తనలో తనే కారణాలు అన్వేషిస్తూ సతమతమవుతూ వుండగా కారు గిరీశం భవంతి చేరింది.

అధునాతనాసికి ప్రతిబింబంలా వున్న డ్రాయింగ్ రూములో సత్యమూర్తిని కూర్చోబెట్టి చల్లని పానీయాన్ని అతనికందించి తను సిగరెట్ అంటించుకున్నాడు గిరీశం.

ఇలా వృధ కాలయాపన అయ్యేకొద్దీ సత్యమూర్తి ఆత్రుత గాలివూదే కొద్దీ రబ్బరు బెలూను పెరిగినట్లు అంతకంతకూ అధికమవుతోంది.

గిరీశానికి జాప్యంచేసే ఉద్దేశ్యమేమీ లేదు.

సిగరెట్ మసి యాష్ట్రేలో దులుపుతూ “కరుణ నా గురించి మీకేమీ చెప్పుండదు” అని ప్రారంభించి.” మీరుకూడా అమె లోగడ చరిత్రజోలికి పోయుండరనుకుంటాను”అన్నాడు సత్యమూర్తిని కళ్ళచివరల నించీ పరీక్షించి చూస్తు.

"ఇదేమిటిలా ఎత్తుకున్నాడూ-?" సత్యమూర్తి కంగు తిన్నాడు. ఈ ఉపోద్ఘాతం ఏ ప్రస్తావనకు నాందో అర్థం కాలేదు. తాగేతాగే షర్బత్ పెదాల దగ్గరే నిలిపి నిశ్చయం కాని అనుమానంతో చూశాడు గిరీశాన్ని.

"కరుణ పూర్వంలో వంటలక్క వంశీయురాలనీ, మంచి సాంప్రదాయం లేనిదనీ చెప్పి తన మనసు విరచాలనుకుంటు న్నాడా ఈయన? కరుణకి హితాభిలాషి అని భావించాడు కాని చెడుకోరే శత్రువనుకోలేదు. కాకపోతే వారం రోజుల్లో వివాహమాడుబోతున్న కరుణ గత చరిత్ర గురించి ఇంటికి పిలిచి మరీ తనని తరచి అడిగే అగత్యమేమిటీతనకి.

గిరీశం మీద కలిగిన గౌరవం కొంత తగ్గింది సత్య మూర్తికి.

"అన్నీ తెలుసునండి. పొట్ట తిప్పల కోసం గుణాన్నీ శీలాన్నీ తప్పుడు త్రోవతొక్కించని ఏ వృత్తిని చేపట్టినా అదినా దృష్టిలో గౌరవనీయమైనదే. కరుణ రెండు తరాల క్రిందట పెద్దలు వంట పుట్టి వారవటం నా ప్రతిష్టకి చిన్నతనం తెస్తుందనుకునేటంత సంకుచితుడిని కాను." గిరీశం ఎత్తుగడ తను బంధాన్ని చీలదీయటమే అయితే ఈసమాధానంతో అతని నోరు మరి ఎత్తకుండా మూతపడుతుందనుకున్నాడు సత్యమూర్తి.

గిరీశం అతని దూకుడు చూసి జంకలేదు. పైగా అరటి

పండు వలిచి అరిచేతిలో పెట్టినా తినలేక దిక్కులు చూసే వెర్రిబాగుల వాణ్ని చూసినట్టు సానుభూతిగా చూశాడు.

"మీరు పొరబడుతున్నారు. నేనన్నది కరుణ పెద్దం మాట కాదు. శాఖాత్తూ ఆమె భూతకాల కళంకాన్ని గురించే అన్నాడు ఒక్కమాట ఒత్తి పలుకుతూ.

త్రాగుతోన్న ద్రాక్షరసం క్షణంలో చేదుగా మారినట్టు నిపించింది. సత్యమూర్తి ముహం అతని ప్రమేయం లేకుండానే ఎర్రబడింది.

మీరు చెప్పదలుచుకున్నదేమిటో సూటిగా చెప్పండి. దయచేసి కటువుగా అడిగాడు. గ్లాసు టక్కున స్టూలు మీద పెడుతూ.

మిమ్మల్ని నొప్పించటం నా అభిమతం కాదు. కానీ విషతుల్యమే అయినా నిజాన్ని తెలుసుకోవటం మీకు ఎంత యినా శ్రేయస్కరం అతని మేలు కోరకే చెబుతున్నట్టు మొహం పెట్టాడు గిరీశం.

"ఏమిటా నిజం?" సత్యమూర్తి అసహనంగా కదిలాడు.

"కరుణ ఒకానొక దుస్సమయాన కాలు జారింది. ఒకరితో దుర్నీతిన చరించింది. అది ఆమె..." ఇంకా ఏమో చెప్పబోతున్న గిరీశం మాటల్ని పూర్తి చెయ్యనీయలేదు సత్యమూర్తి. "అబద్ధం సర్వాబద్ధం!! నేను నమ్మను!!! కరుణ

మంచుబిందువంతటి స్వచ్ఛమయింది." అరిచినట్టే అంటూ దిగ్గున లేచినించున్నాడు.

గిరీశమతని భుజాల్నిపట్టి బలవంతాన కూర్చోబెడుతూ, "ఆవేశం వద్దు. సహనం తెచ్చుకోండి. అది అంతా ఆమెమీతో మైత్రి నెరపక క్రితం జరిగిపోయిన కథ. ఇప్పుడామె మీర న్నట్టు మంచు బొట్టంత విమ్మళంకమైనదే." అన్నాడు గాయం చేసి మందువేశాను పోతుందె లెమ్మని బుజ్జగించినట్టు గాయం మానినా మచ్చమాసిపోదనీ, కల్మషం కలిసిన నీరు క్రమేపీ తేరుకోవచ్చుగానీ, ఆనీరు నిర్మల జలమవదనీ గిరీశానికీ తెలుసు సత్యమూర్తికీ తెలుసు.

అయిష్టంగా కూలబడ్డాడు సత్యమూర్తి. అతని అంత రంగం యాసిడ్ పూసిన చందాన భగభగ మండిపోతున్నది. ప్రశాంత సరోవరంలో గులకరాయి విసిరినట్టు అల్లకల్లోల మయింది, నేను మోసపోయానా లేకపోతే ఈ గిరీశం నన్ను మోసపుచ్చుతున్నాడా? ఉహు... కరుణ అటువంటి దంటే నమ్మలేను. బహుశ కరుణకీ గిరీశానికీ బద్ధవైరమేదో వుండివుం డాలి. లేకపోతే నూరు అబద్ధలయినా ఆడి ఒక పెళ్ళి చెయ్య మని ఉద్బోధించే ఈ దేశంలో అన్యాయంగా నిష్కారణంగా ఒక ఆడపిల్ల జీవితంలో నిప్పులు చెరిగే పూనుకానికి తలపెట్టే వాళ్ళుంటారా?" నమ్మలేకపోతున్నాడు సత్యమూర్తి.

అతనికి కరుణమీద అపనమ్మకం కలగటంలేదు. అలాగని గిరీశం ఆరోపణ పూర్తిగా అసత్యమే అని కూడా కొట్టివేయలేకపోతున్నాడు. ఎటూనిర్ధారించుకోలేని సందిగ్ధావస్థలోపడిచివరికి అన్ని వివరాలూ గిరీశంద్వారనే రాబట్టాలన్ని గిరీశం కరుణపైన ఆపాదించిన అపవాదునిప్పువున్న పొగో, ఉనికిలేని పుకారో విచక్షణతో తేల్చుకోవాలనే స్థిరాభిప్రాయానికి వచ్చాడు. ఆవేశాన్ని అదుపులో పెట్టుకొని స్థిరంగా కూర్చున్నాడు.

అంతవరకూ తనునాటిన విషపువిత్తనం మొలకెత్తిందా లేదా అని సత్యమూర్తి ముఖకవళికల మార్పుల్ని పరిశీలించి చూస్తూ అంచనావేస్తున్న గిరీశం మరో సిగరెట్ ముట్టించి పొగ వదిలాడు.

ఒకసారి సత్యమూర్తి కేసి సానునయంగా చూసి, మీరు నమ్మలేకపోతున్నారు కదూ? అన్నాడు మృదువుగా.

సత్యమూర్తి కణతలు రుద్దుకున్నాడు. "ఔను. నమ్మశక్యం కావటంలేదు." అని నిముషం ఆగి "అసలు మీకు కరుణ ఎలా తెలుసు." అని ప్రశ్నించాడు.

"మా ఔట్ హౌస్‌లో కొన్నాళ్ళు కాపురమున్నారు లెండి." సిగరెట్ నుసి యాష్‌ట్రేలో దులుపుతూ చెప్పాడు గిరీశం.

సత్యమూర్తి కనురెప్పలు పైకెగిరాయి. "ఓహో... అలాగా! అప్పట్లో ఆమెకీ మీకూ పడేది కాదనుకుంటాను. అహా... తగాదా ఏమయిన పడ్డారేమో ననీ ... గిరిశాన్ని తేరిచూస్తూ అన్నాడు సత్యమూర్తి.

గిరిశం పొగవదుల్తూ చిరునవ్వునవ్వాడు. "మీ అభిమానం అర్థమయింది లెండి. అప్పట్లో మాకు ఏవో మనస్పర్థలు వచ్చి తగాయిదా పడివుంటా మనీ ఆ కచ్చతోనే మీకు ఆమె పైన చాడీలు చెబుతున్నాననీ భావిస్తున్నారు. అవునా?"

సత్యమూర్తి మౌనంగా వుండిపోయాడు.

గిరిశం పెద్దగా నిట్టూర్చి "నిజమే. మీరలా అపోహ పడ్డంలో అసహజం లేదు. పని కల్పించుకుని ఆమె మీద మీకు దురభిప్రాయం కలగజేస్తున్నందుకు నన్నపార్థం చేసుకుంటారనీ, రుజువు చెయ్యమని నన్ను నిగ్గదీయగలరనీ కూడా నాకు తెలుసు" అన్నాడు అన్నిటికీ సిద్ధపడినవాడిలా.

తను లోన అనుకుంటున్నదీ,అడగాలనుకున్నవీ గిరిశం చదువుతున్నట్టు ఏకరువు పెడుతున్నందుకు సత్యమూర్తి చకితుడయినట్టు చూశాడు.

"మీరు చాలా అనుభవజ్ఞులు. మిమ్మల్ని నిగ్గదీసేటంతటి వాణ్ని కాదుగానీ, మీరు స్వయంగా ఆమె పతనాన్ని ఎరుగుదురో, లేకపోతే గాలిగాపలుగాకు లెవరో వేసిన వదం

తులు వినిఆమెచెడిపోయిందనివూహిస్తునారో తెలుసుకోవాలను కుంటున్నమాట నిజమే” అని ఒప్పుకున్నాడు.

గిరీశం ఏదో చెప్పబోయి ఆగాడు. అస్థిమితంగా ఫీల వుతూ చటుక్కున కుర్చీలోంచి లేచి పచార్లు చేయసాగాడు.

అతని అడుగుల జోరుతో సత్యమూర్తి గుండెల సవ్వడి జతగూడి పరుగులు పెట్టింది.

కొంతసేపటికి తనని తాను సంభాళించుకుని తిరిగి కుర్చీలో కూర్చుని గొంతు సవరించుకున్నాడు గిరీశం.

“ఏం చెప్పమంటారు సత్యమూర్తి గారూ. అతను నాకు చాలా కావాల్సినవాడు... పేర్లైదెతేనేం ... నాకు ఆప్తుడు. చాలా మంచివాడు కూడా. కరుణని మనసావాచ కూడా గృహిణిగా స్వీకరించాలని ఆశపడ్డాడు. ఆమెకూడా అందుకు ఒడబడినట్టే ప్రవర్తించింది. కాబోయే దంపతులు శారీరకంగా దగ్గర అయ్యారు. అది నాకేమంత తప్పనిపించ లేదు. కానీ ఈ సంగతి నాకూ వాళ్ళకీ మాత్రమే తెలిసిన రహస్యం. వున్నట్టుండి కరుణ మారిపోయింది. అతన్ని నిరాక రించింది. ఇక్కణ్ణించి అదృశ్యమయి అక్కడ వెలిసింది. మిమ్మల్ని పూజారిని చేసుకుంది. రేపు మీ ఇలవేల్పాయి మీతల పైన నటించబోతోంది. ఇదీ నాకు తెలిసిన కథ. మీ వివా హామే జరిగితే కళ్ళు మూసుకు పాలుతాగుతున్న మీరు సుఖ

పడ వచ్చునేమోగానీ ఆమె మీదనే మనసుంచుకున్న మావాడి జీవితం దుర్భరమయి పోతుంది. అదీ నాబాధ." అని ముగించాడు.

చిత్తరువై విన్నాడు సత్యమూర్తి. వెలుపలికి చలించనట్టే వున్నా పోటెత్తిన సముద్రంలా ఎగిసి పడుతోంది అతని అంతరంగం. కర్తవ్యం తోచటంలేదు. మనస్సేమో ఊరంత మంచివాడూ మర్యాదస్తుడూ అని పొగిడే గిరీశం సాఖ్యం అంత తీసివేయ దగ్గది కాదని గోలచేస్తోంది. అంతటి మనక్లేశం లోనూ నిద్రించని వివేకం ఏకపక్షనిర్ణయం చెయ్యటం అన్యాయమని ఘోషపెడ్తోంది.

గిరీశం సిగరెట్ పొగతో సృష్టిస్తున్న మేఘాలు నెంపాదిగా వాసన మాత్రం మిగిల్చి కరిగిపోతున్నాయి.

"నేను మళ్ళీ తమని కలుసుకుంటాను." అని చెప్పి లేచి నిలబడ్డాడు.

సాగనంపుదామని గిరీశం లేచి గుమ్మం దగ్గరకు వచ్చేసరికే సత్యమూర్తి గేటు దాటాడు.

* * *

సంధ్య వాలటానికింకా కొంత పొద్దున్నది. చంద్రకాంతలు విచ్చి రాబోయే చంద్రునికొరకు కలలుకంటూ

ఎదురుచూస్తున్నాయి. పరచిన అరుణ కాంతుల్ని మూట గట్టుకుని డ్యూటీ దిగిపోయిన సూర్యుడు పడమటి కొండల వెనకాతలకి జారిపోబోతున్నాడు.

పెరటి చపటాలో కూర్చుని పిక్లి తిరగేస్తోంది కరుణ. అప్పుడు వచ్చాడు సత్యమూర్తి తీవ్ర సంఘర్షణ రాపిడితో అలిసి వాడిన అతని మొహం దివాలా తీసినట్టుగా వుంది. తప్పుడు లెక్కలు చూసి మోసపుచ్చిన వాటాదారుతో ఘర్షణ పడ్డానికి వచ్చినవాడిలా కఠినత్వాన్ని కక్కుతున్నాయతని కళ్ళు.

అతను ఎకాఎకిన తన దగ్గరకే రావటం చూసి కరుణ కాస్త సిగ్గుపడింది. "పదండి లోన కూర్చుందాం" తల వంచి మెల్లగా అంటూ లేచి నుంచుంది.

ఆమె సిగ్గుల మొగ్గలు ఏరుకునే పరిస్థితిలో లేడతను.

"నీతో అర్జంటుగా మాట్లాడాలి." విరిచినట్టు అన్నాడు సత్యమూర్తి కరుణ వెనకనే ఇంట్లోకి నడుస్తూ.

అతని కంఠంలో నిండిన గాంభీర్యాన్ని గమనించక, "మాట్లాడండి. మనల్ని విమర్శించే వాళ్ళెవరున్నారిక." అన్నది నవ్వుతూ కరుణ.

"ఇక్కడ కాదు కరుణా బయట కెక్కడికైనా వెడదాం"

అన్నాడు సత్యమూర్తి. ఆనాలుగుగోడల మధ్యనాకూర్చోవటం ఉక్కిరి బిక్కిగిగా వున్నదతనికి.

అప్పటికి కనుక్కొంది కరుణ. అతనిగొంతులోపూర్వపు మార్దవం లేదని మాట్లాడుకుండా తల్లికి చెప్పి వచ్చింది. జోళ్ళే సుకుంటూ,"పదండి."అన్నది బయటకు దారితీస్తూ.

ఎప్పుడూ ఎడతెరిపి లేకుండా కబుర్లు చెబుతూ నవ్విస్తుండే సత్యమూర్తి ఈరోజు మౌనవ్రతం పాటించినదుస్తున్నాడు.

బాధితుని పక్కన నడుస్తున్న కానిస్టేబుల్ లా అతను మూతి బిడాయించి తనపక్క నడవటం కరుణకి నచ్చలేదు. కాలి మాటల చాతుర్యంతో వాతావరణంలోవున్న ఉద్రిక్తతను తేలగొట్టే నైపుణ్యం ఆమెకు లేదు.

నిరాసక్తంగా అటూ ఇటూ పారజూసుకుంటూ మధ్య మధ్య ముభావంగా సాగిపోతున్న సత్యమూర్తి వంక చూస్తూ ఈవేళ ఇతని వైఖరి చిత్రంగా వుందేమి చెప్మా అని వింత పడుతూ అతని వెంట మూగగా నడిచింది కరుణ.

క్రమంగా పట్టణ పరిసరాలను దాటి వచ్చేసారు. అనతి దూరంలో అఫీసర్లు నివసించే బంగళాలు అత్తగారి పొత్తుగిట్టక వేరు కాపురం వెలిగిస్తున్న కొత్తకోడళ్ళలాదేనికదే ప్రత్యేకంగా తెల్లగా మెరుస్తున్నాయి. వెనక్కి తిరిగి చూస్తే పట్టణంలో

అప్పుడప్పుడే వెలిగిన దీపాలు మంటి చుక్కల్లో కొన్ని నేలరాలి పడ్డాయా అన్నట్టు మినుకు మినుకు మంటూ కన్పిస్తున్నాయి.

వంతెన గట్టుని ఆనుకుని నిలబడిపోయింది కరుణ. "ఇక నడవలేనంటే "అంటూ ఆగి, అప్పుడే నిద్రలేచినట్టు కళ్ళు విప్పార్చి చూశాడు సత్యమూర్తి. చుట్టూరా ఒకసారి కలయ చూశాడు. దూరాన నదిలో చాకళ్ళు ఇసుకలో ఆరవేసిన బట్టల్ని దులిపి మడతలు వేస్తున్నారు.

"సారీ చాలా దూరం నడిపించుకొచ్చాను."అన్నాడు పశ్చాత్తాపపడుతూ.

కరుణ సన్నగా "నవ్వి,ఫరవాలేదులెండి. మీరేదో పర ధ్యానంలో పడినట్టున్నారు."అన్నది.

పరధ్యానంలో కాదుఅంత కంటే విపత్తులోనే పడ్డాను అనుకుంటూ నిట్టూర్పు వదిలాడు సత్యమూర్తి. "గాఢంగా నమ్మిన వాళ్ళే వంచన చేసారని విన్నప్పుడు మనిషి దిమ్మెర పోవటం సహజం కరుణా."

అతని స్వరం లోని నిర్లిప్తతకు చలించింది కరుణ. "వంచనా?ఎవరికి...ఎవరు?"అన్నది కళవళపడుతూ.

సత్యమూర్తి కరుణ దెశ చూశాడు. ఇదంతా అమాయ కత్వమేనా? నటనా?

ఆకాశం రంగులు మార్చుకుంటున్న ఆలేత వెలుగులో

కరుణ మొహంలో మారేరంగుల్ని పరీక్షిస్తూ"ఈవేళ గిరీశం గార్ని కలుసుకున్నాను." అన్నాడు.

తుళ్ళి పడింది కరుణ. తను అడిగిన దానికది సమాధానం కాదు. పైగా అసందర్భంగాగిరీశం ప్రసక్తిఎత్తుకోవటం... ఆఎత్తుకోవటంలోనూఏదో వ్యంగ్యం, డొంకతిరుగుడూఉన్నట్టు స్ఫురించి తొలగిపోయాడనుకున్న గిరీశం మళ్ళీ ఏ అడ్డదారిన నాజీవితంలోకి ప్రవేశిస్తున్నాడు?అనుకున్నది కరుణ వ్యసనపడుతూ.

"గిరీశాన్నా?ఆ రాక్షసుడి కెలా తటస్థపడ్డారు మీరు?" అన్నది అనాలోచితంగా.

"రాక్షసుడా?" ఆశ్చర్యంగా చూశాడు సత్యమూర్తి.

"అతని రాక్షసత్వం నువ్వేం చూశావంటే ఏంచెప్పాలి" లోలోపల నాలుక కొరుక్కుంది కరుణ. అందుకే అంటారు పెద్దలు కాలుజారితే తీసుకోవచ్చుగానీ మాట జారితే తీసుకోలేమని. పూర్తిగా దాయటమిక అసంభవం.

"ఆ-రాక్షసుడే, అందరికీ అయన కీర్తిప్రతిష్టలతో ప్రకాశిస్తున్న ఆదర్శమూర్తే కావచ్చు నాకు మటుకు వాటి చాటున పొంచున్న కిరాతకుడు.

"అతను నీకు చేసిన అపకారమేమిటో?"

"ఇంతవరకూ లేకపోవచ్చు. కానీ ఇక ముందు చెయ్యడన్న భరోసా మాత్రం లేదు. అది సరే-ఆయన మీక్కనిపించి చేసిన నిర్వాకమేమిటి? నామీద ఏం చెప్పి పురెక్కించాడు మీకు?"

గతుక్కు మన్నాడు సత్యమూర్తి. "అన్నీ ముందే తెలిసినట్టడుగుతోందే?"

చూపు తప్పించి ఎటో చూస్తూ మెల్ల మెల్లగా గిరీశం కల్పించి చెప్పినవన్నీ పూసగుచ్చినట్టు వప్పగించాడు సత్యమూర్తి.

నిర్విణ్ణురాలయింది కరుణ. "ఓహ్...ఎంత బూటకపుకథ అల్లాడు దుర్మార్గుడూ" ఇంతకీ కొంపతీసి మీరా వారుకూతలన్నీ నమ్మలేదుకద?" అన్నది ఆత్రుతగా కళ్ళు వెడల్పుచేసి.

తటపటాయించాడు సత్యమూర్తి. ఆమె మీద అంత విశ్వాసమే వుంటే, ఇప్పుడు ఇంతదూరం తీసుకు వచ్చి ఇన్ని తబిసీళ్ళెందుకు పడతాడు, కానీ ఇప్పుడా మాట పైకనలేక పోతున్నాడు అదో దౌర్బల్యం.

"అబ్బెబ్బె..." అనినాన్చి నేను కాక ఇంకెనరయిన ఆయనప్రలాపాలువినుంటేతప్పకుండానీతో వెంటనే తెగతెంపులు

చేసుకునుండే వాళ్ళు, అంత నమ్మకంగా చెప్పాడాయన. అయినా ఆయనకెందుకు నీమీదంత ద్వేషం?"

కరుణ ఆలోచనలో పడింది. ఏమనిచెప్పటం? అతడు తన పై పగబూనిన పాముని చెప్పాలి. దానివెనకనే ఎందుకనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అప్పుడు వెనకటి గ్రంథమంతా విప్పక తప్పదు.

అతని వ్యాపారపు రంగులన్నీ బయటపెట్టాలి. అతని కుళ్ళిన శరీరం గురించి చెప్పాలి. అతడు చేసిన హత్యాకాండ కళ్ళారా చూసిన వయినం చెప్పాలి.

అయితే వర్దని కడపటి కోరిక మాటేమిటి?

అన్నీ తప్పించేసింది కరుణ.

"ఆయనగారి భార్య మరణించక క్రితం మేము వాళ్ళ ఇంట్లోనే వుండేవాళ్ళం లెండి. మహానుభావుడు. పెళ్ళాం శవ మటు గేటుదాటీదాటగానే ఇటు పెళ్ళికొడుకయిపోయాడా ప్రబుద్ధుడు. చేతివాటు దూరంలో వున్నాను గదా అని నాతో పెళ్ళి ప్రతిపాదనలు తీసుకు వచ్చాడు పాపం. నేను నిరాకరిం చాను.

అట్టే వయస్సు మీరిన వాడు కాదు. కట్టుకుపోయే టంత ఆస్తిమునిగిపోయేటంతముంగిలీ వున్నాయి. నిజమే. కాని చూస్తూచూస్తూకష్టాలని కావలించుకోవటానికి ఎలాఒప్పుకోను?

ముందుపెళ్ళాన్ని ఎంత వేపుకు తినేవాడో అమహాతల్లి ఇతనితో కాపురం చేసినప్పటికంటే పాడెక్కిన తరవాతే సుఖపడిందని నాకు తెలుసును.

ఆ తరవాత అతని కోర చూపుల్నించి తప్పుకుని జాగ్రత్త పడటం మంచిదని తోచి రాబందు గూడు లాంటి ఆ ఇంటి నించి మారిపోయాం. నాపిచ్చిగానీ గిరీశానిది సెర్చి చూపు నన్ను అప్పుడూ ఇప్పుడూ వెయ్యి కళ్ళతో కనిపెడు తూనే వున్నాడు.

ఆశచావక నాలో మార్పురాకపోతుందా అని ఎదురు చూస్తూ నా చుట్టూ ఉపగ్రహమల్లె తిరిగాడు చానాళ్ళు. నేను లొంగలేదు. ఒకసారి గట్టిగా వార్నింగిచ్చాను నా జోలికి రాకని విదిలించి కొట్టాను. దానితో తోకముడిచాడు. ఇక అతని బెడద తప్పిపోయిందనుకున్నానుగానీ ఎంతకీ లొంగని నామీద కావేషం పెంచుకుని విషం కక్కటానికి పొంచున్నాడని ఇదిగో ...ఇప్పుడే తెలుస్తోంది నాకు." నిట్టూర్చింది. కరుణ.

సత్యమూర్తి రెప్పలు తాటించటంకూడామరిచివిన్నాడు అపనమ్మకం వెలిబుచ్చడానికెక్కడా తావు కనబడలేదతనికి. మంచి తనం ముసుగు క్రింద ఇన్నికుతంత్రాలుంటవికాబోలు అనిపించింది.

మాటల్లో పడి వారు గమనించలేదు. గాని బాగా చీకటి పడిపోయింది. నక్షత్ర కాంతలతో సరససల్లాపాలుసాగించే ఉత్సాహంతో నిండు చందమామ తళతళలాడుతూ పైపైకి వస్తున్నాడు శృంగారించుకున్న చుక్కలతనిర్వాకతో మైమరిచి తమ అస్తిత్వాన్నే కోల్పోతున్నాయి.

ఇద్దరూ తిరుగుముఖం పట్టారు. కరుణె అందుకున్నది మళ్ళీ. ఎందుకు అడగలేదు మీరు ఆ నిక్షేపరాయుడెవరో చూపించమని? కనీసం పేరయినాచెప్పమని నిర్బంధించాలిసింది అప్పుడే అతని రంగు బంట్లసడేది.

నిజమే అనిపించింది సత్యమూర్తికి. ఔనుసుమా నాకు తోచనేలేదు. రేపేవెళ్ళి అడుగుతాను ఆ కథా నాయకుణ్ణి చూపించమని అన్నాడు.

కరుణ కంగారు పడింది. ఒద్దొద్దు. ఆ పని మాత్రం చెయ్యకండి. మళ్ళీ ఏదో నూరిపోసి పంపుతాడు. దుష్టులకి దూరంగా వుండాలన్నారు...పోనీండి అతని పాపాన అతనే పోతాడు. అన్నది నచ్చచెప్పడానికి తంటాలుపడుతూ.

ఇల్లు దగ్గరపడింది. సత్యమూర్తి మరి మాట్లాడలేదు.

రెండు రోజులు ఏ ప్రత్యేకతా లేకుండా గడిచిపో యాయి.

పైకి మామూలుగా వున్నట్టే అగుపడుతోన్నా కరుణ

గుండెల్లో గుబులు గుబులుగా వుంటోంది. ఓమూల ఏదో భయం సన్నగా కోతకోస్తోంది.

సత్యమూర్తి పనీ అంతే. అనుమాన మనేది ఎదలో ప్రవేశించనే కూడదు. ఎల్లాగో జొరబడిందా ఇక దాన్ని పారద్రోలాలన్నా పూర్తిగా అంతం చేయాలన్నా అది అంత సులభ సాధ్యమైన కార్యం కాదు.

అతన్ని పట్టుకున్న ఆపిశాచమతన్ని విషప్పురుగులా తొలిచేస్తోంది. తాడో పేడో తేల్చుకోకుండా ఈ త్రిశంకు స్వర్గంలో వేలాడ్డం ఎన్నాళ్ళు. అనుమాన నివృత్తి చేసుకోకుండా ఆమె నెలా చేపట్టడం? ఎల్లకాలం శంశయాకులిత చిత్తంతో ఆమె నెలా ఆదరించటం?

కాగల కార్యం గంధర్వులు తీర్చారు. ఆఫీసునుంచి సత్యమూర్తి ఇంటి కొస్తూంటే సడన్ బ్రేకువేసి కారాపిలోపలి కాహ్వానించాడు గిరీశం.

అర్జెంటుగా ఊరికెళ్ళాల్సిన ప్రయాణీకుడు కరెక్టుటైముకి వచ్చిన రైల్ని చూసి సంతోషించినట్టూ సత్యమూర్తి గబుక్కున కారెక్కి కూర్చున్నాడు.

స్టార్టు చెయ్యబోతూ "ఇంటికేగా?" అన్నాడు గిరీశం.

"ఇంటి కంత తొందర లేదు లెండి. ఎక్కడైనా వెడదాం కాసేపు.... అన్నాడు సత్యమూర్తి డోర్ వేస్తూ.

గిరీశం మొహం ప్రక్కకి తిప్పి సత్యమూర్తి వంక వింతగా చూశాడు. తిరిగే చూపు మరల్చి కారు ఫ్రంటు గ్లాసెస్ లోంచి కనిపిస్తోన్న రోడ్డుమీది జనం కేసి దృష్టి సారించాడు.

"ఎక్కడికో ఎందుకు. మాఇంటికే వెడదాం. ఎవరూ లేరక్కడ ప్రశాంతంగా వుంటుంది." తాపీగా అన్నాడు.

"మీఇష్టం." ముక్తసరిగా అన్నాడు సత్యమూర్తి.

"జనాన్ని చీల్చుకుంటూ పాదరసంలా మెత్తగా జారిపోయింది కారు.

వెళ్ళగానే నౌకర్ని పిలిచి రెండుకుర్చీలు లాన్ లో వేయించాడు గిరీశం.

వారి ఎదరగా వన్నెవన్నెల గులాబీలు విరగబూసి కంటికి ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. కన్నవారిని కాదని మనవిచ్చిన ప్రియుణ్ని చేపట్టిన సుందరాంగిలా గిన్నెమాలతి తీగ తనకోసం చేసిన పందిరిని వదిలి ఆపక్కంటే వున్న గున్నమావికి అల్లుకుపోయింది.

ఆకర్షించే ఆఅందాల్ని ఆస్వాదించలేక శూన్యాన్నవలోకిస్తున్న సత్యమూర్తిని చూసి "చూస్తే మీరు చాలా అఫ్ సెట్ అయినట్టున్నారు, అందుకు కారణ భూతుణ్ని నేనే అనుకుంటాను." అన్నాడు గిరీశం. తెగబాధపడి పోతున్నట్టు సానుభూతి ఉట్టిపడే చూపులతనివైపు బరిపిస్తూ.

పేలవంగా నవ్వి వూరుకున్నాడు సత్యమూర్తి

గిరీశమన్నది నిజమే. ఆలోచనలతో వేళకి భోజనం చెయ్యక, వేళ తప్పిన తిండి నోటికి సయించకా ఈ రెండు రోజుల్లోనే సత్యమూర్తి చెంపలు పీక్కుపోయాయి. ఆ ఆలోచనల మూలాన్నే రాత్రిళ్ళు నిద్రపట్టక, పట్టిన నిద్ర కలత నిద్ర అవటం వల్లా చురుకైన అతనికళ్ళు కళ నీలినీడలు ఆక్రమించుకున్నాయి.

తిరిగి గిరీశమే అన్నాడు. "అపాత్ర దానంచేసిన మీవంటి సున్నిత హృదయుల కిటువంటి గాయాలు తగలటం తప్పవి సరిలెండి.

"మీదయవల్ల ఓగండం తప్పించుకున్నాను. మొహం చూసి మనస్తత్వం అంచనా వెయ్యగలనని విర్రవీగేవాణ్ని. నాకీ అనుభవమొక గుణపాఠం. మా వివాహం పొసగదని రేపే కరుణకి చెప్పేద్దామనుకుంటున్నాను." అన్నాడు సత్యమూర్తి.

"అదీ తెలివైన పని." హర్షం వెలిబుచ్చాడు గిరీశం.

"అంతకుముందు ఇంకో పనికూడా చేద్దామనుకుంటున్నాను. మా బంధువన్నారు చూశారూ. అతన్ని నాకుచూపించండి, నేను వెంట బెట్టుకు వెడతాను. కరుణని నాలుగు చివాట్లువేసి ఆయనతో పెళ్ళికిపిప్పిస్తాను." ఈ దెబ్బతో కరుణె తన కన్ను కప్పిందో గిరీశమే దొంగనాటక మాడుతున్నాడో తెలి

పోతుంది. అనుకున్నాడు సత్యమూర్తి, అసలతను వచ్చింది అందుకే.

గిరీశానికి అర్థం అయింది-అతన్నింకా సంశయలేశం ఒదలలేదు.అని తాననుకున్నట్టు స్వల్పంలో అతని మనసుమారే లాలేదు. గట్టిచర్య తీసుకోక తప్పేటట్టులేదు. అయినా తుది ప్రయత్నంగా—,అబ్బే మీకా శ్రమ ఎందుకూ. మీరు తప్పు కున్నారని తెలుస్తే కరుణ తనంత తానే దేహీ అంటూమావా డిదగ్గరకు కాళ్ళ బేరానికి రాదూ!"అని అప్రస్తావన తోసి పుచ్చాలని చూశాడు.

కానీ అంత తేలిగ్గా తప్పుకుపోనివ్వలేదు సత్యమూర్తి. "అహాహ-అలాక్కాదు కలలు కన్న మావివాహకాండఎలాగూ భగ్నమయింది. కనీసం ఒకరి ఇల్లు నిలబెట్టానన్న మనశ్శాంతి అన్న దక్కనివ్వండి నాకు." అన్నాడుపట్టిన పట్టువిడవకుండా.

గిరీశందీర్ఘాలోచనలో పడ్డాడు

సత్యమూర్తి మళ్ళీ హెచ్చరించాడు"అతని దగ్గరకు వెడదాం పదండి." అంటూ.

గిరీశం స్థిర నిశ్చయానికి కొచ్చాడు ఎక్కడికీ వెళ్ళక్కరలేదు సత్యమూర్తిగారు. నేనే ఆదౌర్భాగ్యుణ్ని"అన్నాడు గంభీరంగా.

"మీరా?" నమ్మలేనట్టు ప్రశ్నించాడు సత్యమూర్తి.

వయసు ముమ్మరంలో యవ్వనపునిషా తోడుకాగా కరుణ కాలుజారిందేమో అనుకుందామన్నా, చెంపలు నెరిసి రక్తహీనతతో పాలిపోయినట్టగు పడుతోన్న ఈ విదురుడితోనా బంగారు శలాన లాంటి కరుణ శృంగారం నెరపేది? అసంభవం అంతకంటే కరుణ చెప్పిన దాన్లోనే ఔచిత్యం కనబడుతోంది. పువ్వు చుట్టూ భ్రమరం తిరుగుతుంది కానీ భ్రమరం చుట్టూరా పువ్వు తిరుగుతుందనటం సబబు కాదు మరి.

ఈ భావంతో గిరీశం విప్రయోగంతో ఏ మాత్రంగానో కరుణ పట్ల కలుషితమయిన అతని మనసు తిరిగి తులితం కాజొచ్చింది.

సత్యమూర్తి దృక్కుల్లో అభిశ్వాసం తొణికిసల్లాడ్డానికి కారణం గ్రాహ్యం చేసుకో లేని తెలివిహీనుడు కాదు గిరీశం.

పొంగులు వారే యవ్వనంలో జబర్దస్తీగా వున్న సత్యమూర్తి శరీరంలో ముటమి కాలూనిన చిహ్నాలతో నీరసగిస్తున్న తన శరీరాన్ని పోల్చిచూసుకుంటూ "నన్ను చూసి మోహించిందనటం లేదు. అదంతా డబ్బు మహాత్యం" అన్నాడు. పొర్లుకువస్తున్న ఉక్రోషాన్ని అదుపున పెడుతూ.

"ఉహూ అదీ సమ్మతేను. కాసుకి గడ్డకోరికే రకమయితే ఆ అందాలరాశి ఇప్పుడిలా అణా పరకకోసం తుడుముళ్ళాడే స్థితిలో వుండేది కాదు. ఏమాజీ జమీందారుఇలాకలోనో

వుండి వుండేది." అన్నాడు సత్యమూర్తి సందేహం విడని స్వరంతో.

గిరీశం కుపితుడై లేచాడు. లోపలికి వెళ్లాడు. రెండు నిముషాలలో తిరిగి వచ్చిన అతనిచేతిలో చిన్న కవరు వుంది.

ఆ కవర్ని సత్యమూర్తి ముందున్న స్టూలు మీదపడేసి "అవి తీసి చూసి ఇప్పుడు చెప్పండి... మీ కరుణ నంగనాచో నేను అసత్య ప్రలాపినో..." అన్నాడు మొహం గంటుపెట్టుకుని.

కుతూహలంగా తీసి చూశాడు సత్యమూర్తి. అవి ఫొటోలు దరిదాపూ వస్త్రవిహీనంగా ఉన్న కరుణ గిరీశంతో శృంగార ఘట్టాల్లో వుండగా తీసిన ఫొటోలవి.

అశుద్ధాన్ని తాకినట్టుగా ఒళ్ళు జలదరించి అట్టేజారవిడిచాడు సత్యమూర్తి. ఎంత అదుపు లేకపోతే మాత్రంఇంతచేటు విచ్చలవిడి తనమా? ఫొటో తీయించుకోటానికి ఇంతకంటే మంచి సన్నివేశమే దొరకదా? పరాయివాడు వచ్చి ఫొటో తీస్తూంటే సిగ్గయినలేకపోయింది గావును ఇద్దరికీ? వెలుపరంగా నుదురు చిట్లించుకున్నాడు సత్యమూర్తి.

"అవి మేము మనసు పడి తీయించుకున్నామనుకుంటున్నారేమో కొంపతీసి—" అన్నాడు గిరీశం సంకోచంగా.

"మరి?" చిట్లించిన నుదుటి ముడతలు విడలేదు సత్యమూర్తికి.

"వాటి చరిత్ర చెప్పాలంటే చాలావుంది. ముందు కూర్చోండి మీరు సావకాశంగా విందురుగాని.

సత్యమూర్తి అంతర్యం కాగి తెర్లుతోంది. ఇంక అక్కడ వుండాలనిగానీ, వుండి ముంజేతి కంకణంలా రుజువుతోసహితం కనిపిస్తున్నదానికి నిరూపణలు చెప్పించుకు వినాలనిగానీ అత నికి లేదు. కానీ గిరీశం బలవంత పెట్టటంతో తప్పనిసరిగా ముళ్ళమీద కూర్చున్నట్టు తిరిగి కూర్చున్నాడు.

గిరీశం గొంతు సవరించుకున్నాడు. చెప్పుకుంటే నగు బాటు అయినా మీకు చెప్పకోక తప్పదు.

నా భార్య పోయిన కొత్తలో నామీద సానుభూతి చూపే మిషమీద నాకు చాలా చేరిక అయిపోయింది కరుణ. ఎంత సన్నిహిత పడిందంటే కొన్నాళ్ళలోనే మేము భార్యా భర్తల మవాలనే నిర్ణయానికివచ్చేశాము. ఆవిడ మనస్సరీరాలు నా కర్పించిందనే నేను నమ్మాను అని అని దీర్ఘంగా నిట్టూర్చి తిరిగి తన కథనం కొనసాగించేడు గిరీశం.

ఉత్కంఠగా తలెత్తి వింటున్నాడు సత్యమూర్తి.

"వెంటనే కరుణని పెళ్ళిడ్డానికి వెనకాడేనునేను. ఈ లోకుల్ని పలుగాకులన్నారు చూడండి. పెళ్ళాం చచ్చిన పదో నాడు పెళ్ళికొడుకయ్యాడని నన్నెక్కడ ఆడిపోసుకుంటారో నని భయపడ్డాను.

అలా పెళ్ళి మరికొన్నాళ్ళకి వాయిదావేసి రోజులెక్క పెడుతున్నాం. ఆరోజుల్లోనే అప్పుడప్పుడూ ఎవరికీ తెలీకుండా ఎక్కడికైనా వెళ్ళి సరదాగా ఎంజాయ్ చేస్తుండే వాళ్ళం. మా వరకూ మేము ఎవరి కంటా పడకుండానే ప్రవర్తిస్తున్నామని భ్రమపడ్డాం. కానీ ఎవరో వెధవ మా రాకపోకల్ని పసిగట్టాడు మీ రిప్పుడు చూసిన ఫొటోలు ఆ దుష్టుడు తీసినవే.

"ఏం లాభమతనికి?" శంశయంగా సత్యమూర్తి ప్రశ్న

"లాభమేమిటని మెల్లగా అడుగుతారేం?బంగారప్పంట కదండీ నేను లక్షలకధికారిని. పరువు కోసం దేవుల్లాడేవాడిని. అవి బైటపడకుండా వుండటానికి వందలేమిటి వేలయినా వెద జల్లటానికి సిద్దపడతానని తెలుసును వాడ్శికి."

"బ్లాక్ మెయిలింగా?"

"అవునదే ఈ ఫొటోలు ఆయుధాలు చేసి నా పరువు తీస్తానని బెదిరిస్తున్నాడు వాడు, డబ్బు గుంజాలని చూస్తు న్నాడు."

గిరీశం చాకచక్యంగాఅల్లుతున్నకట్టుకధ సత్యమూర్తిని బాగానే ఆకర్షించింది.

"ఏం చేశారు మరి మీరు, పోలీసులకి అప్పగించక పోయారా?" అన్నాడు కుతూహలంగా.

గిరీశం వికవిక నవ్వి "మంచిపనే. వాడి గుట్టుతోపాటు

మా గుట్టూ వీధికెక్కుతుంది వాడికి శిక్షపడే మాట ఎటున్నా ముందస్తుగా లోకానికి మొహంచూపలేక నేనూ కరుణా ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చేది." అన్నాడు విషాద స్వరాన్ని హాస్యరసంతో మేళవించి.

"గట్టిసంకటమే. ఇంతకీ ఏమి ప్రతిక్రియ ఆలోచించారు?"

అదే నా ప్రయత్నం... నేనూ కరుణా ముందనుకున్నట్టుగా భార్యాభర్తల మయినట్టుయితే ఆ ఫొటోల్లోని అసభ్యత మాసిపోయి, అవి తప్పిదం కింద కాక మా అన్యోన్యత కింద జమ అయిపోతుంది ఏ ఎత్తూ వెయ్యకుండానే ఆ అప్రాచ్యుడి ఆటకట్టవుతుంది. ఇదొక్కటే నాకు తోచిన తరుణోపాయం. కానీ-ఇందుకు కరుణ ససేమిరా అంగీకరించటంలేదు. నిట్టూర్చాడు గిరీశం.

"అసలు మీ ఇద్దరి సయోధ్య ఎందుకు చెడినట్టు?"

"అదీ చెబుతాను. కరుణ చిన్న మడత పేచీవేసింది. నేను తనకన్న చాలా వయసు మీరిన వాణ్ణిని. రోగిష్టిమారి వాణ్ణిని ఏ ఘడియకైనా గుటుక్కుమని ఈ లోకంలో జండా పీకెయ్య వచ్చుననీ... తన భావి జాగ్రత్త కోసం పెళ్ళికి ముందే నా యావదాస్తీ తన పేర రాసెయ్యమంటుంది కరుణ.

నేనేమో చెప్పుకోగూడదు కానీ దానం ధర్మం అంటో

అడగవచ్చే వారితో చేతికి ఎముక లేదనిపించుకుంటున్న వాణ్ణి, పూర్తి ఆర్థిక స్వేచ్ఛ కోల్పోయి, భార్యే అగుగాక ...ప్రతి పైసకీ ఆమె ముందు చెయి జావనా...? నేను నిరాకరించానని అలిగి చెప్పాపెట్టకుండా మకాం మార్చేసింది కరుణ.

"అంతడబ్బు మనిషా కరుణ" వెగటుపుడుతోంది సత్యమూర్తికి

"నాకూ అప్పుడే తెలిసిందామె నిసలయిన స్వభావం. ఐనా ప్రాజ్ఞత తెలిసిన యువతి అందునా నాతో ఎంగిలి పడ్డ మనిషి కూడానూ ఎక్కడికి పోతుందిలే... ఆ ఆగ్రహమనే పూనకం దిగాక తానే వస్తుంది లెమ్మని తాత్సారం చేశాను.

ఆ అశ్రద్దే కొంప ముంచింది. కరుణ రాలేదు. ఏమా అని విచారిస్తే మీ ఆకర్షణలో పడినట్టు తెలిసింది. మొదట బాధపడ్డాను. కానీ ఓసారి బజార్లో మీ జంటని చూశాక అపురూప మయిన కలయిక, చక్కని జోడు అనిపించి ... పోనీ తనయినా సుఖపడనీ మని సంతోషించాను. ఏడుస్తున్న మనసును ఓదార్చుకున్నాను.

ఇంతలో పిట్టపిడుగుల్లా ఈఫోటోలొచ్చిపడ్డాయ్.కక్కలేను. మింగలేను, ఎటూ పాలుపోని పరిస్థితి.

మీ వివాహానికి సైంధవుల్లా అడ్డుతగలటం నాఅభిమతం కాదు. నేను అయితే కరుణ యొక్క నా యొక్క రహస్య

మయ జీవితాన్ని బ్రతుకు పర్యం తమూ గుప్తంగా గుండెల్లో పదిలపరుచుకునే వాణ్ణి. ఆమె భవిష్యత్ కాపాడే వాణ్ణి.

కానయితే అది పడక పడక పరాయికంట...అందునా ఓ తుచ్ఛుడి కంటపడ్డది. ఈ రోజు నన్ను దోచాలనుకుంటు న్నట్టే రేపు మీతో సంసారస్వర్గంలో ఓలలాడబోతున్న కరు ణనీ అడకత్తెరలో పెట్టి నొక్కవచ్చును.

అప్పుడు మీకన్న గప్ప లేక వాడి నోరుమూయలేక తాను ఎంత విషమ పరిస్థితికి బంది అయ్యేది నే చెప్పాలా? ఒక్క నాటి తో తీరిపోయే తగలాటకమా అది? ఎల్లకాలమూ జలగలా పీడించుకు తినగలడే వాడు...! చేతులు కాలేక అబో దిబో మని అఘోరించేకంటే, ముందే మేలుకుని మనసుని ఎలాగో రాజీ పరచి నాతో వివాహానికి అమోదించమని చిలక్కి చెప్పిన ట్టు చెప్పాను

అబ్బే ...కరుణ తన ఉడుం పట్టు వదలందే...! ఇక ఆమెతో మొత్తుకునీ నిష్ప్రయోజనమని, గత్యం తరం లేక మీకు నాగోడు విన్నవించు కున్నాను.ఇక పంచేసినామీదేభారం. అంటోముంగించి తను తేలిక పడిన సంగతి రెండు చేతులూ విదిలింపు ద్వారా వ్యక్త పరిచి విశ్రాంతి గా వెనక్కి వాలి పోయాడు గిరీశం.

గిరీశం దుష్ట వాంచిత్యం నెరవేరింది. మిధ్య అని తెలిసీ ఇహామనే మాయాజాలంలోపడి పోయేమానవుడిలా ఇంతవరకూ

ద్వైద్విభావంతో డోలికలూగిన సత్యమూర్తి మనసుగిరీశంపన్నిన పన్నాగం లో పడి పోయి అటు వైపే మొగ్గిపోయింది.

ఇందులో సత్యమూర్తి దోషం లేదు. నిదర్శనాలతోసహా కనిపిస్తున్న సమాచరాన్ని ఎవరు మటుకు కాదనగలరు?

వాన కురిసి వెలిసినా, ముసురు వదలని ఆకాశంలా సంఘర్షణ ముగిసినా సత్యమూర్తి మనసు నసిచెడి విషాదంగా విరక్తిగా వుంది.

ధన వ్యామోహానికిలోనై శీలభ్రష్టయైన ఒకస్త్రీకి అమిత విలువనివ్వటమే కాకుండా ఆమెను తన హృదయ పీఠాన్నధిష్టించ నిచ్చిన తన తొందరపాటుకు లోలోన తన్ని తాను నిందించు కున్నాడతను.

మెల్లమెల్లగా ఉదాసీనత స్థానే ద్వేషం, ఆవేశం, అస హనం క్రోధం రగులుకుంటోంది కరుణ మీద.

ఏ పాపమెరుగని అమాయకురాలినన్నది కరుణ. ఈ ఫొటో చూపిస్తే అప్పుడేమంటుందో? ఒక లిప్తపాటు ఆలో చించి బల్లమీదున్న ఫొటోలు తీసి జేబులో వేసుకుని వెళ్ళటా నికి లేచినిలబడ్డాడు సత్యమూర్తి.

గిరీశమింకా కళ్ళుమూసుకునితల వెనక్కి వేలాడేసి అదో రకంగా తపస్సమాధిలో ఉన్నాడు.

యధార్థాన్ని మరుగుపరిచి, అసత్యప్రచారంవిజృంభించి నట్లు ప్రకృతిని మింగేస్తూ చీకటి వికటాట్టహాసం చేస్తోంది.

"గిరీశం గారు!"

తలెత్తి చూశాడు గిరీశం.

"అయిందేమో అయింది. మా ఇద్దరి సంబంధమూ మునిగిపోయినట్టే, నేను సామాన్యుణ్ణి."

అఘ్రూణిత ప్రసూనాన్ని స్వీకరించేపాటి త్యాగగుణం లేదునాకు. ఇక నైనామీరు జాప్యం చేయక కరుణకి బదులు శకుంతలమ్మ గారిని కలుసుకోండి. సంగతి సందర్భాలు వింటే ఆవిడ కూతురికి తప్పకుండా బుద్ధి చెబుతుంది. చిక్కులన్నీ తీరి మీరయిన సుఖ పడాలనే నాఆకాంక్ష. మరి శెలవ్.సత్యమూర్తి కుర్చీ వెనక్కినెట్టి కదిలాడు.

చేతకాని వాణ్ణి జూదంలోఓడించి జేబు నింపుకున్నంత సంబరంగా వుందిగిరీశానికి. పిల్లవాడిచేతిలో మిఠాయిపొట్లాన్ని తన్నుకు పోయిన డేగలా సంతృప్తి పడ్డాడతను. పాచికపారిన మహోత్సాహంతో తనకు సహకరించినందుకుఅతనికి తనుజన్మ జన్మనా రుణపడి వుంటానంటూ కృతజ్ఞతలు గుప్పిస్తూ సత్యమూర్తిని గేటు వరకూ సాగనంపేడు గిరీశం.

సత్యమూర్తి అటు వెళ్ళాక ఫోటోలు దాచుదామని చూస్తే కవరు ఖాళీగా వుంది.

క్షణం కంగారు పడ్డాడు. సత్యమూర్తి తీసుకువెళ్ళేడ

నేది ఖాయమే. కానీ ఎందుకు తీసుకు వెళ్ళాడు? ఏంచేస్తాడు? అందరికీ చూపించి చాటింపు వెయ్యడు కదా? భయంతో కాళ్ళ కింద మంట వేసినట్టుగా అయింది గిరీశానికి.

అంతలో సత్యమూర్తి మేధకత్వం మనసున మెదిలింది. అతనటువంటివాడుకాదు. ఇతరులకు చేటుతెచ్చేబాపతుపనులు చెయ్యలేడు. బహుశ కరుణకో శకుంతలమ్మకో అవి చూపించి మర్యాద దక్కించుకోమని బోధించడానికి పట్టుకెళ్ళివుంటాడు. అని తెప్పరిల్లాడు.

అవి చూసి కరుణఏమనుకుంటుందో వాటిలోని కిటుకు కనిపెట్టేయ్యదు కదా? అబ్బే అంత నిదాన ముంటుందా అల్లాంటివి చూసినప్పుడు ముందువాటికి నిప్పంటించేస్తుంది. అంతవరకూ రూఢి. పోనియ్. చూడాలిసిన కళ్ళు చూసేశారు కదా!... చూద్దాం రాయి విసిరాం...తగుల్తుందా-అందదను కున్న పండు కాళ్ళ దగ్గర కొచ్చిపడుతుంది. లేమా నష్టమేమీ లేదు కదా! తనకు తనే ప్రశ్నలు వేసుకుని చెప్పుకున్నాడు గిరీశం.

*  *  *

సత్యమూర్తి సరాసరి కరుణ వద్దకే వెళ్ళాడు. వెళ్ళట మయితే అహల్యనురాయిగా మార్చాలని వెళ్ళేగౌతముడిలా

నిప్పులు కక్కుతూ ఉగ్రంగానే వెళ్ళేడు గానీ తీరా అక్కడికి వెళ్ళాక అస్త్రసన్యాసం చేసిన అర్జునిడులా చప్పగా చల్లారి పోయాడు.

రభస చేస్తే నాకేం జరుగుతుంది నాదారి నాదీ నీదారి నీదీ అని చెప్పి తప్పుకోవటమే నావంతు. తను అవలంభించిన పంథామూలాన్ని తానెంతయహీనమైన పరిణామాలు ఎదుర్కో వాలో మున్ముందు అనుభవం మీద తానే తెలుసుకొనీ అను కున్నాడు.

అతను వెళ్ళేసరికి టేబుల్ లైట్ దగ్గర కూర్చుని ఏదో రాస్తోంది కరుణ. సత్యమూర్తి వచ్చిన అలికిడికి తలెత్తి చూసి లేస్తూ,ఇంత ఆలస్యమయిందే ఈరోజు?నీకోసమే ఎదురు చూస్తు న్నాను. చూడండి ఈలిస్టు ఎవరినయినా మరచిపోయానేమో అంటూ రాస్తున్న కాగితాన్ని అతనికందించబోయింది.

సత్యమూర్తి అటు చూడలేదు. సూటిగా కరుణ కళ్ళ లోకి చూస్తూ "నన్ను ఏమార్చగలిగావు కానీ లోకాన్ని ఏ మార్చలేవు కరుణా నీపాపానికి సాక్ష్యాలివిగో"అంటూ జేబులో ఫోటోలు తీసి ఆమె ముందుకు విసిరి"మళ్ళీనాబోటి వాడి కెవ రికో వుచ్చులు వెయ్యక ఇకనైనాకళ్ళుతెరచి ఆ గిరీశంగార్ని పెళ్ళి చేసుకో. ఇంకా వెన్నబెట్టి ఆయన మనస్సుకూడా విర చుకోకు. అలాచేస్తే నాసానుభూతి కూడా మిగుల్చుకోలేవు." అన్నాడు.

ఎంతగా తమాయించుకుంటున్నా వికలం అయిన మనస్సులోని బాధ పరుష వాక్యరూపాన పెల్లుబికేలావుంది.ఇంకా అవునూ కాదూ అని ఆమెతో తర్కించటం ఇష్టమూ లేదు.అంచేత మరొక్క నిముషం అక్కడ నిలవక వెనుతిరిగి వెళ్ళిపోయాడు సత్యమూర్తి.

ఖిన్నురాలయి నిలబడిపోయింది కరుణ. సుషుప్తావస్థలో వున్నవాణ్ని అకస్మాత్తుగా లేపి కూర్చోబెట్టి చాచిలెంపకాయ కొట్టినట్టు ఉన్నదామె స్థితి. తన ముందున్నవేమిటో అతనంటున్నదేమిటో ఏమీ బోధపళ్ళేదు.

వారించే సందన్నా ఇవ్వకుండా దడదడ వడగళ్ళు కురిపించి అతని దారిన అతను వెళ్ళాక తేరుకుని ఒంగి చూసిందా ఫొటోల్ని.

వెంటనే మండ్రగబ్బల్ని చూసినట్టుగా రెండడుగులు వెనక్కి వేసింది. విద్యుత్ఘాతం తగిలిన దానిలా క్షణం దిమ్మెరపోయింది.

ఓహ్...ఏమిటిది? తను మేలుకునే వున్నదా? తనకళ్ళు చూపించేది వాస్తవాన్నేనా కరుణచేష్టలుడిగినిలబడింది.

కకావికల మవుతున్న మనస్థితిని కొంతసేపటికి స్వాధీనం చేసుకుని మరలా ఫోటోలని పరీక్షగా చూసింది.తలవరకూ తన రూపమే కానీ దిగువ భాగమంతా మరి ఒకరిది.ప్రావీణ్యం

గల ఫోటో గ్రాఫరెవరో తన వనితనం అంతా ప్రదర్శించాడు. చాలా సహజంగా వున్నాయవి వాళ్ళింట్లో కాపురం వున్నప్పుడు దొంగతనంగా ఎప్పుడో తీసి వుండాలి. తన ఫోటోల్ని! అది వుపయోగించే ఇప్పుడీ ఫోటోలు తయారు చేయించి వుండాలి.

ఓరి భగవాన్ ఇంత నేర్పరితనం, ఇన్ని తెలివి తేటలు ఒక అబల మీద కత్తి గట్టి అధోగతి పాలు చేసేటందుకా? ఇవి చూస్తుంటే నా పవిత్రత మీద నాకే అనుమానం కలుగుతోందే ఇదంతా గిరీశం కుతంత్రంలో భాగమేనని సత్యమూర్తిని ఎలా నమ్మించగలను. నా బ్రతుకు కేమి కాబోతోంది? భగవాన్ నాకేది దారి.?

కరుణ తనువెల్లా కంపించిపోయింది.

ఆ రాత్రి ఆమెను నిద్రాదేవత కరుణించలేదు. నిదుర దూరమై వేదన చేసువయింది. తరగనిదీ పరిష్కారం చూపించనవి ఆలోచనలు మనసు నిండా వ్యాపించాయి. రేపు అనేది అంధకార బంధురమై కనృట్టి భయపెట్టు జొచ్చింది.

ఆ క్రందకు కరగని కఠిన వాడి కసాయి గుండెలా ఘనీభవించి, అంతూదరి లేని కాల ప్రవాహంలా దీర్ఘమయి ఆ కాళరాత్రి ఆమెకు శాపమయి వేధించింది.

ఎలాగో రేయి గడిచింది. తెల్లవారింది. కరుణ లేచి తొందరగా కాలకృత్యాలు తీర్చుకున్నది. వాకిట్లోకి వచ్చి

చూస్తే సత్యమూర్తి వున్నట్టుగా అతని గది తలుపులు తెరచి వున్నాయి.

అతను రావటమే గానీ ఎప్పుడూ ఆ గదికి వెళ్ళలేదు కరుణ. తొలిసారిగా ఆనాడు ఆగదిలో అడుగు పెట్టింది.

వారూ వీరూ చూస్తారని సిగ్గుపడలేదు. ఎవరేమనుకుంటారో అని వెనక ముందాడలేదు, అతన్నెలాగో శాంతపరచటమే ఆమె ధ్యేయమిప్పుడు, ఫొటో గ్రఫీలోని అద్భుతల గురించి హెచ్చరించి ఆ ఫొటోల్లోని మర్మమేమిటో మంచి ఫొటో గ్రాఫర్నెవర్నైనా కలుసుకుని సాకల్యంగా గ్రహించమని కోరటం అప్పటి ఆమె లక్ష్యం. నిజానిజాలు ఎరక్కుండా తనని శంకించి తన తోటి సహవాసాన్ని త్యజించటం భావ్యం కాదని వేడుకోవటమే ఆమెచేయగల కార్యం.

కరుణని చూసి చేస్తున్న పనినిఆపి బట్టలు వేసుకోవటం ఆరంభించాడు సత్యమూర్తి.

"ఒకనాడతను తనకోసం నిరీక్షిస్తుంటే గర్వపడింది. ఈనాడు తన నీడనే భరించలేనట్టుగా పారిపోతున్నాడతను." గొంతునిండుగా దుఃఖం ముంచుకొచ్చింది కరుణకి.

అతడు చెప్పులు వేసుకుంటున్నాడు. వ్యవధి మించిపోతోంది. కరుణ రుద్ధమయిన కంఠాన్ని విప్పాలని ప్రయత్నించి విఫలురాలయి. జాళం చేతులోకి తీసుకుంటున్న సత్యమూర్తి చేతిమీద తన హస్తముంచి ఆపింది.

గాలికెగిరిపడ్డ తృణ కణాన్ని విదిలించినట్టు చిరాగ్గా విదిలించి తలెత్తాడు సత్యమూర్తి.

ఆమె ఏదో చెప్పబోయి పెదవులు కదిపింది.

అతడు అడ్డుపడ్డాడు. "నేనేమీ వినదలుచుకోలేదు కరుణా నీకు చెప్పాలిసిందేదో నిన్ననే చెప్పేశాను. కనీసం నీ స్మృతి అయినా నాలో కళంక రహితంగా వుండాలంటే నే చెప్పినట్టు చెయ్. అంతేగానీ ఇంకా నాకే బురిడీలు కొట్టాలని చూడకు తప్పుకో నే వెళ్ళాలి."

వెంటపడే అంటువ్యాధి ముషివాణ్ణి తప్పించుకునే విధంగా సత్యమూర్తి చరచరా వెళ్ళిపోయాడు.

రాత్రంతా ఆలోచించి ఆలోచించి చెప్పాలని కూడ గట్టుకున్నమాటలన్నీ క్షేముకట్టించు కోటానికి తప్ప ఉద్యోగాలకి పనికిరాకపోతున్న డిగ్రీ పత్రాల్లా కరుణ గుండెలో పలే వుండిపోయాయి.

ఆరోజు ట్యూషన్లకి వెళ్ళలేకపోయింది కరుణ. తల్లితో తల నెప్పి అనిచెప్పింది.

వద్దన్న కొద్దీ బలవంతాన నుదుటికి అమృతాంజనం పట్టి స్తున్న తల్లితో అంతా చెప్పేసి బావురు మనాలని ఎంతయినా అనిపించింది. కానీ అది ఏ విపరిణామాలకి దారితీస్తుందో అని వెరిచి నిగ్రహించుకున్నది.

ఆమె దసలే బీటబారిన హృదయం ఈ విఘాతానికి తట్టుకోలేక ఆటటి గుండె విచ్చిపోవచ్చు. తల్లిని గూడా పోగొట్టుకుని...ఇక ఆలోచించ లేక పోయింది కరుణ.

మళ్ళీ పొద్దు వాల్చింది. తాపత్రయాలు మరిచిజనులందరూ గాఢంగా నిద్రించే సమయం అయ్యింది.

పక్కకుదరక పొడారిన కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చుంది కరుణ. పక్కమంచం మీదశకుంతలమ్మ ఒళ్ళుమరచి నిద్రపోతోంది.

కరుణ సవ్వడి కాకుండా తలుపులు తెరిచి వెలుపలకు వచ్చి,ఎప్పటిలా తలుపుల్ని దగ్గిరగానొక్కింది.

బయట పుచ్చపువ్వులాంటి వెన్నెల చల్లగాకురుస్తోంది. వరండాస్తంభానికి చేర్లబడికూర్చుని చెక్కిలికిచెయ్యాన్చుకున్నది కరుణ.

"శిశిరం లాంటి తనబ్రతుకులో వసంతాగమనం కాబోతోందని రెక్కలారుస్తున్నపక్షిలా రెపరెపలాడింది. కానిఅల్లంత దూరానవుండి వూరించిన వసంతఋతువు కప్పదాటు వేసింది. సెగలూ పొగలూ చిమ్ముతూ గ్రీష్మం చోరబడబోతోంది". ఆమె కళ్ళ వెంబడి నీళ్ళు జల జల రాలి పడ్డాయి.

"ఒక పాప కృత్యం చూసిన ఫలితమా తనికీ శిక్ష? ఏ పాపమెరుగని,దానినీ విరబూయాలిసిన తరుణంలోవున్న తనజీవి

తాన్ని అపాపకలలు దహించి దగ్ధంచేసి వేస్తూంటే చేతులుకట్టే సినట్లు చూస్తూ వూరుకోవలిసిందేనా తానింకేమీ చేయలేదా?"

చప్పున లేచి నిలబడింది కరుణ ఫలితం ఏమయినప్పటికీ తన ప్రయత్నం తను చేసేతీరాలి.

గేటు తీసి వీధిలోకి అడుగుపెట్టింది కరుణ. గమ్యం నిర్దేశించ బడిన దానిలా నడవ సాగింది.

వూరకుక్కలు రెండు మొరుగుతూ దగ్గరకు రాబోయి ఆమె వెనుకంజ వేయకపోవటం చూసిఅవే దూరదూరంగా తొలగిపోయాయి.

కరుణ గిరీశం ఇల్లు చేరుకున్నది. తలుపులు మూసివున్న లోపల లైట్ వెలుగుతూనే వున్నది తట్టంగానే గిరీశమే తలుపులు తెరిచాడు. కరుణ హటాత్ ఆగమనానికి విస్తుపాటు నివ్వెరపోయినా అంతలోనే మూడ్ మార్చి నవ్వుతూ కళ్ళెగరేసి లోపలకి దారితీశాడు.

నిండా మునిగిన వాడికి చలేమిటన్నట్టు అతని వెనకనే లోపలికి వెళ్ళింది కరుణ.

"ఏం కరుణా దారితప్పినట్టున్నావే? ఎకసెక్కెంగా అన్నాడుగిరీశం సోఫాలో కూర్చోబోతూ. అతని ఆ తేపణలో ఎవరికోసమొస్తావ్ అన్నది లాసాపాలు కూడా వున్నది.

మరో సోఫా కొస పట్టుకు నుంచుంది కరుణ. "నేను దారి తప్పలేదు గిరీశంగారు తప్పను కూడా. మీరే మీకని కట్టు విద్యతో అలా భ్రమింప చేస్తున్నారందర్నీ."

విజయ గర్వంతో విర్రవీగుతూ చిద్విలాసంగానవ్వాడు గిరీశం. తెలిసిందిగదా నా ప్రతాపం అన్నట్టు.

పైకి నేనేం చేశానేం?అన్నాడు ఎరగనట్టు.

"ఏం చేశిందీ మీకు తెలీదా గిరీశంగారూ? నానోటితో చెప్పించాలా నేపుకొచ్చిన చెట్టుని కూలదీయ్యాలని నాగురించి మీరు సత్యమూర్తిగారి చెవిలో చేదు నూరి పొయ్యలేదా? ఆ మోతాదు చాల్లేదని ఆఫొటోలు...వాటిని సృష్టించిన వాణ్ణి వురి తీయాలి అవి చూపించి ఫలించ బోతున్న మా బాంధవ్యానికి వేళ్ళు నరకలేదా ఇంత కంటే ఏం చేయాలి? ఇప్పుడాయన నన్ను స్పర్శించిన గాలిని సైతం అసహ్యించుకుంటున్నారు. ఇది మీపుణ్యం కాదా?"అంతదూరాన్నించి ఏకాయెకిన నడిచిరావటం...ఆ అలుపుకు ఈ ఆవేశపు ఉరవడి తోడు కావటం,కరుణ నిలబడలేక రొప్పుతూ ముందుకు వచ్చి కూలబడి పోయింది.

జాలేసినట్టు "ప్చ్‌ప్చ్" అన్నాడు గిరీశం.

ఆ తరువాత తాపీగా సిగరెట్ వెలిగించుకున్నాడు.

అగ్గిపెట్టె గలగల లాడిస్తూ స్టూలు మీదకి గిరవాట్టేసి కాలు మీద కాలేసుకున్నాడు.

"చేతులారా చేసుకున్నావ్ కరుణా నన్ను ధిక్కరించి నిలబడటమెంత కష్టమో తెలుసుకున్నావు కదా...ఇప్పుడ యినా వింటావా నామాట? కొరడా ఝళిపింపులతో అంకెకు తెచ్చిన మృగాన్ని జూలు నిమిరి మంచి మాటలు చెబుతున్న ట్టున్నాడుగిరీశం.

కళ్ళ నీళ్ళతో దీనంగా చూసింది కరుణ. మీకిదిన్యాయ మేనా చెప్పండి. మనసులేని వారితో మనుగడ మీకుమాత్రం సౌఖ్యమా ?మిమ్మల్ని వేడుకుంటున్నాను గిరీశంగారూ మీ పిపాసకు నన్ను బలి పెట్టకండి.సత్యమూర్తిగారికినిజం చెప్పండి రాళ్ళు కరిగేలా వేడుకున్నది.

నెమలి కంటి నీరు వేటగాడికి వేడుక. కరుణ కన్నీళ్ళకి ఇసుమంతయినా తొణకలేదు గిరీశం.

తల అడ్డంగా తిప్పుతూ"అంటే అంటే అమృతాన్ని జుర్రుకోటానికే గానీ ఒలక బోసు కోవటానికి కాదు కరుణా ఇన్ని అగచాట్లు పడింది.అన్నాడు అగ్గిపెట్టి పై కెగరేసి పట్టు కుంటూ.

కరుణ తలెత్తి చూసింది. మీరు అబద్ధాలు చెప్పి, వంకర పనులు చేసినాజీవితంతో ఆటలాడుతున్నా చూస్తూ సహించే

నేగానీ, మీరహస్యాలన్నీ నాగుప్పిట్లో వున్న నేను మిమ్మల్ని బజార్న పెట్టానా? ఆఖరికి కన్నతల్లికిమనసిచ్చిన మారాజుకీ సైతం తెలీనీకుండా కంఠంలో దాచుకున్నానే ఆ ఉపకారాని కిదా ప్రతిఫలం? అన్నది.

కరుణ నిష్ఠూరంలో అతని బ డారం బయట వేసే అవ కాశం తనకున్నందున ధ్వని వినిపించి నకపక నవ్వాడుగిరీశం.

"నువ్వికబెదిరింపులకిదిగుతావనిఅనుకుంటూనేవున్నాను నా గురించి నీకేం తెలుసును కరుణా తెలిసి చెప్పినాఈవూళ్ళో ఏనుగు వంటి వాణ్ని నేను. వెనక మొరిగే కుక్కవంటి దానివి నీవు. నీమాట నమ్మేదెవరు?" అన్నాడు సవాలుగా.

"నోటి మాట నమ్మకపోతే కాగితం మీద రాతలే వున్నాయి. మరచిపోయారు గావును...అక్కరాసిన ఉత్తరం నాదగ్గరే వుండాలి. అదిచాలదూ మీరెలాంటివారో లోకానికి చాటడానికి?

గిరీశం మొహంలో దుష్టత్వంతోపాటు టక్కరితనం కొట్టొచ్చినట్టు కనిపించింది.

"ఎంత పిచ్చిదానివి కరుణా అది నీదగ్గరెక్కడుంది? ఆ ఉత్తరం వుందని నువ్వు చెప్పిన మర్నాడే మీయింటికివెళ్ళాను నువ్వా టైములో ఇంటి దగ్గర వుండవని నాకు తెలుసును.మా పుస్తకమొకటి నీ దగ్గర వుండాలని మీఅమ్మగారికి చెప్పినీ అల

మరంతా గాలించి సంపాదించినా కవరు అప్పుడే దాన్ని బుగ్గి పాలు చేసేశాను. ఇప్పుడు చెప్పు నువ్వు నన్నేం చెయ్యగలవో.

అప్రతిభురాలయింది కరుణ. సకలమార్గాలూ కట్టుపడిపోయిన నిస్సహాయతలో మొహాన్ని చేతుల్లో దాచుకుని గుండెలవిసేలా విలపించసాగింది.

గిరీశం జాలిపడ్డాడు. ఇప్పుడేమయిందనికరుణా అంతలా దుఃఖపడ్డం. నిన్నుసత్యమూర్తి కంటే అపురూపంగా చూసుకోనా లజ్జుగా బుజ్జగించబోయాడు.

తోక తొక్కిన త్రాచులా చివ్వున లేచింది కరుణ "నన్ను అడకత్తెరలో ఇరికించి చేత చిక్కించుకోవాలనుకుంటున్నావుగానీ నేను చస్తే నీకులోబడను. కన్యగానయినా కడ తేరిపోతాను గానీ ఆత్మను చంపుకుని నీభార్యనవటానికి బ్రతికుండగా ఒప్పను."

"ఈ బింక మెన్నాళ్ళో అదీ చూస్తానుగా." ధీమాగా అంటున్న గిరీశం మాటలు గుమ్మందాటుతోన్న కరుణ చెవిన పడి ఆమె పౌరుషాన్ని పట్టుదలనూ ఇమడింప చేసేయే కానీ తగ్గించలేదు.

ఇంటికి తిరిగి వచ్చింది కరుణ. చేరవేసిన తలుపులు తోసుకుని లోపలికి వెళ్ళి పడుకుంది. పక్క అప్పుడే వేసిన

శంకర రోడ్డులా గుచ్చుకుంటున్న అనుభూతి లోపల ఏదో బాధ పూడ్చలేని వెలితి ఏర్పడిన శూన్యం.

కొంతసేపు తన దురదృష్టం మీదా, తన తలరాత మీదా. గీత మీదాచింత పడింది. కొంతసేపు సత్యమూర్తి వేగిరపాటు ధోరణికి విచారపడింది. ఆఖరికి అదీ ఇదీ కలిసి గిరీశం క్రూరత్వం మీద ద్వేషంగా ధ్వజమెత్తింది.

అతనిమీద కసీ, కావేషమూ అంతకంతకూ పెరుగుతూ. "ఇంతంతై - మూడింతంతై" అన్నట్టు విశ్వరూపం ధరించింది,

ఆ క్షణాన కరుణకే శక్తి వుంటే జ్వలించే ఆమె మానసం మరుక్షణం దావాగ్నిలా నాల్కలు జాపుతూ గిరీశాన్ని మాడ్చి మసిచేసి వుండేది.

* * *

మర్నాడు కరుణ హుషారుగా లేచింది. చకచకా తన పనులు ముగించుకున్నది. ఒద్దంటున్నా వినకుండా చేతిలోపని లాక్కుని తల్లికి సాయం చేసింది.

కూనిరాగాలు తీసుకుంటూ ఏవేవో రాసుకున్నది ఖాళీ లేకుండా ఏవేవో కల్పించుకుని తిరిగింది.

ఇరుగు పొరుగు వాటాలకి పిలవని పేరంటంగా వెళ్ళి పలకరించి వచ్చింది. ట్యూషన్ పిల్లలు వస్తే, "ఇవాళ పాఠా

లొద్దు ఈ పూట మనకి ఆటవిడుపు" అని చెప్పి కథలూ, కబుర్లూ చెప్పి పంపేసింది.

తల్లితో "ఇవ్వాళ స్పెషల్ చెయ్యమ్మా" అని అడిగి మరీ తనకిష్టమైన పిండివంట చేయించుకున్నది.

తల్లి చేసింది తింటూ, "బ్రహ్మాండంగా కుదిరిందమ్మా. ఫరవాలేదు. వంటలక్క కూతురి వనిపించావ్. రేపు నా సంపాదన లేకపోయినా హాయిగా బ్రతికేయగలవ్" అని సందర్భం లేకుండా హాస్యమాడింది.

తల్లి తెల్లబోతూంటే, "వట్టినే అన్నాను లేమ్మా... అని తేలగొట్టింది.

కూతురి వైఖరి చిత్రంగా అనిపించింది శకుంతలమ్మకి. హాస్యానికైనా ఇతరులని నొప్పించే మనస్తత్వం కాదు కూతురిది. పైగా ఈ తెచ్చిపెట్టుకున్న ఉత్సాహమేమిటి? అనవసర చురుకుతనమెందుకు?

ఆవిడ భయం ఆవిడది.

వారంరోజుల క్రితంవరకూ సత్యమూర్తి రెండుపూటలా తీరుపోకుండా వచ్చేవాడు. కరుణా అతనూ ఏవేవో చెప్పుకునే వాళ్ళు, నవ్వుకునేవాళ్ళు.

టీ పార్టీ అనీ, పిలుపులనీ, పూలదండలనీ సంప్రదించి-కునే వాళ్లు. మధ్యమధ్య తనను సలహాకోసం పిలుస్తూండేవాళ్లు

పెద్దింట్లో పెళ్ళికి వందమంది పడే హడావిడి వీళ్ళిద్దరూ పడుతున్నందుకు లోలోపల నవ్వుకునేది.

అలాంటిది ఐదురోజుల బట్టి సత్యమూర్తి గుండేసినట్టు ఫికరు లేదు.

"అదేమే?" అని అడిగితే కరుణ సరైన సమాధానం ఇవ్వటం లేదు. ముభావంగా వుంటోంది.

వాళ్ళిద్దరూ మాటా మాటా అనుకున్నారేమో... ఆ మాట పట్టింపు ఎంత దూరం పోయిందో...ఆ ఆందోళన కప్పి పుచ్చుకోటానికే కూతురు ఇలా అక్కర్లేని హడావిడి చూపిస్తుందేమో అని ఆవిడ బెంగ.

ఈరోజు ప్రొద్దుట రమణి మరో కొత్త సమాచారం అందించింది, సత్యమూర్తి హైదరాబాదు వెళ్ళాట్ట.

"మీకు చెప్పకుండానే వెళ్ళాడా?" అంది కళ్ళు తిప్పకుంటూ.

సత్యమూర్తి గది పక్కవాటానే రమణి వాళ్ళది.

"పెళ్ళి రేపటెల్లుండిలో పెట్టుకుని ఇప్పుడా వెళ్ళడం? ఇదేం విడ్డూరం? తత్తరపుట్టింది శకుంతలమ్మకి.

ఆదుర్దాగా వచ్చి కూతుర్ని అడిగింది "నీకైనా చెప్పి వెళ్ళాడా?" అని.

కరుణ హాయిగా నవ్వి "నీ కెందుకమ్మా అంతకం గారు? రాత్రికి ఆయన వచ్చేస్తారు. అనుకున్నవన్నీ యథావిధిగా జరుగుతాయి." అన్నది అభయమిస్తున్నట్టు.

శకుంతలమ్మ స్థాయీ పడింది.

అసలు నిజం కరుణకి తెలుసు. అతను నిన్నప్రయాణ సంరంభంలో వుంటే చూసి వాళ్ళ ఆఫీసు ప్యూను నడిగి తెలుసుకున్నది. సత్యమూర్తి లాంగ్ లీవ్ పెట్టాడట. కరుణకి ఇంకోటి గూడా తెలుసు.

శెలవు అనంతరం అతనికి తప్పని సరిగా మరోచోటికి ట్రాన్స్ఫర్ అవుతుంది. లేదా చేయించుకుంటాడు. అంచేత అతనీ వూరునించి పూర్తిగా నిష్క్రమించినట్టే.

* * *

మసక చీకటి విడకుండానే నిద్రలేవటం శకుంతలమ్మకి అలవాటు. ఆదినమూ అలాగే నిద్రమంచం దిగకుండానే అరిచేతిలో (శ్రీ)రామ చుట్టుకుని లేచివెళ్ళి వంటింటి తలుపుతీసింది రెండడుగులు వేసిందో లేదో...నుదుటి కేదో తగిలి నట్టయి తలపైకెత్తి చూసింది.

పైన కరుణ దూలానికి వేలాడుతోంది.

కెవ్వున అరుస్తూ చలనం లేకుండా పడిపోయింది శకుంతలమ్మ.

* * *

ఇంతటితో కరుణ కథ సమాప్తి కాలేదు.

కరుణని కొనవూపిరితో ఆస్పత్రిలో పడేశారు.

రెండు మూడు రోజుల్లో వివాహం జరుగనుండగా ఈ అఘాయిత్యమేమిటని అందరినీ వేధించే సందేహాన్ని కరుణ కొంగుకు పిన్ చేసిన ఉత్తరం తీర్చింది.

నేనిలా ఆత్మహత్యకు ఒడబడటానికి కారకుడు గిరీశం. మీకు వాడు పెద్దమనిషి అవునేమో కానీ నాకు వాడు కన్న పిల్లల్ని సయితం కనికరం లేకుండా దారుణంగా హత్యచేసే హంతకుడు, అమాయిక ఆడపిల్లల్ని బలవంతాన పడుపు కొంప లకు తార్చే నీచుడు, స్మగ్లింగ్ వ్యాపారంలో జేబులు నింపు కుంటున్న దేశద్రోహి.

దురదృష్ట వశాత్తూ నేనివన్నీ నిరూపించలేకపోవచ్చును గానీ పైవన్నీ కటికసత్యాలు.

భార్య పోగానే వాడి దుర్మార్గపు దృష్టి నామీదపడింది ఆయన్ని పెళ్ళి చేసుకొనటానికి నిరాకరించాననే అక్కసుకొద్దీ సహృదయంతో నన్ను చేపట్టవచ్చిన సత్యమూర్తి మనసు విరి చాడు. నకిలీఫొటోలు చూపించి నేనంటేనే అసహ్యపడేలా చేశాడు.

అన్నివిధాలా మదించి వున్న అతగాడి దేష్ట్యాన్ని, అబలని పికిలిపిట్టలాంటి దాన్ని ధన బలంగానీఅండబలంగానీ లేనినాకు ఏవిధంగా అడ్డుకోగలను?

ప్రేమించి జీవితాంతం బాసట అవుతాడనుకొన్న వ్యక్తి నన్ను కాదని మొహంచాటేశాడు.

నన్ను కబళించ జూస్తున్న ఆరాబందునికి హృదయం చంపుకుని తనువు అర్పించలేను.

అమాయాదారి ఫొటోలు బయట పెడితే పరువుగా బ్రతుకుతున్న నేను బజారున పడక తప్పదు.

అన్నిదారులూ మూసిమరణమేశరణ్యంచేశాడా గిరిశం. మీరు నమ్మిన నమ్మక పోయిన ఇది నిజం. శెలవు.

కరుణ.

కరుణ చేసిన సంచలనాత్మకమైన పని ఏమిటంటే ఇదే మాదిరి ఉత్తరాలు ఇంకా వివరంగా రాసి ఆ ముందు రోజే కలక్టరుకీ, యస్ పీ కీ గూడాపోస్టు చేసింది.

కన్నె పిల్లల జీవితాలతో చెలగాటమాడే ఆపాషాండుణ్ణి శిక్షించి తన ఆత్మకు శాంతి కలిగజేయమని వారినిప్రార్థించింది. కొత్తగా కార్పొరేషన్ అయిన ఆసిటీ స్పెషల్ యస్. పి. భరద్వాజ నిజాయితీపరుడు స్ట్రిక్టు మనిషి. అవినీతికీ, అక్రమాలకీ అన్యాయాలకీ అతడి పేరు సింహస్వప్నం.

ఎలాంటి ప్రలోభాలకీ లొంగడు. ఆశించడు, బ్రహ్మ దేవుడైనా తప్పుత్రోవ తొక్కితే పట్టుకోటానికి జంకడు, అటువంటి సాహసం కలమనిషి.

ముక్కుకు సూటిగా పోయేవారికి ఎదురుదెబ్బలుతప్పవు.

అతని మూలంగా శిక్షలు పడిన దుండగులు కొందరు అతని ఒక్కగానొక్క కూతుర్ని ఎత్తుకుపోయి రేప్ చేశారు.

ఆమె సూయిసైడ్ చేసుకున్నది.

దానితో అతడు బుద్ధితెచ్చుకుని తగ్గిపోతాడనుకున్నారు.

కానీ, "ఇంతకంటే నాకుచేయగల చెడుపుమరేంలేదు." అంటో ముందుకంటే విజృంభించి నేరస్తులని పరిపరి చట్టానికి అప్పజెప్పటం మొదలు పెట్టాడు.

అటువంటి నీతిమంతుడికి కరుణ ఉత్తరం అందింది.

పోలీసులు రంగంలోకి దిగారు.

భరద్వాజ తీగలాగాడు. డొంకకదిలింది.

కరుణ ఇంట్లో ఫొటోలు దొరికాయి. ఆఫొటోలు తీసిన స్టూడియోని పట్టుకున్నారు. వాటి కీలకమేమిటో అవి ఎవరు తయారు చేయించారో వెల్లడయింది.

పోలీస్ ఇంటరాగేషన్‌లో ఆఫొటోగ్రాఫర్,రంగమ్మా చాలా విషయాలు బయటపెట్టారు.

గిరీశం అరెస్టయాడు.

ఈసమయంలో ఘరానా వ్యక్తులు కొందరు గిరీశానికి బాసటగా నిలబడ్డారు.

వాళ్ళకీ గిరీశానికీ ఉన్నపాత్రేమిటో భరధ్వాజ పరిశోధనకి దిగివెలికితీశాడు.

దానితో గిరీశం తెరవెనక బాగోతాలన్నీ బయటకు వచ్చాయి. కేసుబలపడింది.

అందరినీ విస్మయపరిచిన విషయమేమిటంటే, పికిలిపిట్ట లాంటి దాన్ని అన్నకరుణ తన ఆత్మహత్యా ప్రయత్నానికి ముందే గిరీశం చుట్టూరా పంచాగ్నులు రగిలించటం.

అవూరినుంచే వెలువడే దినపత్రిక ఒకటున్నది.

నిజాయితీయైన వార్తలకూ పక్షపాతంలేనివాఖ్యాలకూ ప్రసిద్ధిపొందింది.

ఆపత్రిక ఎడిటరుకుకూడా కరుణఉత్తరంచేరింది.

పాపం ఆసంపాదకుడు ఆశ్చర్యపడి కంగారు పడుతూ ఒక విలేఖరిని కరుణ ఇంటి ఎడ్రసుకుతరిమాడు.

ఆస్పత్రిలో ఈలోకానికా పైలోకానికా అని ఊగులాడుతోన్న ఆమె పరిస్థితినీ మృత్యువుతో పోరాడుతోన్న డాక్టర్లనీ స్వయంగా చూశాడు. ద్రవించి పోయాడు.

గిరీశం కాండక్టుమీద ముందునుంచీ అనుమానమే ఆయనకి. ఈగొడవతో అది రూఢి పడింది.

మర్నాడు తమ పేపర్లో మొదటి పేజీలోనే పెద్దపెద్ద అక్షరాల శీర్షిక కింద కరుణ ఉత్తరం యథావిధంగా అచ్చువేయించాడాయన.

అంతేనా-

"స్త్రీని పూజించి గౌరవించమని ఉద్బోధించే సంస్కృతి మనది.

కానీ ఆధర్మాన్ని ఎంత మంది పురుషులు గౌరవించి ఆచరిస్తున్నారు?

పూజించవద్దు. కనీసం సాటి మనిషిగా, తమకులానే హృదయమూ,దానికో అనుభూతి వున్న వ్యక్తిగా గుర్తించే మగవాళ్ళెంత మంది?

ఎంతోమంది మహానుభావులు స్త్రీ జాతి ఉన్నతికి పాటు పడ్డారు నిజమే.

అయినా ఇప్పటికీ స్త్రీస్థానం మారకపోవటానికి కారణమేమిటి?

అంతకు రెట్టింపు మంది స్వార్థ బుద్ధితో స్త్రీని భోగవస్తువుగా కేవలం తనకు సేవలు చేయటానికి పుట్టిన బానిస జీవిగా నొక్కి వుంచడమే.

తలఎత్తి చూడబోయె ఆడదాన్ని మాతోటిదే తప్ప

నీకు వేరే ప్రపంచం వుండ కూడదని శపిస్తూ కర్కశ హస్తాల తోఎప్పటికప్పుడు అణిచి అధోగతికి దింపుతూండటమే!

అలాంటి వారున్నారనటానికి నిదర్శనమే ఈగిరీశం.

పచ్చని పైర్లని పొట్టను పెట్టుకునే క్రిమికీటకాలను సంహారించినట్టే మన సమాజంలో జాతి వినాశనానికి దోహదం చేసే ఇటువంటి చీడపురుగుల్లాంటి పెద్ద మనుషుల్ని గూడా ఏరి శిక్షించాలి.

అప్పుడే కరుణలాంటి అమ్మాయిల కధలకు సుఖాంతం. అంటో ఘాటుగా సంపాదకీయం కూడా రాశాడు.

ఆరోజు ఎవరి చేతుల్లో చూసినా, ఆపేపరే, ఎవరినోట విన్నా నదేశం పేరే. అంతే.

అతను డబ్బు మదుపుపెట్టి సంపాదించిన కీర్తి ప్రతిష్టలు మోపు పెట్టినిలబెట్టిన ఆటబొమ్మ ఆమోపు తియ్యగానే కూలి పోయినట్టు ఈదుమారంతోఉప్ మనిఊదినట్టుగాలికెగిరిపోయింది.

మరుగున పడిన అతని తాత తండ్రుల తరాలగాధలన్నీ వెలికిలాగి "వీడు మాత్రం ఆతానులో గుడ్డకాడా" అంటూ అంతా బాహాటంగా చెప్పుకున్నారు.

గిరీశం ప్రాణంగా చూసుకునే పరువుపోయింది.బ్రతుకు బజారున పడింది.

మృత్యువును అహ్వానిస్తూ ఎదురు వెళ్ళినకరుణని అమృత్యుకౌగిలినించి బలవంతానా లాగి ఇవతల పడేశారు డాక్టర్లు.

కరుణని ఆరోజు అస్పత్రినించి ఇంటికి తీసుకువచ్చారు.

యస్. పి. భరద్వాజ స్వయంగా కరుణను ఇంటివరకూ వచ్చి దిగవిడిచాడు.

కరుణ అంటే ఆయనకు ఎంతోసాను భూతి, వాత్స ల్యమూ ఏర్పడ్డాయి.

కోర్టు గొడవలు తెమిలే వరకూ వారికి అన్నివిధాలా సాయపడతానని శకుంతలమ్మకు మాట ఇచ్చాడాయన.

కరుణ వచ్చిందని తెలిసి ఆచుట్టు పక్కలవాళ్ళు... ఆమె శిష్యులు, వారి పెద్దలు, తెలిసినవాళ్ళు, ఆమె కథ విన్న వాళ్ళు... ఒకరేమిటి తీర ప్రజలా ఒకరి వెంట ఒకరు వచ్చి చూసి వెడుతున్నారామెను.

వారికి మొహమెత్తి చూపలేని బిడియంతో నీరసం ఒం కన అటు తిరిగి పడుకునే వుండిపోయింది కరుణ.

వారికి మాత్రం ఒక మేక వన్నెపులి అసలు రూపు బయట పెట్టి, అతని ఆటకట్టించడానికి, కారకులయిన కరుణ అంటే గౌరవంగానే వుంది.

వచ్చిన వారడిగే యక్షప్రశ్నలకి రమణి, శకుంతలమ్మ కొన్నిట్ని మింగేసి కొన్నిట్ని దాటేసి కొన్నిటికి జవాబు లిచ్చి పంపుతున్నారు.

సాయంత్రమయింది. కనుచీకటి పడుతోంది. దీపదీపాల వేళ.

"ఇక ఎవరన్నా ఒస్తే ఏదో ఒకటి చెప్పి తిప్పిపంపెయ రమణి, నాదగ్గరకు దీసుకురావద్దు నేనిక ఈ తాకిడి భరించలేను అన్నది కరుణ.

"ఇక ఒక్కరే ఉన్నారు కరుణా నీ దరిశనం కోసం నిరీ క్షిస్తూ, నీ అనుమతి కోసం ప్రతీక్షిస్తూ." అన్నది వాణి భావగ ర్భితంగా నవ్వుతూ.

"లాభం లేదన్నగా రమణీ నాటపిక్కెందుకు పరీక్ష పెడ తావ్ చెప్పు విసుగ్గా అన్నది కరుణ.

ఉహునేనువారికిఆశపెట్టానునీసందర్శనభాగ్యంకలిస్తానని, ఉదయం నించీ నిన్నంటి పెట్టుకుని ఈజన ప్రవాహంపు ఉరవడి నిన్ను తాకకుండా రక్షించి నందుకైనా నామాట దక్కించు. ఆవర మివ్వు".అర్థిస్తున్నట్టు దోసి లొగ్గింది నాటకీ యంగా.

కరుణ సన్నగా నవ్వింది.

"అయినా ఎవరుబాబూ అంత నన్ను చూడాలని కొట్టుకు లాడి పోతున్న వాళ్ళు?"

"అదిగో వచ్చారు.ఎవరో చూడు". గుమ్మంకేసి చూపించింది రమణి,కరుణరెప్ప లెత్తింది.

గుమ్మం లో సత్యమూర్తి,

సంభ్ర మాశ్చర్యాలతో కరుణ కళ్ళు తళుక్కున మెరిసినాయ్.

"నన్ను క్షమించ గలవా"! అంటున్నాయ సత్యమూర్తి చూపులు.

"ఇందుకే కాబోలు నన్ను భగవంతుడు బ్రతికించింది" బదులిస్తున్నాయ కరుణ కనులు.

సత్యమూర్తి మెల్లగా నడిచి కరుణ దగ్గరకు వచ్చాడు. ఆమె చేయి తనచేతిలోకి తీసుకున్నాడు.

అది మాఘ మాసం.

వంటింట్లో రమణి శకుంతలమ్మతో ముహూర్తం ముచ్చ టలు ముచ్చటిస్తోంది.

—: సమాప్తం :—

VNC01 A 101

179

## BHARATAMLOO OKA AMMAYI

By Valiveti Naga Chandravathi

"నువ్వెంత ధూర్తుడివో నాకు బాగా తెలుసునని నీకూ తెలుసు. నిన్ను పెళ్ళాడేకంటే పెట్టుకు చావడం మెరుగు. నన్నింక కవ్వించకు" ఒక్క విదిలింపుతో అతన్ని టుకుని వెళ్ళిపోయింది కరుణ-

సంగీతం పాఠాలు చెప్పి తననీ, తల్లినీ పోషించుకుంటున్న ణమీద పగబట్టాడు మేకవన్నె పులిలాంటి గిరీశం.

పుట్టినక్షణంలోనే, పొత్తిళ్ళల్లో కనుగుడ్డు తెరవని కన్నబిడ్డ నిర్దాక్షిణ్యంగా గొంతునులిమి చంపిన రాక్షసుడు గిరీశం.

తాళికట్టిన భార్య ఆత్మహత్య చేసుకుంటే ఏమాత్రం ధపడని దుర్మార్గుడు గిరీశం. తనని కాదన్న కరుణ జీవి న్ని నాశనం చెయ్యడానికి నీచమైన కుట్ర పన్నాడు.

ఫలితంగా కరుణ ఆత్మహత్యకి తలపడి ఉరివేసుకుంది. చావు గిరీశం మెడకి ఉరితాడు బిగించాలని అతని కు పైఎత్తు వేసింది. ఏమిటది?

కరుణ మరణించిందా? గిరీశం ఏమయ్యాడు?

నేటి మధ్యతరగతి కుటుంబాల్లోని దయనీయమైన స్థితి గతులని ఆధారం చేసుకుని యీనాటి వ్యవస్థని కళ్ళకు కట్టి న చిత్రించిన నవల - భారతంలో ఒక అమ్మాయి.

స్త్రీ జాతికి ధైర్యాన్ని, ఆత్మస్థయిర్యాన్ని కలిగిస్తూ వేటి నాగచంద్రావతి సృష్టించిన అద్భుత రచన-భారతంలో ఒక అమ్మాయి.

**Nageswari Publications**

Kaleswara Rao Road, Suryaraopet,

VIJAYAWADA - 2 Phone: 64817

| మనసు ఫౌండేషన్ |
|---|
| పుస్తకాల పరిశీలనాపట్టిక |

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | MNC01A101 |
| పుస్తకం పేరు | భారతంలో బకబ్రహ్మము |
| తారీఖు | 13/8/2023 |
| ముందు అట్ట | ఉంది |
| వెనుక అట్ట | ఉంది |
| మొత్తం పేజీలు | 177 |
| పెద్ద సైజు పేజీలు | లేవు |
| ఖాళీ పేజీలు | ci, 173 |
| లేని పేజీలు | లేవు |
| తయారు చేసినది | K. Ramesh Babu |
| పేజీలు విడదీసినది | 〃 |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | lakshmi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | |
| పరిస్థితి | |